తిరుప్పావై 27వ పాశురం

చిత్రం: కేశవ్ వెంకటరాఘవన్

కూడారై వెల్లుమ్ శీర్ గోవిన్దా! ఉన్దన్నై
ప్పాడిప్పఱై కొణ్డుయామ్ పెఱుశెమ్మానమ్
నాడుపుగళుమ్ పరిశినాల్ నన్రాగ
చ్చూడగమే తోళ్ వళైయే,తోడే శెప్పూవే,
పాడగమే,రెున్రనైయ పల్ కలనుమ్ యామణివోమ్,
ఆడై యుడుప్పోమ్, అదన్ పిన్నే పాల్ శోఱు
మూడ నెయ్ పెయ్ దు ముళఙ్గైవళివార
కూడి యిరున్దు కుళిర్ న్దేలోరెమ్బావాయ్

పాశురార్థం: కృష్ణుడు గోపిక విన్నపాలు విని వారి అభీష్టాలు నెరవేరుస్తాడు. 'ఓ గోవిందుడా, శత్రుజిత్‌వైన నీ మహిమ కొనియాడ తరమా. నిన్ను స్తుతించే శక్తి కూడా నీనుండే పొందియున్నాము. నీవు దయచేసిన ఢక్కతో వ్రతమాచరించిన మేము, తత్ఫలితంగా లోకమందు యశస్సును, గొప్ప శోభను పొందగలము. మేము కంకణాలు, బాహుబంధాలు, కర్ణాభరణాలు, పుష్పాభరణాలు, ముద్రికలు, మంజీరాలతో అలంకృతలమౌతాము. నూతనవస్త్రాలు ధరించెదము. నీతో గూడి పరమానందంగా క్షీర, ఘృతములతో ధారలుగారే మృష్టాన్నభోజనములు ఆరగించెదము. నీ సాన్నిహిత్యంలో, సాంగత్యంలో హృదయోల్లాసం పొందెదము.'

– శ్రీదేవి మురళీధర్

● ముగ్గు-ముచ్చట

ఇ. శ్రీలత
గాయత్రీనగర్,
హైదరాబాద్.

29 చుక్కలు
1 వచ్చేవరకు
(సరిచుక్క)

డిజైన్ ముగ్గు

బి. సుందరి
సైదాబాద్
హైదరాబాద్

గంధోళి దీప్తి
వేపగుంట,
విశాఖపట్నం

23 చుక్కలు
12 వరకు
మధ్య చుక్క



పిహూ

ఆమె

హెలెన్

సాక్షి ఫామిలీ

నల్లగొండ ॥ శనివారం
11-1-2020

నువ్వే నీ ఆయుధం

పరిశీలన..
గ్రాహ్య శక్తి రెండేళ్ల పాపను రక్షించాయి..
పేపర్ నాప్‌కిన్స్, క్రైమ్‌సీన్ టేప్ పాతికేళ్ల అమ్మాయి పరువును కాపాడాయి..
పాలిథిన్ కవర్లు, కార్టన్స్.. ఇరవైఏళ్ల పిల్లను ప్రాణాలతో నిలబెట్టాయి.. నాలుగు గోడల మధ్య బందీ అయినప్పుడు ఆలోచనను మించిన ఆధారం ఉండదు!
కామన్‌సెన్స్‌కు సరితూగే ఆయుధం దొరకదు!
ఆ ముగ్గురూ ఉపయోగించింది అదే!
ఆ సంఘటనలు నిరూపించిన సత్యమూ అదే!
సినిమా కథలే.. జీవితానికి పనికొచ్చే పాఠాలు!!

హండ్రెడ్‌కు డయల్ చేయాల్సింది.. ఏమైనా సరే జనం ఉన్నవైపు వెళ్లాల్సింది. తొమ్మిదిగంటల రాత్రి రోడ్డు మీద నిలబడ్డా.. టోల్‌ప్లాజాలో ఉన్నా చూసేవాళ్లు ఏమనుకుంటారు? రోజూ వచ్చేపోయే రూటే. అయినా పరిసరాలను ఎప్పుడూ గమనించింది లేదు. అందుకే పంక్చర్, మెకానిక్ షాపులు ఎక్కడుంటాయో.. ఏ వేళ వరకూ తెరిచి ఉంటాయో తెలియలేదు. కనీసం తెలిసినట్టు నటించే స్మార్ట్‌నెస్‌నూ ప్రదర్శించలేదు. తెగువ చూపించాల్సిన టైమ్ భయంతో భర్తీ అయింది. మనుగడ వాంఛ ఎంతటి పరిస్థితులనైనా ఎదుర్కొనేలా చేస్తుంది.. ప్రాణాలతో నిలబెడుతుంది. చదువుల ఫ్యాక్టరీల్లోంచి మార్కుల అచ్చులుగా బయటకు వచ్చిన అమ్మాయిల్లో ఈ సర్వైవల్ ఇన్‌స్టింక్టే కొరవడిందని 'దిశ' సంఘటన రుజువు చేసింది. ఉండాల్సిన అవసరం ఎంత ఉందో ఇటీవల వచ్చిన కొన్ని సినిమాలు.. పిహూ (హిందీ), 'ఆడై' (తమిళ సినిమా.. తెలుగులో 'ఆమె'గా డబ్ అయింది), 'హెలెన్' (మలయాళం) చూపించాయి.

పిహూ...

రెండేళ్ల పిల్ల పిహు. ఇంకా అమ్మ పాలు విడవని కూన. పిహూ రెండో పుట్టినరోజు రాత్రి అమ్మ, నాన్న పోట్లాడుకుంటారు. మరుసటి రోజు వేకువ జామునే మీటింగ్ ఉందని తండ్రి ఊరెళ్లిపోతాడు. మనస్తాపంతో ఉన్న తల్లి.. నిద్ర మాత్రలు మింగుతుంది. ఉదయం నిద్రలేచిన పిహూ.. పక్కనే అచేతనంగా ఉన్న 'అమ్మ'ను నిద్రలేపుతూంటుంది.. 'టాయ్‌లెట్‌కి' తీసుకెళ్లమని. ఎంతకీ కళ్లు తెరవని అమ్మను దాటుకుంటూ తనే బాత్రూమ్‌లోకి వెళ్తుంది. వచ్చి మళ్లీ అమ్మ పక్కనే పడుకుంటుంది. కాసేపాగి మళ్లీ తల్లిని తడుతుంది.. ఆకలేస్తోంది పాలిమ్మని. స్పందించని అమ్మ వైపు తిరిగి తానే పాలు తాగాలని ప్రయత్నిస్తుంది. బిగుసుకుపోయిన తల్లి శరీరం కదలక పోయేసరికి.. విసిగిపోయిన ఆ పిల్ల.. వంటింట్లోకి వెళ్లి.. స్టూలును గ్యాస్‌గట్టు దగ్గరకు లాక్కొని దాని మీద ఎక్కి స్టవ్ ఆన్ చేస్తుంది. బ్రెడ్ కాల్చుకోవాలని ట్రై చేసి చేయి కాల్చుకుంటుంది. ఏడుస్తూ తిరిగి బెడ్‌రూమ్‌లోకి వస్తుంది. తండ్రి ఊరు వెళ్లేముందు బట్టలు ఇస్త్రీ చేసుకోవాలని ఐరన్ బాక్స్ ఆన్ చేస్తాడు. కరెంట్ పోవడంతో స్విచ్ ఆఫ్ చేయకుండా అలాగే వదిలేసి.. ఫ్లయిట్ టైమ్ అవుతోందని వెళ్లిపోతాడు. కరెంట్ వచ్చి ఇస్త్రీ పెట్టె వేడుక్కుతుంటూంటుంది. ఆ స్విచ్ బోర్డ్‌కే ఉన్న ఇంకో ప్లగ్‌లో సెల్ ఫోన్ చార్జింగ్ అవుతూంటుంది. వంటింట్లో స్టవ్ వెలుగుతూంటుంది. ఈ లోపు ఆ ఫోన్ రింగ్ అవుతుంది. ఆ టేబుల్ దగ్గరకు వెళ్తుంది ఫోన్ తీసుకుందామని పిహూ. కాని ఆ టేబుల్ ఈ అమ్మాయికి అందదు. వైర్ పట్టుకొని లాగేసరికి పక్కనే నిలువుగా పెట్టి ఉన్న ఐరన్ బాక్స్ టేబుల్ మీద పడిపోయి కాలుతూంటుంది. బెడ్‌రూమ్ దగ్గరున్న ఫినాయిల్ క్యాన్‌లో ఫినాయిల్ తెల్లగా కనిపించేసరికి పాలు అనుకొని తన బాటిల్లో పోసుకుంటూంటే మొత్తం ఒలికిపోయి ప్రమాదం తప్పుతుంది పిహూకి. ఇలా ఓ 24 గంటలు ఒక రెండేళ్ల పాప ఆ ఇంట్లో ఎలా గడిపింది.. ఆ వయసుకు తగ్గ స్పృహతో ప్రమాదాల బారి నుంచి ఎలా బయటపడింది అన్నదే ఈ సినిమా. 2014లో ఓ వార్తాపత్రికలో వచ్చిన వార్త ఆధారంగా తీశారు.

ఆమె..

తమిళంలో 'ఆడై' పేరుతో వచ్చింది. 'ఆడై' అంటే 'దుస్తులు' అని అర్థం. కథానాయిక కామిని టీవీ యాంకర్. ప్రేక్షకులను బకరా చేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తూంటుంది. అలా ఒక రోజు సివిల్స్ మెయిన్స్ పరీక్షకు హాజరవబోతున్న ఓ పేదింటి అమ్మాయినీ బకరా చేస్తుంది. దాంతో ఆ రోజు ఆమె ఆ పరీక్ష రాయలేకపోతుంది. ఆ బాధను, అవమానాన్ని మనసులో పెట్టుకుంటుంది ఆ అమ్మాయి. తర్వాత కామిని బర్త్‌డే వస్తుంది. ఆ రాత్రి తన సహోద్యోగులతో తమ ఆఫీస్ పాత బిల్డింగ్‌లో పార్టీ చేసుకొని మత్తులో ఒళ్లు తెలియకుండా బాత్రూమ్‌లో పడిపోతుంది కామిని. మెలకువ వచ్చేసరికి నగ్నంగా ఉంటుంది. బాత్రూమ్‌లోంచి బయటకు రాగానే సెక్యూరిటీ వాళ్ల అలికిడి వినిపించడంతో నగ్నంగా ఉన్న తన శరీరం వాళ్ల కంటపడకుండా టేబుల్ కింద దాక్కుంటుంది. ఆ పాత బిల్డింగ్‌కి తాళం వేసే ముందు అన్ని అంతస్తులు చెక్ చేసుకుంటూ కామిని ఉన్న అంతస్తుకీ వస్తారు సెక్యూరిటీ వాళ్లు. ఎవరూ లేరని నిర్ధారించుకొని తాళం వేసి వెళ్లిపోతారు. బ్యాటరీ చివరి దశలో ఉన్న సెల్‌ఫోన్ తప్ప ఇంకే ఆధారం ఉండదు కామినీకి. ఆ రాత్రి ఏం జరిగిందో.. తన ఒంటి మీద బట్టలు ఎలా మాయమయ్యాయో.. తన కొలీగ్స్ ఎక్కడికి వెళ్లారో.. అంతు చిక్కకపోగా భయమూ మొదలవుతుంది ఆమెకు. బాత్రూమ్‌లో ఉన్న పేపర్ నాప్‌కిన్స్ రోల్, క్రైమ్‌సీన్ టేప్‌తో ఒళ్లంతా చుట్టుకుంటుంది. ఫోన్ డెడ్ అవకముందే తన తల్లికి, ఫ్రెండ్స్‌కి ఫోన్ చేసి తను ఉన్న పరిస్థితి చెప్పాలనుకుంటుంది. సిగ్నల్స్ లేక ఫోన్ పోదు. ఈలోపు ఆకలి మొదలవుతుంది. ఫుడ్ ఆర్డర్ చేసుకునేలోపు ఫోన్ డెడ్ అవుతుంది. ఆ విచిత్రమైన స్థితి నుంచి బయటపడ్డానికి 24 గంటలు పోరాడుతుంది. తన కామన్‌సెన్స్‌ను ఉపయోగించి దుస్తులు తెప్పించుకొని, సురక్షితంగా ఆ బిల్డింగ్ నుంచి బయటకు వస్తుంది కామిని. ఇంతకీ ఆమెకు అలాంటి దుస్థితి కల్పించింది ఎవరో కాదు కామిని వల్ల సివిల్స్ మెయిన్స్ రాయలేక పోయిన అమ్మాయే.

హెలెన్..

మలయాళం సినిమా. కథానాయిక పేరు హెలెన్. అనారోగ్యంతో ఆమె తల్లి చనిపోతుంది. ఆ బాధలో ఉంటాడు తండ్రి. నర్సింగ్ కోర్స్ పూర్తయి కెనడాలో నర్స్ ఉద్యోగం సంపాదించుకునేందుకు కావల్సిన ట్రైనింగ్ తీసుకుంటూంటుంది. పార్ట్‌టైమ్‌గా ఒక మాల్‌లోని 'మెక్ డొనాల్డ్స్'లో పనిచేస్తూంటుంది. అజహర్ అని హెలెన్‌కు బాయ్‌ఫ్రెండూ ఉంటాడు. ఒకసారి రాత్రి హెలెన్‌ను ఇంటిదగ్గర డ్రాప్ చేయడానికి వెళ్తూండగా డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు అజహర్. దీంతో ఆమె ప్రేమ వ్యవహారం తండ్రికి తెలుస్తుంది. మనసు నొచ్చుకొని హెలెన్‌తో మాట్లాడ్డం మానేస్తాడు. తండ్రిని బాధపెట్టానన్న పశ్చాత్తాపంతో అజహర్‌కి దూరంగా ఉంటుంది హెలెన్. ఈలోపు ఆమెకు కెనడాలో ఉద్యోగం ఖాయం అవుతుంది. వెళ్లేలోపు తండ్రిని క్షమాపణ అడగాలని విశ్వయత్నం చేస్తుంది హెలెన్. కాని తండ్రి మనసు మారదు. ఒక రోజు మాల్ నుంచే తండ్రికి ఫోన్ చేస్తూంటుంది సారీ చెప్పాలని. తండ్రి ఫోన్ లిఫ్ట్ చేయడు. దాంతో ఇంటికి వెళ్లాలనిపించక రాత్రి పదకొండున్నర దాకా మాల్‌లోనే ఉంటుంది. చివరకు పంచ్ చేసి బయలుదేరబోతూంటే కొలీగ్స్ వచ్చి.. ఆహార పదార్థాలు ఇస్తూ ఫ్రీజర్ (గది లాంటిది)లో పెట్టమని చెప్పి బయటకు వెళ్లిపోతారు. పర్స్, సెల్ ఫోన్ అక్కడే టేబుల్ మీద పెట్టేసి.. ఆ ఆహార పదార్థాలను తీసుకొని ఫ్రీజర్‌లోకి వెళ్తుంది హెలెన్. అప్పుడే అటువైపు వచ్చిన మేనేజర్ .. ఫ్రీజర్ గదికి తాళంలేకపోవడం చూసి.. తాళం వేసి రెస్టారెంట్ క్లోజ్ చేసి ఇంటిదారి పడ్తాడు. ఫ్రీజర్‌లో బందీ అయిపోతుంది హెలెన్. రాత్రి పదకొండున్నర నుంచి తెల్లవారి అయిదు గంటల వరకు మైనస్ పదిహేడు డిగ్రీల సెంటిగ్రేడ్ చలిలో తనను తాను కాపాడుకోవడానికి అక్కడున్న ప్రతి చిన్న వస్తువునూ ఉపయోగించుకుంటుంది. చివరకు ఫోన్ కాల్ సిగ్నల్స్, వాచ్‌మన్ సమాచారంతో ఆ అమ్మాయిని బయటకు తెస్తారు. మిస్సింగ్ కేసుల్లో అయినవాళ్లు, పోలీసులు ఏఏ కోణాల్లో విచారణ జరపాలో కూడా స్పష్టంగా చూపిస్తుందీ సినిమా.

ఏతావాతా.. ఈ మూడు చిత్రాలు ఇచ్చే సందేశం ఒక్కటే. కష్టాల్లో కామన్‌సెన్స్‌ను మించిన ఆయుధం ఉండదు అని. స్వేచ్ఛతో పాటు పరిసరాలపట్ల స్పృహ, సమస్యలను ఎదుర్కొనే ధైర్యం, ఆపదల నుంచి గట్టెక్కే తెగువ.. ఆత్మరక్షణాయుధాలు. మార్కులు, ర్యాంకుల కన్నా ముఖ్యమైనవి. జీవిత దశను మార్చే దిశలు! ●

రేపటి 'ఫన్‌డే'లో..!

సెన్సార్

పాపం క్వాన్!

ఒకరోజు అతను కొంచెం అజాగ్రత్తగా ఉన్నప్పుడు పట్టుబడ్డాడు. అదృష్టరేఖ తగిలిందని ఆనందిస్తూ ఉన్నప్పుడు, విధి ఆడుతున్న చేదు నాటకం అని తెలుసుకునే లోపలే జరిగిపోయిందది. అందరికీ జరిగేదే.. ఏమరుపాటుగా ఉండే ఒక్క క్షణంలో ముంచుకొచ్చే అనర్థం.

అసలేం జరిగిందంటే...

సెన్సార్
(స్పానిష్ మూలం: లూయిసా వాలెన్‌జుయెలా)
కథలో చదవండి.



ఆ విద్యకు ఉన్న పరిమితి

పద్మపాదుడు ఇలా చెప్పాడు:

''విద్యతో పాటు పరిమితులు కూడా తెలుసుకోవాలి. పరకాయ ప్రవేశం చేసిన యోగికి గతం తెలుస్తుంది. ఒక కలలాగా వర్తమానం కూడా తెలుస్తుంది. భవిష్యత్తు మాత్రం అసలు తెలియదు. అంటే తాను విడిచివచ్చిన దేహానికి గానీ, ఈ కొత్త దేహంలో కానీ తదుపరి ఏర్పడబోయే పరిణామాలు, ప్రమాదాలు ముందుగా తెలియవు. కాలు జారితే పాతాళమే... ఇది ఆ విద్యకు పరిమితి''

''పసిగట్టకపోతే ప్రమాదమేనే... రక్షించేవారెవరు?'' అడిగాడు విష్ణుశర్మ.

విష్ణుశర్మ సందేహానికి పద్మపాదుడు చెప్పిన జవాబు ఏమిటి?

శిష్య సమాలోచనలు (శంకర విజయం–29: ఆదిశంకరాచార్యుల జీవిత చరిత్ర)లో చదవండి.

గీతాంజలి

'బాబాయ్... సోడా...' అలవాటు ప్రకారం డ్రైవర్ అరిచాడు. పరుగు పరుగున వెళ్లి సోడా అందిస్తూనే, నిన్నటి కిటికీ వైపు ఆశగా చూశాడు కుర్రాడు. అప్పుడే రాసిన అందమైన ప్రేమకవితలా ఉన్నాడు అతను.

ఆనందం, ఆశ్చర్యం, మళ్లీ ఆ అమ్మాయే...

వయసులో వసంతమే
ఉషస్సులా జ్వలించగా...

'ఈ పాట నాకోసమే రాశాడా!' అనుకున్నాడు కుర్రాడు. ఇది నిజమా? అందమైన భ్రమా? మీరేమైనా చెప్పగలరా?

గీతాంజలి (ఈవారం కథ)లో చదవండి.

ఇంకా...

సంక్రాంతి ముగ్గుల సందడి (ముఖచిత్ర కథనం), రంగరంగ వైభవముగా (యాత్రాయణం: హోగెనకల్), ఆశయాల పందిరిలో.. (పాటతత్వం), వయసు గప్‌చిప్ (బ్యూటీజర్), పండగ ప్రయాణం (ఇసుకచెట్టు: గల్ప్ కథలు), భక్తవత్సలుడు (పురానీతి), ఒక మైక్‌కంలో (హ్యూమర్)...ఇంకా మిమ్మల్ని ఆకట్టుకునే మరెన్నో శీర్షికలు రేపటి ఫన్‌డేలో చదవండి..

రెండు విషయాలు

ప్రేమ దొంగ

ప్రేమించినవాళ్ల కోసం చిన్నచిన్న దొంగతనాలు చేసిపెట్టడం అబ్బాయిలకు మామూలే. యంగ్‌హీరో ఇషాన్ ఖట్టర్ కూడా శ్రీదేవిగారి అమ్మాయి జాహ్నవికోసం చిన్నపాటి దొంగతనం చేశాడు. అయితే ఆమె మీద ప్రేమతో ఆ దొంగతనం చేశాడా, లేక.. తన దొంగతనాన్ని గులాబీ పువ్వులా ఆమెకు అందజేసి ఇన్‌డైరెక్టుగా తన ప్రేమను జాహ్నవికి చెప్పాలనుకున్నాడా అన్నది తెలీదు. నటి నేహా ధుపియా చాట్ షోలో ఇషాన్ ఈ సంగతి చెప్పాడు. సినిమా షూట్ కోసం ఒమన్ వెళ్లినప్పుడు అక్కడి హోటల్‌లో కనిపించిన ఒక అందమైన దిండును దొంగిలించి ఎవరికీ కనిపించకుండా ప్యాక్ చేసి జాహ్నవికి గిఫ్టుగా ఇచ్చాడట. ''ఎందుకు చేశావ్ ఆ పని!'' అని నేహ అడిగితే.. ''తను చెయ్యలేదుగా..''అని చాట్ షోలో కూర్చొని ఉన్న జాహ్నవి వైపు చూసి నవ్వాడు. ''సారా అలీఖాన్, జాహ్నవీ.. వీళ్లిద్దరిలో నీకు ఎవరి యాక్టింగ్ ఇష్టం?'' అని నేహ ఇంకో ప్రశ్న అడిగింది. సారా అక్కడే ఉంది. అయినా.. ''జాహ్నవి'' అనే చెప్పాడు ''జాహ్నవి యాక్టింగ్ ఇష్టమా? జాహ్నవి ఇష్టమా?'' అని నేహ ఇంకో ప్రశ్నేమీ వెయ్యలేదు. అప్పటికే కుర్రాడు తడబడుతున్నాడు మరి. జాహ్నవి తొలి చిత్రం 'ధడక్'లో హీరో అతడే.

తాకితే చాలు

పిల్లల్తో పాటు ఒక పిల్లీ ఇంట్లో ఉంటే భలే సందడిగా ఉంటుంది. అయితే ముద్దొచ్చిప్పుడే దాన్ని చేతుల్లోకి తీసుకుందామంటే ఒప్పుకోదు. తనకు ఇష్టమైనప్పుడు కూడా మనకు ముద్దు రావాలి. మామూలు పిల్లులతో ఇది అయ్యే పనేనా! అందుకే 'ఎలిఫెంట్ రోబోటిక్స్' అనే చైనా స్టార్టప్ కంపెనీ ఓ పిల్లి రోబోను తయారు చేసింది. దానికి 'మార్స్ క్యాట్' అని పేరు పెట్టి.. ప్రస్తుతం లాస్‌వెగాస్‌లో జరుగుతున్న కన్స్యూమర్ ఎలక్ట్రానిక్ షోలో ప్రదర్శిస్తోంది. 'రన్' అంటే పరుగెత్తడం, 'కమ్ హియర్' అంటే దగ్గరకు రావడం.. ఇవి మాత్రమే ఆ పిల్లి రోబో ప్రత్యేకతలు కాదు. పక్కింట్లోంచి చుట్టపు చూపుగా వచ్చి వెళుతుండే నిజమైన పిల్లులతోటీ 'మ్యావ్ మ్యావ్'మంటూ మాటలు కలుపుతుంది. వాటితో కలిసి ఆడుతుంది. బొమ్మల్తో కూడా బొమ్మలా కలిసిపోతుంది. ఇవన్నీ కూడా మనం కమాండ్స్ ఇవ్వకుండానే! అది యాక్టివేట్ అవడానికి చిన్న టచ్ చాలు. ముందు ముందు ఈ పిల్లిరోబో యజమానులు (రోబోను కొనుక్కున్నవారు) ఇచ్చే సూచనలు, సలహాలతో మార్స్ క్యాట్‌ని మరింత ఇంటెలిజెంట్ ఫోలోని చేయబోతున్నాం అని కంపెనీ వాళ్లు చెబుతున్నారు.

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ శనివారం
11-1-2020

రారండోయ్ వంటలు చేద్దాం

ఇరుగమ్మా పొరుగమ్మా రండి. పిన్నిగారూ బామ్మగారూ రండి. చిన్నారి పొన్నారి రారండి. సంక్రాంతి వస్తోంది. సంబరాలు తెస్తోంది. బంధువులు వస్తారు. సందడి చేస్తారు. పొయ్యి వెలిగిద్దాము. సాయం పడదాము. వంటలు చేద్దాము. విందారగిద్దాము. రారండోయ్ వంటలు చేద్దాం...

నువ్వుల బొబ్బట్లు

కావలసినవి: నువ్వులు – ఒక కప్పు; బెల్లం పొడి – ఒక కప్పు; మైదా పిండి – అర కప్పు; గోధుమ పిండి – అర కప్పు; ఉప్పు – చిటికెడు; నెయ్యి – 2 టీ స్పూన్లు; ఏలకులు – 2

తయారీ: ● స్టా మీద బాణలిలో నువ్వులు వేసి దోరగా వేయించి, చల్లారాక మిక్సీలో వేసి మెత్తగా చేయాలి ● ఏలకులు జత చేసి మరోమారు మిక్సీ పట్టాలి ● బెల్లం పొడి జత చేసి అన్నీ కలిసేలా మిక్సీ పట్టాలి ● ఒక పాత్రలో మైదాపిండి, గోధుమపిండి, చిటికెడు ఉప్పు వేసి తగినన్ని నీళ్లు జతచేస్తూ మెత్తగా చపాతీపిండిలా కలుపుకోవాలి ● రెండు టీ స్పూన్ల నెయ్యి జత చేసి మరోమారు కలిపి మూత ఉంచి, పది నిమిషాలపాటు పక్కన ఉంచాలి ● పిండిని చిన్న చిన్న ఉండలుగా చేసుకుని, ఒక్కో ఉండను చిన్న సైజు పూరీలా ఒత్తి, అందులో నువ్వులు బెల్లం మిశ్రమం ఉంచి, అంచులు మూసేసి, చపాతీలా వత్తాలి ● ఇలా అన్నీ తయారు చేసుకోవాలి ● స్టా మీద పెనం ఉంచి వేడయ్యాక, ఒక్కో బొబ్బట్టుకు, నెయ్యి వేసి రెండు వైపులా దోరగా కాల్చుకోవాలి ● వేడివేడిగా తింటే రుచిగా ఉంటాయి.

పాకం గారెలు

కావలసినవి: మినప్పప్పు – అర కేజీ; బెల్లం/పంచదార – అర కేజీ; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా; ఏలకుల పొడి – ఒక టీ స్పూను; నెయ్యి – ఒక టేబుల్ స్పూను

తయారీ: ● మినప్పప్పును ముందు రోజు రాత్రి నానబెట్టాలి ● మరుసటి రోజు ఉదయం, నీళ్లు ఒంపేసి, మినప్పప్పును గ్రైండర్‌లో వేసి గట్టిగా రుబ్బుకోవాలి ● స్టా మీద నూనె కాగాక, పిండిని గారెల మాదిరిగా వేసుకుని, రెండువైపులా ఎర్రగా కాలిన తరవాత కిచెన్ టవల్ మీదకు తీసుకోవాలి ● ఒక పెద్ద గిన్నెలో బెల్లం తురుము/పంచదారకు తగినన్ని నీళ్లు జత చేసి, స్టా మీద ఉంచి తీగ పాకం వచ్చేవరకు కలుపుతుండాలి ● ఏలకుల పొడి, నెయ్యి జత చేసి మరోమారు కలిపి దింపేయాలి ● వేయించి ఉంచుకున్న గారెలను ఈ పాకంలో వేసి సుమారు అరగంట సేపు తరవాత తింటే, రుచిగా ఉంటాయి.

నువ్వుల పులగం

కావలసినవి: బియ్యం – ఒక కప్పు; బెల్లం తురుము – ఒక కప్పు; వేయించిన నువ్వుల పొడి – అర కప్పు; ఎండు కొబ్బరి తురుము – అర కప్పు; ఏలకుల పొడి – ఒక టీ స్పూను; శొంఠి పొడి – అర టీ స్పూను; నెయ్యి – 2 టేబుల్ స్పూన్లు.

తయారీ: ● స్టా మీద బాణలిలో తగినన్ని నీళ్లు పోసి మరిగించాలి ● బియ్యాన్ని శుభ్రంగా కడిగి, మరుగుతున్న నీళ్లలో వేసి బాగా కలియబెట్టి, నువ్వుల పొడి కూడా జతచేసి మరోమారు కలిపి, మూత ఉంచాలి ● బాగా ఉడికిన తరవాత బెల్లం తురుము జత చేయాలి ● శొంఠి పొడి, ఏలకుల పొడి, నెయ్యి జత చేసి కలియబెట్టాలి ● పైన నెయ్యి, ఎండు కొబ్బరి తురుము వేసి వేడివేడిగా అందించాలి.

దబ్బకాయ పులిహోర

కావలసినవి: బియ్యం – అర కేజీ; నూనె – 100 గ్రా.; దబ్బకాయ రసం – అర కప్పు, పచ్చి సెనగపప్పు – టేబుల్ స్పూను; మినప్పప్పు – టేబుల్ స్పూను; ఆవాలు – టీ స్పూను; జీలకర్ర – టీ స్పూను; ఎండు మిర్చి – 10; పచ్చిమిర్చి – 5 (సన్నగా పొడవుగా తరగాలి); కరివేపాకు – 3 రెమ్మలు; ఉప్పు – తగినంత; పసుపు – అర టీ స్పూను; పల్లీలు – 100 గ్రా; జీడిపప్పులు – 10 గ్రా.

తయారీ: ● బియ్యాన్ని శుభ్రంగా కడిగి, తగినన్ని నీళ్లు జత చేసి ఉడికించాలి ● వేడిగా ఉండగానే అన్నాన్ని ఒక పెద్ద పాత్రలోకి తీసుకుని, ఉప్పు పసుపు జత చేయాలి ● స్టా మీద బాణలిలో నూనె కాగాక పల్లీలు, జీడిపప్పు జత చేసి దోరగా వేయించాలి ● పచ్చి సెనగ పప్పు, మినప్పప్పు, ఆవాలు, జీలకర్ర, ఎండు మిర్చి, పచ్చి మిర్చి, కరివేపాకు, ఇంగువ వేసి మరోమారు వేయించాక, అన్నం మీద వేసి కలియబెట్టాలి ● దబ్బకాయ రసం వేసి మరోమారు బాగా కలిపి, ఒక గంట సేపు బాగా ఊరిన తరవాత తింటే రుచిగా ఉంటుంది.

నువ్వుల పచ్చడి

కావలసినవి: నువ్వులు – 100 గ్రా.; చింత పండు – 100 గ్రా.; బెల్లం పొడి – 100 గ్రా.; ఎండు మిర్చి – 50 గ్రా.; పచ్చి సెనగ పప్పు – ఒక టేబుల్ స్పూను; మినప్పప్పు – ఒక టేబుల్ స్పూను; ఆవాలు – ఒక టీ స్పూను; జీలకర్ర – ఒక టీ స్పూను; మెంతులు – అర టీ స్పూను; ఇంగువ – అర టీ స్పూను; నూనె – 50 గ్రా.; ఉప్పు – తగినంత

తయారీ: ● స్టా మీద బాణలిలో నూనె లేకుండా నువ్వులు వేసి దోరగా వేయించి తీసి పక్కన ఉంచాలి ● అదే బాణలిలో నూనె వేసి కాగాక పచ్చి సెనగ పప్పు, మినప్పప్పు, మెంతులు, ఎండు మిర్చి వేసి వేయించి తీసి పక్కన ఉంచాలి ● అదే బాణలిలో ఆవాలు, జీలకర్ర, ఇంగువ వేసి వేయించాలి ● ఒక గిన్నెలో చింతపండుకు తగినన్ని నీళ్లు జత చేసి, ఉడికించి, చల్లారాక మెత్తగా గుజ్జు తీసి పక్కన ఉంచాలి ● వేయించి పెట్టుకున్న మినప్పప్పు మిశ్రమం మిక్సీలో ముందుగా వేసి మెత్తగా చేయాలి ● నువ్వులు జత చేసి మరోమారు మిక్సీ పట్టాలి ● చింత పండు గుజ్జు, బెల్లం తురుము, ఉప్పు జత చేసి అన్నీ బాగా కలిసేలా మెత్తగా చేసి, ఒక గిన్నెలోకి తీసుకోవాలి ● వేయించి ఉంచుకున్న ఆవాలు మిశ్రమం జత చేసి బాగా కలపాలి ● గారెలలోకి ఈ పచ్చడి చాలా రుచిగా ఉంటుంది.



నిర్వహణ:
డా. వైజయంతి పురాణపండ

నాన్-వెజ్

పచ్చిమిర్చి కోడి పులావ్

కావల్సినవి: చికెన్ – అర కేజీ; పచ్చిమిర్చి పేస్ట్ – టేబుల్ స్పూన్; పచ్చి మిర్చి – 6 (పొడవుగా చీల్చాలి); కొత్తిమీర తరుగు – 2 టేబుల్ స్పూన్లు ; ఉప్పు – తగినంత; సాజీర – అర టీ స్పూన్; పసుపు – పావు టీ స్పూన్; మసాలా దినుసులు (దాల్చిన చెక్క–చిన్నముక్క, లవంగాలు – 4 , యాలకులు–4) ; కరివేపాకు – 2 రెమ్మలు; పుదీనా ఆకులు – అరకప్పు; పెరుగు – కప్పు ; నూనె – 2 టేబుల్ స్పూన్లు; ఉల్లిపాయల తరుగు – కప్పు; కొబ్బరి – పావు కప్పు; బాస్మతి బియ్యం – 2 కప్పులు; నీళ్లు – తగినన్ని ; నిమ్మ రసం టేబుల్ స్పూన్.

తయారీ: ● బియ్యాన్ని కడిగి, నీళ్లలో నానబెట్టాలి ● చికెన్‌లో ఉప్పు, కొద్దిగా ధనియాలపొడి, పసుపు, పెరుగు, పుదీనా ఆకులు వేసి బాగా కలిపి పక్కనుంచాలి ● పొయ్యిమీద పాన్ పెట్టి, గరం మసాలా దినుసులన్నీ వేసి వేయించి పక్కనుంచాలి ● చల్లారాక పొడి చేసుకోవాలి ● విడిగా కొబ్బరి తురుమును పేస్ట్‌లా గ్రైండ్ చేసి పెట్టుకోవాలి ● పులావ్ కోసం పొయ్యిమీద మందపాటి గిన్నె పెట్టి, వేడయ్యాక నూనె వెయ్యాలి ● వేడి నూనెలో సాజీర, ఉల్లిపాయలు వేపాలి ● దీంట్లోనే అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి కలపాలి ● ఆ తర్వాత పసుపు, పచ్చి మిర్చి పేస్ట్, కట్ చేసిన మిర్చి, కరివేపాకు వేసి మూడు నిమిషాలు వేగనివ్వాలి ● కొబ్బరి పొడి, ధనియాల పొడి వేసి మరో 5 నిమిషాలు ఉడికించాలి ● మసాలా కలిపిన చికెన్‌ను వేసి, పదినిమిషాలు ఉడకనివ్వాలి ● ఆ తర్వాత నానబెట్టిన బాస్మతి బియ్యం వేసి కలపాలి ● ఆ తర్వాత రెండు కప్పుల నీళ్లు పోసి, పైన మూత పెట్టి, మిశ్రమం అంతా ఉడకనివ్వాలి ● అన్నం పూర్తిగా ఉడికేంతవరకు ఉంచి, మూత తీసి పైన వేయించిన జీడిపప్పు పలుకులు, కొత్తిమీర ఆకులు చల్లి సన్నని మంట మీద మరికా సేపు ఉంచి, దించాలి.

గోంగూర మటన్

కావాల్సినవి: గోంగూర ఆకులు – 250 గ్రాములు; మేక మాంసం – 500 గ్రాములు; కొత్తిమీర – తగినంత; పుదీన – గుప్పెడు; ఉల్లిపాయలు – 2 (సన్నగా తరగాలి); అల్లం వెల్లుల్లిపేస్ట్ – 2 టీ స్పూన్లు; పసుపు – అర టీ స్పూన్; కొబ్బరి తురుము – 2 టీ స్పూన్లు; ఉప్పు – తగినంత; కారం – తగినంత; మసాలా – (లవంగాలు –4, యాలకులు –4, ధనియాలు టేబుల్ స్పూన్. ఇవన్నీ కలిపి వేయించి, పొడి చేయాలి); గసగసాలు – టీ స్పూన్.

తయారీ: ● మటన్ ముక్కలను వేడినీటిలో 10 నిమిషాలు ఉడికించాలి ● పొయ్యిమీద గిన్నెపెట్టి నూనె వేసి వేడిచేయాలి ● అందులో సాజీరా ఉల్లిపాయ ముక్కలు వేసి వేయించాలి ● అల్లం వెల్లుల్లి ఫేస్ట్, పసుపు వేసి కలపాలి ● అందులో మటన్ వేసి 5 నిమిషాలు ఉడికించాలి ● తగినంత కారం, ఉప్పు కలిపి ఉడికించాలి ● కొబ్బరి పొడి వేసి 15 నిమిషాలు ఉడికించాలి ● తరువాత తరిగిన గోంగూర ఆకులు వేసి ఉడికించాలి ● చివరగా గరం మసాలా, కొత్తి మీర వేసి దించాలి.

మునక్కాయ చేపల కూర

కావలసినవి: కొరమీను చేప ముక్కలు – అరకేజీ; కారం – నాలుగు టీ స్పూన్లు; ధనియాల పొడి – రెండు టీ స్పూన్లు; చింతపండు గుజ్జు – అర కప్పు; కొబ్బరి పేస్ట్ – అర కప్పు; పచ్చిమిర్చి – 10 (కచ్చాపచ్చాగ దంచాలి); మునక్కాయలు – 2 (చిన్న ముక్కలుగా కట్ చేయాలి); నూనె – అర కప్పు,; జీలకర్ర పొడి – టీ స్పూన్; ఎండుమిర్చి – 5, కరివేపాకు – రెమ్మ; పసుపు – అర టీ స్పూన్; ఉప్పు – తగినంత.

తయారీ: ● చేపముక్కలను శుభ్రంగా కడిగి పక్కనపెట్టుకోవాలి ● స్టా మీద పాన్ పెట్టి రెండు టీ స్పూన్ల నూనె వేసి వేడెక్కాక అందులో కొబ్బరి పేస్ట్, పచ్చిమిర్చి, ధనియాలపొడి, కారం, పసుపు తగినంత ఉప్పు వేసి రెండు నిమిషాలు వేయించాలి ● తర్వాత రెండు కప్పుల నీళ్లు పోసి మూతపెట్టాలి ● ఈ మిశ్రమం కాస్త చిక్కపడ్డాక అందులో కట్ చేసిన మునక్కాయ ముక్కలు, చింతపండు గుజ్జు పోసి సన్నటి సెగ మీద ఉంచాలి ● ఇది ఉడుకుతుండగా మధ్యలో చేప ముక్కలను కూడా జత చేసి మూత పెట్టాలి ● ఈ మిశ్రమమంతా చిక్కబడుతుండగా దించి వేరొక పాన్‌లో మిగిలిన నూనె వేయాలి ● అది వేడెక్కాక అందులో జీలకర్రపొడి, కరివేపాకు, ఎండుమిర్చి వేసి తాలింపు పెట్టాలి ● వేయించిన తాలింపును ఉడికించిన కూరలో కలిపి గిన్నెలోకి తీసుకోవాలి.

ఆయుర్వేదం

మినుములు-వరి మితంగా తింటే సరి

ఆహార శాస్త్రం గురించి ఆయుర్వేదం నిశితంగా పరిశోధించింది. శరీర పోషణ కోసం తీసుకునే ప్రతి పదార్థాన్ని ఆహారంగా వివరించింది. ఆహారాన్ని తినే విధానాన్ని బట్టి, 'పాన (తాగేవి), చోష్య (చప్పరించేవి), లేహ్య (నాకేవి), భక్ష్య (నమిలి తినేవి) అని నాలుగు రకాలుగా వర్గీకరించింది. వండక్కర లేకుండా సహజంగా ప్రకృతి ప్రసాదించే కందమూల ఫలాలు, కొబ్బరి నీళ్లు, చెరకు రసం వంటి పానీయాలు ఒక రకం. కొత్త రుచులను కనిపెడుతూ మనం తయారుచేసుకునే తినుబండారాలు రెండవ రకం. వీటిని కృతాన్నాలు అంటారు. ప్రతి ద్రవ్యానికి ఉండే పోషక విలువలు, ఔషధ గుణాలను కూడా విశదీకరించింది. వరి, గోధుమలు మన దేశంలో ప్రధాన ఆహారం. వరి బియ్యం, మినుములకు సంబంధించిన వివరాలు..

వరి: క్షేత్ర బీజ ప్రాధాన్యత, పంటకాలం (ఋతువులు) ప్రాతిపదికగా రకరకాల ధాన్యాలు మనకు చాలా కాలంగా ఉన్నాయి. వాటి రుచులు, పోషక విలువలలో కూడా తేడాలు ఉన్నాయి.

శాలిధాన్యం: *కండనేన వినా శుక్లా హేమంతాః శాలయః స్మృతాః (భావ ప్రకాశ)*

హేమంత ఋతువులో సంక్రాంతి సమయంలో పంటకు వచ్చేవి, పైపొట్టు తీయబడి తెల్లగా ఉండే బియ్యం శాలిధాన్యం. ఈ గింజల రంగు, పరిమాణాలలో చాలా భేదాలున్నాయి.

సామాన్య గుణధర్మాలు

శాలయో మధురా స్నిగ్ధా బల్యా... వృష్యాశ్చ బృంహణాః.... మేధ్యాః చ ఏవ బలావహాః...

ఈ అన్నం తియ్యగా జిగురుగా ఉండి, రుచికరమై, బలకరమై మలమూత్ర విసర్జనకు తోడ్పడుతుంది. మేధాకరం (బుద్ధిని వికసింపచేస్తుంది), శుక్రకరం. చలవ చేస్తుంది.

కొత్త బియ్యం: *వాపితేభ్యో గుణైః... రోపితాస్తు నవా వృష్యాః; పురాణా లఘవః స్మృతాః... (భావప్రకాశ)*

కొత్త ధాన్యం నుంచి వెంటనే ఆడించిన బియ్యంతో వండిన అన్నం కొంచెం బరువుగా ఉండి, అరుగుదల మందగిస్తుంది. పాతవైతే లఘుగుణం కలిగి, తేలికగా జీర్ణమవుతుంది.

ఆధునిక శాస్త్రం రీత్యా: పాలిష్ చేసిన తెల్ల బియ్యంలో పిండి పదార్థాలు అధికంగా (78 శాతం) ఉంటాయి. ప్రొటీన్లు (6.8), కొవ్వు (0.5), ఐరన్ (0.7) ఫాస్ఫరస్ (160) శాతం ఉంటాయి. పొట్టుతో (తవుడుతో) కూడిన గోధుమ రంగు ముడిబియ్యంలో పిండి పదార్థాలు కొంచెం తక్కువగా ఉండి, బీ విటమిన్లు అధికంగా ఉంటాయి. కనుక తెల్లటి బియ్యం డయాబెటిస్ వ్యాధికి దోహదకారి. ముడి బియ్యాన్ని వండుకుని, మితంగా పరిమిత ప్రమాణంలో తింటే నష్టం ఉండదు. కాల్షియం, కాపర్, జింక్ వంటి లవణాలు కూడా లభిస్తాయి.

మినుములు: *వీటిని సంస్కృతంలో మాష అంటారు. "మాషో గురుః స్వాదుపాకః... అనిలాపః।... శుక్రణో బృంహణః... మేదః కఫ ప్రదః... శూలాని నాశయేత్ (భావప్రకాశ)*

తియ్యగా రుచికరంగా ఉండే బరువైన ఆహారం. శరీర కొవ్వును బరువును పెంచుతుంది. విరేచనం సాఫీగా చేస్తుంది. శుక్రాన్ని, స్తన్యాన్ని వృద్ధి చేస్తుంది. కొంచెం వేడి చేస్తుంది. 'ఆర్శస్ (పైల్స్), అర్ధిత వాతం (ముఖంలో సగభాగానికి వచ్చే పక్షవాతం), తమక శ్వాస (ఆయాసం), కడుపులోని పుండ్లు (అల్సర్స్)... వీటిని పోగొడుతుంది. బలహీనులకు మంచి ఆహారం. క్రమశిక్షణతో వ్యాయామం చేసేవారికి చక్కటి ఆహారం. ఇడ్లీ, డోసెలలో మినుములు, వరి బియ్యం ఉంటాయి. కనుక వీటి సత్ఫలితాలను పొందాలనుకుంటే, పరిమితంగా తింటే మంచిది. పైన ఉండే నల్లని పొట్టుతోబాటు మినుముల్ని వాడుకుంటే పోషక విలువలు బాగా లభిస్తాయి.

ఆధునిక శాస్త్ర వివరాలు.. (100 గ్రా.లో ఉండే పోషకాలు, గ్రాములలో)

పప్పు: ప్రోటీన్లు (24), కొవ్వు (1.4), పిండి పదార్థాలు (59.6), కాల్షియం (15.4), ఫాస్ఫరస్ (385), ఐరన్ (3.8).

పొట్టుతో ఉన్న మినుములలో సోడియం, పొటాషియం.. ఇవి రెండూ శూన్యం. పొట్టు తీసిన పప్పులో సోడియం నూరు గ్రాములకి 39.8 మి.గ్రా. పొటాషియం 800 మి. గ్రాములు, ఇతర లవణాలు తగినంత లభిస్తాయి.

గమనిక: తెలుగువారి వంటకాలలో గారె విశిష్టమైనది. దీనిని కేవలం మినుములతోనే చేస్తారు. కొందరు బియ్యాన్ని కూడా కలిపి నానిన తరవాత పిండి రుబ్బుతారు. దీనివలన నూనెలో వేగినప్పుడు నూనె ఎక్కువగా పీల్చదని పరిశీలన. పెరుగు వడ కూడా చేస్తుంటారు. తగురీతిలో వ్యాయామం చేస్తూ, ఇవి మితంగా సేవిస్తే ప్రయోజనం మెండు.

- డా. వృద్ధుల లక్ష్మీనరసింహశాస్త్రి ఆయుర్వేద వైద్య నిపుణులు, హైదరాబాద్, ఫోన్: 9963634484

epaper.sakshi.com

కియరా అద్వానీ 'లస్ట్ స్టోరీస్'లో కోరికలున్న టీచర్‌గా చేసింది. 'స్పెర్మ్' తారుమారు కాగా మరొకరి బిడ్డను గర్భాన మోసే తల్లిగా 'గుడ్ న్యూస్'లో నటించింది. కబీర్ సింగ్‌లో పెళ్లికి ముందే బోయ్ ఫ్రెండ్‌తో సామీప్యానికి వెరవని ప్రియురాలిగా నటించింది. అదే కియరా అద్వానీ 'భరత్ అనే నేను'లో తెలుగువారికి నచ్చినట్టుగా ఎంతో అందంగా కనిపించింది. ఆమెకు అందం ఉంది. ఆమెలో పాత్ర కోసం చేయదగ్గ సాహసం ఉంది. కియరా ఇప్పుడు బాలీవుడ్‌ను తన చుట్టూ తిప్పుకుంటోంది.

బోల్ అండ్ బ్యూటిఫుల్

2018 కియారా అద్వానీ కెరీర్‌లో ముఖ్యమైన సంవత్సరం. ఆ సంవత్సరంలోనే ఆమె రెండు సినిమాలు రిలీజయ్యాయి. థియేటర్లలో 'భరత్ అనే నేను'. నెట్‌ఫ్లిక్స్‌లో 'లస్ట్ స్టోరీస్'. భరత్ అనే నేనులో కియరా ముఖ్యమంత్రి అయిన మహేశ్‌బాబుకు గర్ల్ ఫ్రెండ్‌గా కనిపిస్తుంది. చక్కటి ఆహార్యంలో ముగ్ధ రూపంలో మహేశ్‌ను ఆమె ఆకట్టుకుంటుంది. కాని 'లస్ట్ సోరీస్'లో ఆమె కథ వేరు. ఆమెకు ఆ సినిమాలో భర్త ఉంటాడు. అతనితో సాన్నిహిత్యానికి వంక ఉండదు. కాని అది ఆమెకు సరిపోదు. అలా సరిపోక పోవడం మన సంస్కృతిలో నిషిద్ధ చర్చాంశం. దాని గురించి ఎవరూ మాట్లాడరు. అలాంటిది అసలు ఉన్నట్టుగా తెలియనట్టే నటిస్తుంటారు. ఆ సినిమాలో కియరా పాత్ర తనకు కోరిక ఉన్నట్టు గ్రహిస్తుంది. భర్త ఉన్నా భర్త ఇవ్వదగినది ఇస్తూ ఉన్నా చాలనంత కోరిక ఉన్నట్టు గ్రహిస్తుంది. కోరిక ఉన్నట్టు గ్రహించడం ఏం తప్పు. అడ్డదారులు తొక్కకుండా దానిని ఆమె వ్యక్తపరచడమే ఆ సినిమాలో తప్పు అవుతుంది. అత్తగారు ఆమెను అనాదరిస్తుంది. భర్త దూరమవుతాడు. కాని భర్త ఆమెను పూర్తిగా అర్థం చేసుకొని చివరకు చేరువ అవుతాడు. కియరా అద్వానీ ఆ పాత్రను నిర్వహించిన తీరును అందరూ మెచ్చుకున్నారు. ఒకవైపు భరత్ అనే నేను పెద్ద హిట్ అయ్యింది. లస్ట్ స్టోరీస్ నెట్‌ఫ్లిక్స్‌లో సూపర్ హిట్ అయ్యింది. కియరా అద్వానీ తిరుగులేని స్టార్‌గా అవతరించింది.

●●●

కియరా అద్వానీ డబ్బున్న కుటుంబంలో (1992) జన్మించింది. ఆమె తండ్రి సింధి. తల్లిది ముస్లిం-ఐరిష్ జాతీయతలు ఉన్న కుటుంబ నేపథ్యం. తల్లికి యాడ్స్ చేయడం సరదాగా ఉండేది. కియరా చిన్నప్పుడే తల్లితో కలిసి విప్రో బేబీ ప్రొడక్ట్స్ యాడ్‌లో నటించింది. ఇంకో ఇద్దరు తమ్ముళ్లు ఉండే ఇంటికి పెద్ద కూతురుగా పుట్టిన కియరాను తండ్రి ఏ మాత్రం గ్లామర్ ఫీల్డ్‌లో రాకూడదని కోరుకున్నాడు. కాని కియరాకు సినిమాల్లో నటించాలన్న కోరిక ఎక్కువగా ఉండేది. ఇది ఎంత తండ్రికి చెప్పినా వినేవాడు కాదు. కాని చిత్రంగా ఆయన మనసు మారింది. దానికి కారణం రాజు హిర్వాణి తీసిన 'త్రీ ఇడియట్స్' సినిమా. పిల్లలను వారికి ఏది నచ్చితే అది చేయనివ్వాలి, దేనిలో వారు రాణిస్తారో ఆ రంగంలో ప్రవేశపెట్టాలి అని ఆ సినిమా చెబుతుంది. అది చూసిన కియరా తండ్రి ఆమెకు సినిమాల్లో వెళ్లమని పర్మిషన్ ఇచ్చాడు. అయితే నిర్ణయాలు తీసుకోవడంతో పని అయిపోదు. దానికి పని చేయాల్సి ఉంటుంది. సినిమాల్లో అంటే ఇంకా ఎక్కువ పని చేయాల్సి ఉంటుంది.

●●●

కియరా అద్వానీ తల్లి జెనివైవ్ జాఫ్రీ సల్మాన్ ఖాన్‌కు స్కూల్ ఫ్రెండ్. కియరా చిన్నప్పటి నుంచి సల్మాన్ ఖాన్‌కు తెలుసు. కియరా సినిమాల్లోకి వద్దామని నిశ్చయించుకున్నాక ఆమెను పేరు మార్చుకోమని సల్మాన్ ఖానే సలహా ఇచ్చాడు. ఎందుకంటే కియరా అసలు పేరు ఆలియా అద్వానీ. ఆలియా భట్ అప్పటికే సినిమాల్లో ప్రశేశిస్తూ ఉండటంతో కియరాను కొత్తపేరు పెట్టుకోమని చెప్పాడు. ఒక సినిమాలో ప్రియాంక చోప్రా పాత్రకు కియరా అనే పేరు ఉంటుంది. కియరా కూడా అదే పేరు పెట్టుకుని కియరా అద్వానీ అయ్యింది. సల్మాన్ ఖాన్ వంటి స్టార్స్ పరిచయం అవకాశాలు కల్పించగలవుగానీ సక్సెస్‌ను గ్యారంటీ చేయలేవు. కియరా అద్వానీ 'ఫగ్లీ' (2014) అనే కామెడీ సినిమాతో ఆరంగేట్రమ్ చేసింది. ఇంతటితో తాను సినిమాల్లో దూసుకెళతానని కలలు కంది కాని ఆ సినిమా ఫ్లాప్ అయ్యింది. సినిమా రంగంలో ఫ్లాప్ అనేది అన్నీ దారులను మూసివేసే తాళం కప్పలాంటిది. కియరా ఉక్కిరిబిక్కిరి అయ్యింది. ఆమెను ఎవరూ పట్టించుకోలేదు. అవార్డు ఫంక్షన్స్‌కు వెళితే చివర కూచోబెట్టేవారు. అవకాశాలు కోరితే ముఖం తిప్పుకునేవారు. తల్లిదండ్రులు ఆమెను చూచోబెట్టి ఒక్కమాట చెప్పారు. 'అసలు నీ సినిమా రిలీజయ్యిందని మర్చిపో. తిరిగి మొదటి నుంచి మొదలెట్టు' అని. 'ఇందులో కొనసాగాలంటే మళ్లీ ప్రయత్నించాల్సిందే' అన్నారు. కియరా ప్రయత్నించింది.

●●●

'ఎం.ఎస్.ధోని' సినిమాలో కియరాకు ధోని భార్య పాత్ర లభించింది. అయితే అది చిన్నది. ఆ తర్వాత 'మెషీన్' అనే సినిమాలో సోలో హీరోయిన్‌గా అవకాశం వచ్చింది. ఆ సినిమా డిజాస్టర్ అయ్యింది. సరిగ్గా అప్పుడు కరణ్ జొహార్ దర్శకత్వంలో నటించే అవకాశం వచ్చింది కియారాకు. ఆ సినిమాయే 'లస్ట్ స్టోరీస్'. స్త్రీల లైంగికతను చర్చించే ఈ సినిమాలో కియారాది ఒక స్కూల్ టీచర్ పాత్ర. అందులో ఆమె ఒక సన్నివేశంలో వైబ్రేటర్ వాడినట్టుగా కనిపించాల్సి ఉంటుంది. అయినా కియరా ఆ పాత్ర చేసింది. కుటుంబం, నేపథ్యం, ఇన్‌హిబిషన్స్ ఇవన్నీ పక్కనపెట్టి కియరా నటించడం పాత్రను పాత్రలా చూడటం అందరినీ ఆకట్టుకుంది. అదే సమయంలో తెలుగు నుంచి 'భరత్ అనే నేను' భారీ హిట్ కావడంతో కియరా ఇరుభుజాలకు రెక్కలు మొలుచుకొచ్చాయి. ఆమె ఎగరడం మొదలుపెట్టింది.

●●●

తెలుగులో భారీ హిట్ అయిన అర్జున్ రెడ్డి హిందీలో 'కబీర్ సింగ్'గా రీమేక్ అవుతున్నప్పుడు హీరోయిన్ పాత్రకు కియరాను దర్శకుడు సందీప్ రెడ్డి ఎంచుకోవడం సరైన నిర్ణయమే అని రిలీజ్ అయ్యాక తేలింది. అందులో షాహిద్ కపూర్ వంటి సీనియర్ నటుడికి సరిజోడుగా కియరా నటించగలిగింది. కబీర్ సింగ్ బ్లాక్ బస్టర్‌గా నిలవడంతో కియరా టాప్ క్లాస్ హీరోయిన్‌గా అవతరించింది. ఆమె తాజా సినిమా 'గుడ్ న్యూస్' నూరు కోట్ల కలెక్షన్‌ను దాటింది.

కియారా ఇప్పుడు అక్షయ్ కుమార్ పక్కన, యంగ్ హీరో కార్తిక్ ఆర్యన్ పక్కన రెండు వేరు వేరు సినిమాల్లో నటిస్తోంది. వీటిలో ఒకదానికి 'కాంచన' సిరీస్ ఆధారం. దర్శకుడు లారెన్స్. తెలుగు సినిమా వల్ల కూడా ఎదిగిన కియరా ఇప్పుడు తెలుగుకు అందనంత ఎత్తుకు చేరుకుంది.

ఆమె తిరిగి తెలుగులో నటించాలనంటే అంత అందమైన పాత్ర, అంత బోల్డ్ కేరెక్టర్ ఆఫర్ చేయాల్సి ఉంటుంది. అలాంటి సినిమా వస్తుందనే ఆశిద్దాం.

– సాక్షి ఫ్యామిలీ

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ శనివారం
11-1-2020

చిత్రం చెప్పిన సంగతి

ఫ్యాన్స్ దర్బార్ విడుదల సందర్భంగా చెన్నైలో ప్రేక్షకులకు చెరకు గడలను పంచుతున్న దృశ్యం

తలైవా కోసం

తమిళనాడులో సినిమా హీరోల అభిమానులు ఎప్పుడూ సందడి సృష్టిస్తూనే ఉంటారు. వారు ఖుష్బూకు గుడులు కట్టారు. నమిత పేరుతో రక్తదానాలు చేశారు. ఇక శింబు అభిమానులైతే అతని సినిమా విడుదల సందర్భంగా పాల వ్యాన్లలో నుంచి పాల ప్యాకెట్లు దొంగిలిస్తున్నారన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు. పెద్ద పెద్ద కటౌట్లకు పాలాభిషేకం చేయాలంటే అవసరమైన పాల కోసం అభిమానులు ఇలా తెగబడుతున్నారని పోలీసులకు కంప్లయింట్‌లు వెళ్లాయి. అభిమానం కోసం పాలు వేస్ట్ చేయవద్దని పెద్ద హీరోలు కొంతమంది అభిమానులకు హితవు చెప్పారు. అందుకే ఈసారి 'దర్బార్' విడుదల సందర్భంగా రజనీకాంత్ అభిమానులు కొంత ట్రెండ్‌కు వెళ్లారు. చెన్నైలో 'దర్బార్' విడుదలైన థియేటర్లలో చెరకు గడలు పంచారు. నోరు తీపి చేసుకోండి... సినిమా హిట్ అయ్యిందన్న తీపి కబురు చెప్పండి అంటూ చాలామంది ప్రేక్షకులకు చెరకు గడలు పంచారు. ఇలా ఉంటే మధురైలోని అభిమానులు మరో అడుగు ముందు కేసి 'దర్బార్' రిలీజ్ సంద్భంగా స్థానిక అమ్మన్ కోవెలలో ప్రత్యేక పూజలు చేశారు. పదిహేను రోజులు ఉపవాసాలు ఉండి 'మన్‌సోరు' మొక్కు చెల్లించుకున్నారు. మన్‌సోరు అంటే విస్తరి లేకుండా నేల మీద భోజనం చేయడం. 69 సంవత్సరాల రజనీకాంత్ 167వ సినిమాగా 'దర్బార్'లో నటించాడు. దర్శకుడు మురగదాస్‌తో కలిసి తొలిసారిగా పని చేయడం వల్ల ఫ్యాన్స్‌లో చాలా ఆసక్తి ఉంది. అంతేకాదు ఈ సినిమా సూపర్ హిట్ కావాల్సిన అవసరం కూడా వారికి చాలా ఉంది.

దీనికి కారణం 'రోబో' తర్వాత రజనీకాంత్ సరైన సూపర్‌హిట్ పడలేదు. యానిమేటెడ్ యాక్షన్ ఫిల్మ్ 'కొచ్చడయాన్' తీవ్రంగా నిరాశపరిచింది. 'లింగ' పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. 'కబాలి' ప్రశంసలు పొందినా నిజమైన మాస్ ఫిల్మ్‌గా నిలవలేకపోయింది. 'కాలా' కూడా అంతే. ఇక ఎన్నో ఆశలు పెట్టుకున్న శంకర్ '2.0' రజనీకాంత్ చేసేందుకు పెద్దగా అవకాశం ఇవ్వలేకపోయింది. పెట్టా ఫస్ట్ హాఫ్ చాలా బాగున్నా సెకండ్ హాఫ్ నిలబడలేకపోయింది. వీటన్నింటి నేపథ్యంలో 'దర్బార్' హిట్ కావడం గురించి అభిమానులు వేయి దేవుళ్లకు మొక్కుకుంటున్నారు. ముంబై పోలీస్ కమిషనర్‌గా రజనీకాంత్ ఈ సినిమాలో నటించాడు. విలన్ సునీల్ శెట్టి. నయనతార హీరోయిన్. సంక్రాంతి సందర్భంగా తెలుగు, తమిళంలో ఈనెల 9న ఈ సినిమా విడుదలైంది. తమిళనాడులో ప్రభుత్వం నాలుగు రోజుల పాటు అదనంగా ఒక షో వేసుకునే అనుమతి ఇచ్చింది. వినవస్తున్న వార్తలను బట్టి ఈ సినిమా ఫ్యాన్స్‌ను సంతోషపెట్టిందనే అంటున్నారు.

సత్యమే నా దైవం విశ్వమే నా దేశం

రేపు స్వామి వివేకానంద జయంతి (నేషనల్ యూత్ డే)

'నీ ధర్మం ఏదైనా కావచ్చు. కాని దాని పట్ల సత్యవర్తనతో మెలుగు' అని బోధించినవాడు వివేకానంద. భారతీయ ఆధ్యాత్మికతను పునరుజ్జీవింప చేయడంలో ఆయన దాదాపు ఒక ప్రవక్త వలే కృషి చేశాడు. ముఖ్యంగా యువశక్తిని చైతన్యపరచాలని కోరుకున్నాడు. ప్రతి ఒక్కరికీ ఆలోచన అవసరమన్నాడు. సంకుచితాల సరిహద్దులను, క్రతువులను నిరసించాడు. నేడు ఆయన జయంతి. భిన్న సందర్భాలలో ఆయన మాట్లాడిన మాటలు కొన్ని...



కష్టాలతోను, యాతనలతోను నిండిపోయిన జీవితం గుండా నేను ఈడ్వబడ్డాను. నాకు అత్యంత ఆప్తులు, సన్నిహితులు దాదాపు పస్తులతో మరణించడం కళ్లారా చూశాను. నేను అవహేళనకు, విశ్వాస రాహిత్యానికి గురయ్యాను. నన్ను ఎవరు ఏవగించుకున్నారో, అపహాస్యం చేశారో వారి పట్ల సానుభూతి చూపినందున బాధలకు గురయ్యాను. నేను ముక్తినీ లేదా భక్తినీ ఖాతరు చేయను. నూరు వేల నరకాలకైనా పోవడానిని నేను సిద్ధంగా వున్నాను. వసంతంలా నిశ్శబ్దంగా పరహితం ఆశిస్తాను. ఇదే నా మతం.

జనం శ్రీరామకృష్ణుల పేరును అంగీకరించినా లేక అంగీకరించకపోయినా నేను పట్టించుకోను. కాని ఆయన బోధనలు, జీవితం సందేశం లోకమంతటా వ్యాప్తి చేయడానికి నా ప్రాణాలను అర్పించడానికి నేను సంసిద్ధుడనై ఉన్నాను. అవును, ఒక మహాత్ముని ఉత్సాహ ప్రోత్సాహకాల వల్లనే నా జీవిత మార్గనిర్దేశనం జరిగింది.

నాకు శ్రీరామకృష్ణ పరమహంస ప్రేరణ కల్పించారన్న నిజాన్ని నేను నమ్ముతున్నాను. అయితే నాకుగా నేను స్ఫూర్తిని పొందాను కూడా. నా జీవిత లక్ష్యం ఏమిటో నాకు తెలుసు. స్వదేశ స్వమత దురభిమానంతో నాకు సంబంధం లేదు. నేను భారత దేశానికి ఎంత చెందుతానో, ప్రపంచానికి కూడా అంతే చెందుతాను... ఏ దేశానికి నా మీద ప్రత్యేకమైన హక్కు ఉంది? ఏ దేశానికైనా నేను బానిసనా? మానవశక్తి కన్నా, దైవశక్తి కన్నా, అనురక్తి కన్నా మహత్తరమైన శక్తి నాకు అండగా ఉన్నట్లు ప్రత్యక్షంగా గోచరిస్తోంది.

పిరికితనం అంటే నాకు పరమ రోత. సత్యమే నా దైవం. విశ్వమే నా దేశం.

●●●

ఆశించడమే పరమ దుఃఖం, ఆశించకపోవడమే పరమ సుఖం. కోరికలు పూర్తిగా త్యజించి, నిశ్చింతగా ఉండాలి. మిత్రులు, శత్రువులు అనేవారు లేకుండా ఏకాకిగా జీవించాలి. ఆ విధంగా శత్రుమిత్రులు, సుఖదుఃఖాలు, రాగద్వేషాలు లేకుండా, జీవాలను హింసించక ఏ జీవహింసకూ కారకులు కాకుండా, ఒక పర్వతం నుండి మరొక పర్వతానికి, ఒక గ్రామం నుండి మరో గ్రామానికి భగవన్నామాన్ని ప్రబోధిస్తూ మనం పర్యటించాలి. సంపదలో దారిద్ర్య భయం ఉంది. జ్ఞానంలో అజ్ఞాన భయం ఉంది. సౌందర్యంలో వృద్ధాప్య భయం ఉంది. కీర్తిలో చాటునిందల భయం ఉంది. శరీర విషయంలో సైతం మృత్యు భయం ఉంది. లోకంలో సమస్తమూ భయంతో కూడుకొని ఉంది. వైరాగ్యం ఒక్కటే భయం లేనిది.

●●●

నాలో ఎన్ని తప్పిదాలున్నా, కొంత సాహసం కూడా ఉందని భావిస్తాను. నాకు అవరోధాలు కల్పించడానికి, నా పురోగతిని వ్యతిరేకించానికి, వీలైతే నన్ను రూపుమాపడానికి కూడా కొన్ని ప్రయత్నాలు జరిగాయి. భగవదనుగ్రహం వల్ల అన్నీ వ్యర్థమయ్యాయి. అటువంటి ప్రయత్నాలు వైఫల్యం చెందటం సహజమే. గడచిన మూడేళ్ల నుండి కొన్ని అపార్థాలు చోటుచేసుకుంటూ వచ్చాయి. నేను విదేశాల్లో ఉన్నంత కాలం ఈ విషయంగా ఒక్క మాట కూడా పలుకక మౌనం పాటించాను. ఇప్పుడు నా మాతృభూమిపై నిలబడి కొంత వివరణ చెప్పగోరుతున్నాను. నా మాటల వల్ల మీలో ఎటువంటి స్పందన కలిగించగలనో అనే కౌతుకంతోనూ కాదు. నేను ఇటువంటి వాటిని లక్షించేవాణ్ని కాను.ఎందుకంటారా? నాలుగేళ్ల కిత్రం దండ కమండలాలను మాత్రం చేతబూని, మీ నగరంలో ప్రవేశించిన ఆనాటి సన్యాసినే ఇప్పుడూను..!

●●●

నా భవిష్యత్తు ఆశంతా సౌశీల్యురైన యువకుల మీదనే ఉంది. వాళ్లు బుద్ధికుశలురు, సర్వస్వాన్ని ఇతరుల సేవకై పరిత్యజించే వ్యక్తులుగా ఉండాలి. నా భావాలనుకార్యరూపంలోకి తేవడానికి తమ జీవితాలను త్యాగం చేసి తద్వారా తమకూ, దేశానికీ సౌభాగ్యం చేకూర్చేది ఈ యువకులే. నచికేతుని వంటి శ్రద్ధావంతులైన పది పన్నెండు మంది యువకులు నాకు లభిస్తే ఈ దేశప్రజల ఆలోచనలను, కార్యకలాపాలను కొత్త పుంతలు తొక్కించగలను.

●●●

నాకు భగవంతుని పట్ల విశ్వాసం ఉంది, మనిషి పట్ల విశ్వాసం ఉంది. దుఃఖపూరితుల పట్ల విశ్వాసం ఉంది. ఇతరులను ఉద్ధరించటానికి నరకానికి పోవడంలో విశ్వాసం ఉంది. ఒక మనిషికి నిజంగా సహాయం లభిస్తుందంటే నేను నేరం చేసి శాశ్వత నరకవాసం అనుభవించడానికి కూడా సంశయించను. మనిషి గురించి నేను ప్రేమలో పడడం వల్ల మళ్లీ జన్మించవలసి ఉంటుంది. వితంతువు కన్నీరు తుడిచివేయలేని, అనాథ నోటికి పట్టెడన్నం అందించలేని భగవంతుని పట్ల గాని మతం పట్ల గాని నాకు విశ్వాసం లేదు.

ఎటువంటి కర్మకాండలతోగాని అంధ విశ్వాసంతో గాని నాకు సంబంధం లేదు. మతమే సమస్తమనీ, సమస్తంలోనూ మతమే ఉందని చూపించడమే నా లక్ష్యం. ఆలోచించడం మనిషి స్వభావం. ఇదే అతడికీ, జంతువులకూ ఉన్న తారతమ్యం. నేను యుక్తి (ట్చ్చుట్నౌ) లోనే విశ్వాసం ఉంచి దానినే అనుసరిస్తున్నాను.

●●●

మాసిపోయిన బట్టను పారవేసినట్లు నేను ఈ శరీరాన్ని త్యజించి బయటకు పోవడం మంచిదయుండవచ్చు. కాని పనిచేయడ మాత్రం విరమించను. భగవంతునితో ఐక్యాన్ని లోకంలోని యావన్మంది గుర్తించే వరకు నేను వారికి సర్వత్రా ప్రేరణను కల్పిస్తూనే ఉంటాను.

– సేకరణ: వైజయంతి పురాణపండ

లైఫ్‌స్టైల్ కౌన్సెలింగ్

ఫ్యామిలీ డాక్టర్

సెల్‌ఫోన్ వల్ల బొటనవేలి నొప్పి!

ప్ర: నేను స్మార్ట్‌ఫోన్‌ను చాలా ఎక్కువగా ఉపయోగిస్తుంటాను. బ్యాంకింగ్ వ్యవహారాలకూ, ఆఫీస్ కమ్యూనికేషన్స్ వేగంగా టైప్ చేయడంతో పాటు చాలా కీస్ నా బొటనవేలితో నొక్కుతుంటాను. ఈమధ్య ఆ వేలు చాలా నొప్పిగా ఉంటోంది. సెల్‌ఫోన్ ఎక్కువగా వాడటం వల్లనే వచ్చినట్లుగా అనిపిస్తోంది. ఇదేమైన సమస్యా? నా బొటనవేలి నొప్పి తగ్గడానికి మార్గాలు చెప్పండి.

– డి. శశాంక్, హైదరాబాద్

మీరు చెప్పిన లక్షణాలను బట్టి చూస్తే మీ బొటనవేలి నొప్పికి మీ సెల్‌ఫోన్‌ను ఎక్కువగా ఉపయోగించడమే కారణమనిపిస్తోంది. మీరు బ్లాక్‌బెర్రీ థంబ్ లేదా గేమర్స్ థంబ్ అనే కండిషన్‌తో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. దీన్నే వైద్య పరిభాషలో 'డీ-క్వెర్‌వెయిన్ సిండ్రోమ్' అని అంటారు. మనం మన స్మార్ట్ ఫోన్‌ను వాడేటప్పుడు బొటనవేలిని మాటిమాటికీ ఉపయోగిస్తుంటాం. దాంతో బొటనవేలి వెనక భాగంలో ఉన్న టెండన్ ఇన్‌ఫ్లమేషన్‌కు గురై వాపు వస్తుంది. మళ్లీ అదేపనిగా దాన్ని ఉపయోగించడం వల్ల ఆ గాయం మళ్లీ మళ్లీ తిరగబెడుతుంటుంది. ఫలితంగా ఈ సమస్య వస్తుంది. మీలా సెల్‌ఫోన్‌ను చాలా ఎక్కువగా వాడేవారు కొన్ని జాగ్రత్తలు పాటించడం వల్ల ఈ తరహా నొప్పిని చాలా వరకు నివారించుకోవచ్చు. ఆ జాగ్రత్తలివే...

- టైపింగ్ లేదా టెక్స్ట్ మెటీరియల్ పంపడం కోసం ఒక బొటన వేలినే కాకుండా ఇతర వేళ్లను కూడా మార్చి మార్చి ఉపయోగిస్తూ బొటనవేలిపై పడే భారాన్ని తగ్గించడం.
- ఫోన్‌ను ఒక చేత్తో పట్టుకొని మరో చేతి బొటనవేలిని ఉపయోగించే బదులు, దాన్ని ఒక ఉపరితలం మీద పెట్టి ఇరు చేతుల వేళ్లను మార్చి ఉపయోగిస్తూ ఉండటం.
- మణికట్టును చాలా రిలాక్స్‌గా ఉంచి వీలైనంత వరకు మణికట్టుపై భారం పడకుండా చూడటం.
- మీ స్మార్ట్‌ఫోన్‌ను ఒళ్లో పెట్టుకొని ఉండకుండా, కాస్త ఛాతీ భాగం వద్ద ఉండేలా చూసుకోవడం. ఒళ్లో పెట్టుకోవడం వల్ల కంటి మీద, ఒంగి స్క్రీన్ చూస్తూ ఉండటంతో మెడ మీద భారం పడుతుంది. అదే ఫోన్‌ను ఛాతీ వద్ద పెట్టుకుంటే అన్నివిధాలా సౌకర్యంగా ఉంటుంది.
- ఫోన్‌ను శరీరానికి ఏదో ఒక వైపున ఉంచకుండా మధ్యన ఉంచడం. దీని వల్ల శరీరం అసహజ భంగిమలో ఒంగకుండా బ్యాలెన్స్‌తో ఉంటుంది.

ఇక ఈ జాగ్రత్తలతో పాటు మరికొన్ని జాగ్రత్తలూ అవసరం. అవి...

- ఫోన్ ఉపయోగించే సమయాన్ని సాధ్యమైనంతగా తగ్గించడం.
- పొడవు పొడవు వాక్యాలు కాకుండా అర్థమయ్యేరీతిలో షార్ట్‌కట్స్ వాడుతూ బొటనవేలి ఉపయోగాన్ని తగ్గించడం. దీనివల్ల మీ బొటనవేలు, ఇతర వేళ్లు, మణికట్టుపై భారం తగ్గుతుంది.
- 'ఐ యామ్ ఇన్ మీటింగ్' లాంటి కొన్ని రెడీమేడ్ వాక్యాలు ఉంటాయి. వాటి సహాయం తీసుకుంటే టైపింగ్ బాధ తగ్గడంతో పాటు, సమయమూ ఆదా అవుతుంది.
- ఎవరిపేరునైనా కనుగొనాలంటే పూర్తిగా స్క్రీన్ స్క్రోల్ చేస్తుండే బదులు షార్ట్‌కట్స్ ఉపయోగించడం ద్వారా సమయాన్నీ, బొటనవేలి ఉపయోగాన్నీ తగ్గించవచ్చు.
- అదేపనిగా ఫోన్ ఉపయోగించే వారు... ప్రతి 15 నిమిషాల్లో కనీసం 2-3 నిమిషాల పాటు మీ బొటనవేలికి విశ్రాంతినివ్వాలి. అప్పటికీ మీ సమస్య తగ్గకపోతే డాక్టర్‌ను సంప్రదించండి.

డా. సుధీంద్ర ఊటూరి
లైఫ్‌స్టైల్ స్పెషలిస్ట్,
కిమ్స్ హాస్పిటల్స్,
సికింద్రాబాద్

epaper.sakshi.com


● త్రివిక్రమ్

"సంక్రాంతికి పెద్ద చిత్రాలు పోటీపడటం మామూలే. ఈ సమయంలో అన్ని సినిమాలకు డిమాండ్ ఉంటుంది. మా 'అల.. వైకుంఠపురములో..' చిత్రం, 'సరిలేరు నీకెవ్వరు' సినిమాల ట్రైలర్స్ చూశాను.. రెండూ విభిన్నమైన జోనర్స్‌లో తెరకెక్కాయని తెలుస్తోంది.. అందుకే ఒకదానికొకటి పోటీ కాదు" అన్నారు త్రివిక్రమ్. అల్లు అర్జున్, పూజా హెగ్డే జంటగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అల.. వైకుంఠపురములో...'. మమత ఆర్ట్స్ సమర్పణలో గీతా ఆర్ట్స్, హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకాలపై ఎస్.రాధాకృష్ణ (చినబాబు), అల్లు అరవింద్ నిర్మించిన ఈ సినిమా రేపు (ఆదివారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా విలేకరులతో త్రివిక్రమ్ చెప్పిన విశేషాలు.

భయాన్ని గెలవాలి

● కెరీర్ స్టార్టింగ్‌లో కొత్తవాళ్లు వాళ్ల ఆలోచనలను అందరికీ చెప్పాలని, ప్రశంసలు పొందాలని అనుకుంటారు. అనుభవం వచ్చాక వారిపై అంచనాలు పెరిగి చెప్పాలనుకున్న విషయాన్ని చెప్పలేకపోతారు. సినిమా రంగం అనే కాదు.. ఏ రంగంలో అయినా సేఫ్ రూట్‌లో వెళ్లడానికే ప్రయత్నిస్తారు. నా 'అజ్ఞాతవాసి' పరాజయం తర్వాత నా సన్నిహితులు ఓ సలహా ఇచ్చారు.. 'మీకు బాగా తెలిసిన ఎమోషనల్ అండ్ కామెడీ ఎంటర్‌టైనర్ చేయడం మంచిది' అని. కానీ, నన్ను నేను నిరూపించుకోవాలి. భయాన్ని గెలవాలంటే ఇదే సరైన స్టెప్ అనుకుని నా కంఫర్ట్ జోన్ నుండి బయటికి వచ్చి సీరియస్ డ్రామాగా 'అరవింద సమేత వీరరాఘవ'తో హిట్ సాధించాను. జీవితంలో భయాన్ని గెలవగలగాలి.. జీవితమనేది ఆట. మనల్ని మనం సీరియస్‌గా తీసుకోకూడదు. ప్రేక్షకులు నా పనిని అభిమానిస్తారు.. నన్ను కాదు. 'అజ్ఞాతవాసి' ఆ క్షణానికి ప్రేక్షక దేవుళ్లకి నచ్చలేదు.

● రచన అంటే ఏదయినా ఒక్కటే. కానీ, దాన్ని ప్రెజెంట్ చేసే విధానాలు వేరుగా ఉంటాయి. నేను రాసే మాటలు ఎంతో ప్రత్యేకంగా ఉంటాయని అందరూ అంటుంటారు. ఓ సినిమా కథ రాయడానికో, మాటలు రాయడానికో గోవా లేదంటే ఏ ప్రదేశానికో వెళ్లను.. మా ఇంట్లోనే భార్యా పిల్లల మధ్య ఉంటూనే రాసుకుంటాను. కథలో భాగంగానే సహజంగా అలాంటి మాటలు రాస్తాను.

● కామెడీ, యాక్షన్, ఎమోషన్స్.. ఇలా అన్ని రకాల వాణిజ్య అంశాలున్న చిత్రం 'అల.. వైకుంఠపురములో..'. ఓ మంచి సినిమా చూసిన అనుభూతి ప్రేక్షకులకు కలుగుతుంది. కథ రాసే వరకే మనం రాజు.. ఆ తర్వాత కథకి మనం బానిస.. అవసరానికి తగ్గట్టు అప్పటికప్పుడు కొన్ని మారుస్తుండాలి. ఈ సినిమాలోని పాటలు బాగా వచ్చాయంటే ఆ క్రెడిట్ రచయితలు, సంగీత దర్శకుడు తమన్‌లదే.

● 'జులాయి, సన్నాఫ్ సత్యమూర్తి' చిత్రాల తర్వాత బన్నీతో (అల్లు అర్జున్) నా మూడో చిత్రం 'అల.. వైకుంఠపురములో...'. ఈ సినిమాతో తప్పకుండా హ్యాట్రిక్ సాధించబోతున్నామనే నమ్మకం ఉంది. బన్నీ తొలి సినిమాకు, ఇప్పటికీ పోల్చితే నటనలో ఇంకా పరిపక్వత వచ్చింది.

● 'ఖలేజా' టైమ్‌లో హీరోయిన్ పాత్ర విషయంలో కొందరు విమర్శించారు.. దాన్ని దృష్టిలో పెట్టుకునే ఈ చిత్రంలో 'దేన్నయినా పుట్టించగల శక్తి నేలకి, మహిళలకు మాత్రమే ఉంది' అనే డైలాగ్ రాశాననడం కరెక్ట్ కాదు.. అందులో వాస్తవం ఉంది కాబట్టే రాశా. ఏదైనా ఆయా పాత్రకి తగ్గట్టు రాస్తానంతే కానీ, దేన్నీ ప్రత్యేకంగా దృష్టిలో పెట్టుకోను. కొన్ని సినిమాల్లో అత్త–అల్లుడి పాత్రలను వెకిలిగా చూపిస్తుంటారు.. కానీ, నా 'అత్తారింటికి దారేది' చిత్రంలో అత్త పాత్ర బాగా రాయడానికి కారణం మా అత్తగారు. అల్లుళ్లు ఎప్పుడూ అత్తగార్లకు గౌరవం ఇవ్వాలి.

● ప్రతి కుటుంబంలో ఉండే సమస్యలు సామాజిక సమస్యలకు తక్కువేం కాదు. మనం ప్రపంచమంతా తిరిగినా ఇంటికి వెళ్లగానే తెలియని ఆనందం. మన సంస్కృతిలో ఇల్లు అనేది ఒక భాగం. పలకరించే కుటుంబ సభ్యులు, వారితో గడిపే క్షణాలు మంచి అనుభూతిని ఇస్తాయి. అందుకే నేను కుటుంబంతో ముడిపడిన కథా చిత్రాలు చేస్తున్నాను. ఎవరి రచనా శైలి వాళ్లది.. ఒకరి రచనా శైలి బాగుంటే సంతోషిస్తా. నేను ఎందుకు ఇలా తీయలేదు? ఆ ఆలోచన నాకెందుకు రాలేదు? అని ఒక్కోసారి అసూయ పడుతుంటా.

● నేను కథలు రాయడానికి ప్రస్తుత పరిస్థితులే స్ఫూర్తినిస్తాయి. ఓ రచయితగా నాపై ఎవరి ప్రభావం లేదు. నేను పుస్తకాలన్నీ చదివేశానని చాలా మంది అనుకుంటారు. కానీ చదివింది కొన్ని పుస్తకాలే. ఇప్పుడు పతంజలిగారి రచనలు చదువుతున్నా. ● ప్యాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కించే కథ దొరికినప్పుడు తెలుగుతో పాటు ఇతర భాషల్లో ఆ సినిమాని తెరకెక్కిస్తాను. చిరంజీవిగారు హీరోగా డీవీవీ దానయ్య సినిమాకి కథ పూర్తి కాలేదు. చిరంజీవిగారికి ఓ లైన్ చెప్పాను. 'పింక్' తెలుగు రీమేక్‌కి నేను మాటలు రాయడం లేదు. కాకుంటే వాళ్లిద్దర్నీ (పవన్ కళ్యాణ్, 'దిల్' రాజు) కలిపి, 'పింక్' షో వేయించానంతే.

● దేవిశ్రీ ప్రసాద్

"మనం చేస్తున్న ప్రతి పనికీ అవార్డు వస్తుందన్న గ్యారంటీ లేదు. అలా అని వస్తేనే గొప్ప అనడం లేదు. అవార్డుల విషయంలో నా దృష్టిలో రెండు కోణాలు ఉన్నాయి. మన పని బయటకు వచ్చి ప్రేక్షకులందరికీ నచ్చినప్పుడు దాన్ని మించిన అవార్డు లేదు. అలాగే మన పనిని ఒకరు గుర్తించి పిలిచి అవార్డు ఇస్తున్నప్పుడు దాన్నొక గొప్ప గౌరవంగా నేను భావిస్తాను. ఈ గౌరవం నా బాధ్యతను పెంచుతుంది" అన్నారు దేవిశ్రీ ప్రసాద్. మహేశ్‌బాబు హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సరిలేరు నీకెవ్వరు'. ఇందులో రష్మికా మందన్నా కథానాయిక. 'దిల్' రాజు సమర్పణలో అనిల్ సుంకర, మహేశ్‌బాబు నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఈ చిత్ర సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ చెప్పిన విశేషాలు..

ట్రెండింగ్‌లోకి రాగానే వాళ్లే సారీ చెబుతారు

● మహేశ్‌బాబుగారితో నేను ఐదు (1: నేనొక్కడినే (2014), శ్రీమంతుడు (2015), భరత్ అనే నేను (2018), మహర్షి (2019), సరిలేరు నీకెవ్వరు (2020)) సినిమాలు చేశాను. చాలా సంతోషంగా ఉంది. నేనే కాదు...మహేశ్‌గారితో పని చేసిన ఎవరైనా ఆయనతో మళ్లీ మళ్లీ చేయాలనుకుంటారు. మహేశ్‌గారితో సినిమాలు చేసిన దర్శకులందరితో నేను పని చేయడం వల్ల ఈ విషయం నాకు తెలిసింది. ఆయన డైరెక్టర్స్ యాక్టర్. ఒక్కసారి కథ విని, ఆయన ఓకే అంటే ఎన్ని అడ్డంకులు వచ్చినా అండగా ఉంటారు. అంతపెద్ద స్టార్ మనపై నమ్మకం ఉంచినప్పుడు మనకు తెలియకుండానే మన పనిపై మనకు గౌరవం పెరుగుతుంది. మహేశ్ గారిది చిన్నపిల్లల మనస్తత్వం. ఏదైనా పాట లేదా సన్నివేశం నచ్చినప్పుడు చాలా ఎగ్జైటింగ్‌గా ఉంటారు. ఆ ఎగ్జైట్‌మెంట్ వచ్చినప్పుడు ఆయన్ను పట్టుకో వడం కష్టం. ఆ లక్షణం చిరంజీవిగారిలోనూ చూశాను.

● ఇదివరకు మహేశ్‌గారికి నేను సంగీతం అందించిన సినిమాల్లో ఎక్కువగా ఆయన సందేశంతో కూడుకున్న బాధ్యతాయుతమైన పాత్రలు చేశారు. కానీ 'సరిలేరు నీకెవ్వరు' సినిమాలో వాణిజ్య అంశాలు పుష్కలంగా ఉన్నాయి. దీంతో మంచి మాస్ సాంగ్స్ ఇస్తానని ఈ సినిమా ప్రారంభోత్సవం రోజున మహేశ్ అభిమానులకు ప్రామిస్ చేశాను. అన్నట్లుగానే మంచి పాటలు కుదిరాయి. ఈ సినిమాకే కాదు..దాదాపు నేను చేసిన అన్ని సినిమాలకు మొదటి సిట్టింగ్స్‌లోనే ట్యూన్స్ ఫైనలైజ్ అయ్యాయి. ఈ విషయంలో నేను కాస్త లక్కీ.

● అనిల్ రావిపూడిగారి 'ఎఫ్ 2' సినిమాకు నేను సంగీతం అందించాను.

● నా పాటలు బాగున్నాయో లేదో నా టీమ్‌ని నిర్మొహమాటంగా చెప్పమంటాను. ఈ రోజుల్లో ప్రతి ఒక్కరి దగ్గర ఫోన్ ఉంటోంది. సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. అయితే నా పాటలపై నిజాయతీగా చెప్పేవారి అభిప్రాయాలను గౌరవిస్తాను. ఏవైనా పొరపాట్లు ఉంటే మళ్లీ జరగకుండా జాగ్రత్తపడతా. ఈ సందర్భంగా ఓ విషయం చెబుతాను.'బాహుబలి' సినిమా నా అంచనాల తగ్గట్లు లేదు' అని నాతో ఎవరో అన్నారు. ఆ తర్వాత 'బాహుబలి' ఎక్కడికి వెళ్లింది? అంటే కొందరు భారీ అంచనాలు పెట్టుకుంటారు. మొదట్లో కాస్త నిరుత్సాహపడతారు. కాస్త ట్రెండింగ్‌లోకి రాగానే ఆ తర్వాత వాళ్లే సారీ చెబుతారు.

● సంగీతంపై నాకున్న ప్రేమవల్ల హీరోగా చేయలేకపోతున్నానేమో. తమిళ, తెలుగు భాషల్లో ఓ ద్విభాషా చిత్రం చేద్దామనుకుంటున్నా. ● 'ఆర్య, ఆర్య 2' చిత్రాల తర్వాత అల్లు అర్జున్, సుకుమార్, నా కాంబినేషన్‌లో మరో సినిమా వస్తుంది. ఈ చిత్రానికి 3 పాటలు కంపోజ్ చేశా. 'గుడ్‌లుక్ సఖి', 'రంగ్ దే', 'ఉప్పెన' చిత్రాలకు మ్యూజిక్ అందించబోతున్నాను. ఓ హిందీ సినిమా చేయబోతున్నా.

చాలా క్లారిటీ ఉన్న దర్శకుడు. భవిష్యత్‌లో మంచి స్థాయికి వెళతాడు. 'సరిలేరు నీకెవ్వరు' కథను మొదట నాకు అనిల్ చెప్పినప్పుడు చాలా బాగా నచ్చింది. కథ విన్నప్పుడే ఈ సినిమా పాటల గురించి ఆలోచించుకున్నాను. ఎందుకంటే కథ ప్రకారం నేను పాటలు ఇవ్వడానికి ఇష్టపడతాను. అలాగే ఇస్తూ వస్తున్నాను. 'సరిలేరు నీకెవ్వరు' సినిమాలో కూడా సందర్భానుసారంగానే పాటలు వస్తాయి. ఈ సినిమాలోని సైనికుల యాంథమ్ సాంగ్‌కు నేను లిరిక్స్ రాశాను. సైనికులంటే నాకు విపరీతమైన అభిమానం. వారికి నివాళిగా ఉండాలని ఈ సాంగ్ చేశాం. మహేశ్‌గారు కూడా మెచ్చుకున్నారు. ప్రేక్షకుల నుంచి మంచి స్పందన రావడం చాలా సంతోషాన్ని ఇచ్చింది. అలాగే 'సూర్యుడివో..చంద్రుడివో', 'డాంగ్ డాంగ్' పాటలకు కూడా మంచి స్పందన లభించింది. అందుకు ప్రేక్షకులకు థ్యాంక్స్. ఇక 'మైండ్‌బ్లాక్' సాంగ్‌లో మహేశ్‌గారి డ్యాన్స్ సూపర్బ్. ఆయన డ్యాన్స్ చూసి మేమందరం షాకయ్యాం. మహేశ్‌గారి కామెడీ టైమింగ్ బాగుంటుంది. అప్పుడప్పుడు ఆయన సరదాగా వెటకారంగా మాట్లాడుతుంటారు. 'మైండ్ బ్లాక్' సాంగ్‌లో అలా మహేశ్ వాయిస్ పెట్టాం.

● విజయశాంతిగారితో మా నాన్నగారు (రచయిత సత్యమూర్తి) పనిచేశారు. ఇప్పుడు నేను ఆమెతో ఈ సినిమాకు పనిచేయడం చాలా సంతోషంగా ఉంది. ఈ సినిమాలో మహేశ్, విజయశాంతిగార్ల మధ్య సన్నివేశాలు భలేగా ఉంటాయి. అలాగే మహేశ్, ప్రకాష్‌రాజ్‌గార్ల సన్నివేశాలు కూడా ప్రేక్షకులను అలరిస్తాయి.

చిన్న మార్పు

● నిత్యామీనన్

నిత్యామీనన్ మల్టీటాలెంటెడ్. బాగా యాక్ట్ చేయగలరు. మలయాళీ అయినా అచ్చ తెలుగులో సొంతంగా డబ్బింగ్ చెప్పుకోగలరు. సినిమాల్లో పాటలు పాడగలరు. ఇప్పుడు తనలోని గాయనిపై మరింత దృష్టి పెట్టారు. గాయనిగా నిత్యామీనన్ తన తొలి ఆల్బమ్‌ను త్వరలోనే విడుదల చేయనున్నారు. ఈ మ్యూజిక్ ఆల్బమ్‌కి లండన్ మ్యూజిక్ కంపోజర్ సామిక్ దత్తా సంగీతాన్ని సమకూర్చగా నిత్యామీనన్ పాడనున్నారు. ఈ విషయాన్ని తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ద్వారా తెలియజేశారామె. ''సరి కొత్త ప్రాజెక్ట్ తయారవుతోంది. కెరీర్‌లో చిన్న మార్పు రాబోతోంది. నా తొలి మ్యూజిక్ సింగిల్ త్వరలో విడుదల కాబోతోంది. అందరికీ త్వరగా వినిపించేయాలనే ఆతురతతో ఉన్నాను'' అన్నారు. ప్రస్తుతం జయలలిత బయోపిక్ 'ది ఐరన్ లేడీ', తెలుగులో సత్యదేవ్‌తో ఓ సినిమా చేస్తున్నారు నిత్యామీనన్.


● డీఎస్ రావు

యాక్షన్.. కామెడీ

సాగర్ శైలేష్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'శివ 143'. తుమ్మలపల్లి రామసత్యనారాయణ నిర్మాత. ఈ సినిమాలోని ఓ పాటను జేడీ చక్రవర్తి విడుదల చేసి, మాట్లాడుతూ – ''కథ, స్క్రీన్‌ప్లే, కొరియోగ్రఫీ చేసి హీరోగా శైలేష్ నటించాడని విని ఆశ్చర్యపోయా. 'రహస్యం'లో తన స్క్రీన్ ప్రెజెన్స్, యాక్షన్ బావున్నాయి. ఇందులో డీఎస్ రావు మంచి పాత్ర చేశారు'' అన్నారు. ''శివ 143'ని సంక్రాంతికి రిలీజ్ చేద్దామనుకున్నాం. సెన్సార్ పూర్తి కాకపోవడంతో ఆగాం. యాక్షన్, కామెడీ.. ఇలా అన్ని అంశాలు ఉన్నాయి'' అన్నారు రామసత్యనారాయణ. ''జేడీ చక్రవర్తిగారు నా సినిమాను గుర్తుపెట్టుకొని, అభినందించడం హ్యాపీ'' అన్నారు సాగర్ శైలేష్.

దక్షిణాదిలో గొప్ప సినిమాలొస్తున్నాయి

● కంగనా

''పంగా' సినిమాలో ఓ మధ్య తరగతి మహిళగా, అందులోనూ తల్లిగా నటించా.. తల్లి పాత్ర పోషించడం చాలా గొప్పగా అనిపించింది'' అని కంగనా రనౌత్ అన్నారు. అశ్విని అయ్యర్ తివారీ దర్శకత్వంలో కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటించిన సినిమా 'పంగా'. జస్సీ గిల్, రిచా చద్దా కీలక పాత్రలు పోషించారు. ఫాక్స్ స్టార్ స్టూడియోస్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో కంగనా, అశ్విని విలేకరులతో సమావేశమయ్యారు. కంగనా రనౌత్ మాట్లాడుతూ– ''అశ్విని మంచి డైరెక్టర్. పని పట్ల మంచి ఫోకస్, క్లారిటీ ఉంది. నేను చాలా మందితో వరుసగా సినిమాలు చేశాను. కంగనాతో పని చేయడం కష్టం అని మాట్లాడిన వారికి అశ్వినీలాంటి వారే సమాధానం చెబుతున్నారు. 'పంగా' చిత్రంలో నాది నేషనల్ లెవల్ కబడ్డీ క్రీడాకారిణి పాత్ర. ఆటకూ, కుటుంబ బాధ్యతలకూ మధ్య నలిగే పాత్ర. అప్పుడు 'మణికర్ణిక', ఇప్పుడు జయలలిత బయోపిక్ 'తలైవి' సినిమా చేస్తూ హైదరాబాద్, చెన్నై తిరుగుతూ పూర్తిగా సౌత్ ఇండియన్‌గా మారిపోయా. సౌత్ ఇండియాలో గొప్ప సినిమాలు వస్తున్నాయి. ఇక్కడి సినిమా కల్చర్ నాకు బాగా నచ్చింది'' అన్నారు.

సాక్షి స్పోర్ట్స్
శనివారం
11-1-2020

భారత కెప్టెన్‌గా మూడు ఫార్మాట్‌లలో కలిపి కోహ్లి 11 వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు. పాంటింగ్ (252)ను అధిగమించి అతి తక్కువ ఇన్నింగ్స్‌లలో (196) ఈ ఘనత సాధించిన కెప్టెన్‌గా గుర్తింపు పొందాడు.

భారత్ తరఫున టి20ల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా బుమ్రా (53) నిలిచాడు. అశ్విన్ (52), చహల్ (52) ఇప్పటి వరకు అగ్రస్థానంలో ఉన్నారు.

భారత్ ఇప్పటివరకు కనీసం మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లు 15 ఆడింది. 13 గెలిచింది. ఒక దానిని 'డ్రా' చేసుకుంది. ఒకే ఒక్క సిరీస్‌ను (2019లో కివీస్ చేతిలో) కోల్పోయింది.

లాంఛనం పూర్తయింది

ఊహించిన ఫలితమే..! దుర్బేధ్యమైన భారత జట్టు ముందు నిలవడం శ్రీలంకకు సాధ్యం కాదని మళ్లీ తేలిపోయింది. కనీస పోరాటపటిమ కూడా లేకుండా ప్రత్యర్థి చేతులెత్తేయడంతో కోహ్లి సేన ఖాతాలో మరో సిరీస్ విజయం చేరింది. ముందుగా బ్యాటింగ్‌లో సమష్టి ప్రదర్శనతో భారీ స్కోరు చేసి ఆపై పదునైన బౌలింగ్‌తో చెలరేగిన టీమిండియా సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. గత మ్యాచ్‌లాగే చివరి టి20లోనూ పేలవంగా ఆడిన లంక భారత గడ్డపై ఓటమి లాంఛనాన్ని పూర్తి చేసుకుంది. 2008లో శ్రీలంక గడ్డపై టెస్టు సిరీస్ కోల్పోయిన తర్వాత లంకతో మూడు ఫార్మాట్‌లలో కలిపి 19 సిరీస్‌లతో తలపడిన భారత్ 17 గెలవగా, మరో 2 'డ్రా' అయ్యాయి. ఓడిపోవడానికే వచ్చామన్నట్లుగా తాజా పర్యటనలో మలింగ బృందం ఆడగా, భారత్ ఆధిపత్యం ఎలాంటిదో స్పష్టంగా కనిపించింది.

శ్రీలంకపై భారత్‌కు మరో సిరీస్ గెలుపు

- చివరి టి20లో 78 పరుగులతో ఘనవిజయం
- రాహుల్, ధావన్ అర్ధ సెంచరీలు
- రాణించిన టీమిండియా పేసర్లు

పుణే: కొత్త ఏడాదిని మరో సిరీస్ విజయంతో భారత్ ప్రారంభించింది. శ్రీలంకతో ముగిసిన మూడు మ్యాచ్‌ల టి20 పోరును టీమిండియా 2-0తో సొంతం చేసుకుంది. శుక్రవారం ఇక్కడ జరిగిన చివరి టి20లో భారత్ 78 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. ఓపెనర్లు కేఎల్ రాహుల్ (36 బంతుల్లో 54; 5 ఫోర్లు, 1 సిక్స్), శిఖర్ ధావన్ (36 బంతుల్లో 52; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 65 బంతుల్లోనే 97 పరుగులు జోడించడం విశేషం. చివర్లో మనీశ్ పాండే (18 బంతుల్లో 31 నాటౌట్; 4 ఫోర్లు), విరాట్ కోహ్లి (17 బంతుల్లో 26; 2 ఫోర్లు, 1 సిక్స్) 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' శార్దుల్ ఠాకూర్ (8 బంతుల్లో 22 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్సర్లు) కీలక పరుగులు జోడించారు. అనంతరం శ్రీలంక 15.5 ఓవర్లలో 123 పరుగులకే కుప్పకూలింది. ధనంజయ డిసిల్వా (36 బంతుల్లో 57; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ సాధించగా, ఏంజెలో మాథ్యూస్ (20 బంతుల్లో 31; 1 ఫోర్, 3 సిక్సర్లు) రాణించాడు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 37 బంతుల్లో 68 పరుగులు జత చేశారు. అయితే ఈ ఇద్దరు బ్యాట్స్‌మెన్ మినహా మిగతావారిలో ఒక్కరూ కనీసం రెండంకెల స్కోరు చేయలేకపోయారు. నవదీప్ సైనీకి 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' పురస్కారం లభించింది.

ధావన్ జోరు...

వరుస వైఫల్యాలతో విమర్శలు ఎదుర్కొంటూ తీవ్ర ఒత్తిడిలో ఉన్న ధావన్ కీలక సమయంలో ధాటైన ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. 1 పరుగు వద్దే తను ఇచ్చిన క్యాచ్‌ను షనక వదిలేయడంతో బతికిపోయిన భారత ఓపెనర్ ఈ అవకాశాన్ని చక్కగా ఉపయోగించుకున్నాడు. మలింగ ఓవర్లో రెండు ఫోర్లు బాదిన అతను, లాహిరు వేసిన తర్వాతి ఓవర్లోనూ వరుసగా రెండు ఫోర్లు కొట్టాడు. హసరంగ బౌలింగ్‌లో స్లాగ్ స్వీప్‌తో శిఖర్ కొట్టిన సిక్సర్ హైలైట్‌గా నిలిచింది. ఈ క్రమంలో 34 బంతుల్లో అతని అర్ధ సెంచరీ పూర్తయింది. అయితే ఆ వెంటనే అతను మరో భారీషాట్‌కు ప్రయత్నించి వెనుదిరిగాడు. రాహుల్ ఫామ్ ఈ మ్యాచ్‌లోనూ కొనసాగింది. మాథ్యూస్ ఓవర్లో రెండు ఫోర్లతో దూకుడు మొదలు పెట్టిన అతను ధనంజయ బౌలింగ్‌లో భారీ సిక్సర్ బాదాడు. 34 బంతుల్లోనే రాహుల్ కూడా హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. అయితే సందకన్ బౌలింగ్‌లో కుశాల్ స్టంపింగ్‌కు రాహుల్ వెనుదిరగాల్సి వచ్చింది.

ఆకట్టుకున్న పాండే...

తొలి వికెట్‌కు భారీ భాగస్వామ్యం తర్వాత భారత్ 25 పరుగుల వ్యవధిలోనే నాలుగు వికెట్లు కోల్పోయింది. నాలుగున్నరేళ్ల తర్వాత భారత్ తరఫున ఆడిన సంజు సామ్సన్ (6) అవకాశాన్ని ఉపయోగించుకోలేకపోగా, శ్రేయస్ అయ్యర్ (4) విఫలమయ్యాడు. ఈ దశలో పాండే తన ఆటతో ఇన్నింగ్స్‌కు ఊపు తెచ్చాడు. తన బలమైన బ్యాక్‌పుట్‌పై నియంత్రణతో ఆడుతూ అతను ముచ్చటైన బౌండరీలు కొట్టాడు. ఆరో స్థానంలో బరిలోకి దిగిన కోహ్లి కూడా తనదైన శైలిలో వేగంగా పరుగులు జోడించాడు. వీరిద్దరు 28 బంతుల్లో 42 పరుగులు జోడించిన అనంతరం కోహ్లి రనౌటయ్యాడు. సుందర్ (0) తొలి బంతికే అవుట్ కాగా, చివర్లో శార్దుల్ మెరుపు బ్యాటింగ్‌తో భారత్ స్కోరు 200 పరుగులు దాటింది. కుమార వేసిన ఆఖరి ఓవర్లోనే భారత్‌కు 20 పరుగులు వచ్చాయి. పాండే, శార్దుల్ 14 బంతుల్లోనే అభేద్యంగా 37 పరుగులు జత చేశారు.

> కొత్త ఏడాదిలో శుభారంభం లభించింది. సరైన దిశలో అడుగు వేశాం. రెండు మ్యాచ్‌లలో చక్కటి ప్రదర్శన పట్ల సంతోషంగా ఉన్నా. 200 పరుగుల స్కోరు దాటితే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. మిడిలార్డర్ విఫలమైనా పాండే, శార్దుల్ ఆదుకున్నారు. సీనియర్ ఆటగాళ్లు విఫలమైతే ఎవరు బాధ్యత తీసుకోగలరో చూడాలంటే ఇలాంటి సందర్భాలు మరిన్ని రావాలి. ముందుగా బ్యాటింగ్ చేస్తే భారీ స్కోరు సాధించి చూపించాలి. ఈ రోజు మ్యాచ్‌లో 180 చేయగలమనుకుంటే అంతకంటే ఎక్కువే చేశాం. ముందుగా బ్యాటింగ్ చేస్తే బాగా ఆడలేమనే అపప్రథ కోరుకోవడం లేదు. ముగ్గురు ఓపెనర్లు సత్తా కలిగినవారైతే ప్రత్యామ్నాయాలకు మంచి అవకాశం ఉంటుంది. ఒకరితో మరొకరు పోటీ పడుతున్నారనే మాటలు నేను నమ్మను. ఇది టీమ్‌గా అందరూ గుర్తించాలి.
>
> –విరాట్ కోహ్లి, భారత కెప్టెన్

ఇద్దరు మినహా...

భారీ లక్ష్యఛేదనలో ఎప్పటిలాగే శ్రీలంక తడబడింది. పవర్‌ప్లే ముగిసేలోపే జట్టు నాలుగు వికెట్లు చేజార్చుకుంది. తొలి ఓవర్లోనే గుణతిలక (1)ను బుమ్రా అవుట్ చేయగా, శార్దుల్ వేసిన తర్వాతి ఓవర్లో అవిష్క (9) వెనుదిరిగాడు. పాండే చక్కటి ఫీల్డింగ్‌కు ఒషాడా (2) రనౌట్ కాగా...సైనీ అద్భుత యార్కర్‌తో కుశాల్ పెరీరా (7) స్టంప్స్‌ను పడగొట్టాడు. ఈ స్థితిలో మాథ్యూస్, ధనంజయ కలిసి ఆదుకునే ప్రయత్నం చేశారు. దాదాపు ఏడాదిన్నర తర్వాత టి20 బరిలోకి దిగిన సీనియర్ మాథ్యూస్ కొన్ని చూడచక్కటి షాట్లు బాదాడు. ముఖ్యంగా సుందర్ ఓవర్లో మాథ్యూస్ రెండు భారీ సిక్సర్లు, ఫోర్ బాదడంతో మొత్తం 19 పరుగులు వచ్చాయి. అయితే సుందర్ తర్వాతి ఓవర్లో మరో సిక్స్ కొట్టిన అనంతరం భారీ షాట్‌కు ప్రయత్నించి మాథ్యూస్ అవుటయ్యాడు. మరోవైపు ధనంజయ ఎదురుదాడి బ్యాటింగ్ కూడా ఆకట్టుకుంది. సైనీ ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన అతను చహల్ బౌలింగ్‌లో లాంగాఫ్ మీదుగా బాదిన సిక్సర్ లంక ఇన్నింగ్స్‌లో ప్రత్యేక ఆకర్షణగా కనిపించింది. 31 బంతుల్లోనే ధనంజయ అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కేవలం 29 పరుగుల వ్యవధిలో చివరి 6 వికెట్లు కోల్పోయి శ్రీలంక ఓటమిని ఆహ్వానించింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రాహుల్ (స్టంప్డ్) కుశాల్ (బి) సందకన్ 54; ధావన్ (సి) గుణతిలక (బి) సందకన్ 52; సామ్సన్ (ఎల్బీ) (బి) హసరంగ 6; మనీశ్ పాండే (నాటౌట్) 31; అయ్యర్ (సి అండ్ బి) సందకన్ 4; కోహ్లి (రనౌట్) 26; సుందర్ (సి) సందకన్ (బి) లాహిరు 0; శార్దుల్ ఠాకూర్ (నాటౌట్) 22; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 201. వికెట్ల పతనం:** 1-97; 2-106; 3-118; 4-122; 5-164; 6-164.

బౌలింగ్: మలింగ 4-0-40-0; మాథ్యూస్ 3-0-38-0; ధనంజయ డి సిల్వా 1-0-13-0; లాహిరు కుమార 4-0-46-1; హసరంగ 4-0-27-1; సందకన్ 4-0-35-3.

శ్రీలంక ఇన్నింగ్స్: గుణతిలక (సి) సుందర్ (బి) బుమ్రా 1; అవిష్క ఫెర్నాండో (సి) అయ్యర్ (బి) శార్దుల్ 9; కుశాల్ పెరీరా (బి) సైనీ 7; ఒషాడా ఫెర్నాండో (రనౌట్) 2; మాథ్యూస్ (సి) పాండే (బి) సుందర్ 31; ధనంజయ డి సిల్వా (సి) బుమ్రా (బి) సైనీ 57; షనక (సి అండ్ బి) శార్దుల్ 9; హసరంగ (రనౌట్) 0; సందకన్ (స్టంప్డ్) సామ్సన్ (బి) సుందర్ 1; మలింగ (సి) కోహ్లి (బి) సైనీ 0; లాహిరు కుమార (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 5; మొత్తం (15.5 ఓవర్లలో ఆలౌట్) 123.

వికెట్ల పతనం: 1-5; 2-11; 3-15; 4-26; 5-94; 6-110; 7-110; 8-118; 9-122; 10-123.

బౌలింగ్: బుమ్రా 2-1-5-1; శార్దుల్ 3-0-19-2; సైనీ 3.5-0-28-3; సుందర్ 4-0-37-2; చహల్ 3-0-33-0.

ఖతర్ ఓపెన్ విజేత బోపన్న జంట

దోహా (ఖతర్): భారత టెన్నిస్ డబుల్స్ స్టార్ ప్లేయర్ రోహన్ బోపన్న కొత్త ఏడాదిని టైటిల్‌తో మొదలుపెట్టాడు. ఖతర్ ఓపెన్ ఏటీపీ-250 టోర్నమెంట్‌లో బోపన్న (భారత్)-వెస్లీ కూలాఫ్ (నెదర్లాండ్స్) ద్వయం విజేతగా నిలిచింది. శుక్రవారం జరిగిన ఫైనల్లో బోపన్న-కూలాఫ్ జంట 3-6, 6-2, 10-6తో 'సూపర్ టైబ్రేక్'లో ల్యూక్ బామ్‌బ్రిడ్జ్ (ఇంగ్లండ్)-శాంటియాగో గొంజాలెజ్ (మెక్సికో) జోడీని ఓడించింది. టైటిల్ నెగ్గిన బోపన్న జంటకు 76,870 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 54 లక్షల 50 వేలు)తో పాటు 250 ఏటీపీ ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. శుక్రవారమే జరిగిన సెమీఫైనల్లో బోపన్న-కూలాఫ్ జంట 7-5, 6-2తో రెండో సీడ్ హెన్రీ కొంటినెన్ (ఫిన్‌లాండ్)-స్కుగోర్ (క్రొయేషియా) జోడీపై గెలిచింది. ఓవరాల్‌గా 39 ఏళ్ల బోపన్నకు కెరీర్‌లో ఇది 19వ డబుల్స్ టైటిల్.

తెలంగాణ జిమ్నాస్ట్ సురభికి మూడు పతకాలు

గువాహటి: ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలంగాణ జిమ్నాస్ట్ సురభి ప్రసన్న మూడు పతకాలు సాధించింది. శుక్రవారం జరిగిన అండర్-17 బాలికల మూడు ఈవెంట్‌లలో సురభి రెండు రజతాలు, ఒక కాంస్యం సాధించింది. ఆల్ అరౌండ్ వ్యక్తిగత విభాగంలో సురభి 39.85 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని దక్కించుకోగా... టేబుల్ వాల్ట్, బ్యాలెన్సింగ్ బీమ్ ఈవెంట్స్‌లో ఆమె రెండో స్థానంలో నిలిచి రెండు రజత పతకాలను సొంతం చేసుకుంది.

భారత మహిళల జట్లలో ముగ్గురు ఆంధ్ర క్రికెటర్లు

అంజలి, కల్పన

మేఘన

ముంబై: నాలుగు జట్ల అంతర్జాతీయ టి20 మహిళల క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత 'ఎ', 'బి' జట్లను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) శుక్రవారం ప్రకటించింది. ఈ రెండు జట్లలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు క్రికెటర్లు రావి కల్పిన, సబ్బినేని మేఘన, అంజలి శర్వాణి ఎంపికయ్యారు. పట్నాలో ఈనెల 16 నుంచి 22 వరకు జరిగే ఈ టోర్నీలో భారత్ 'ఎ'... 'బి' జట్లతోపాటు బంగ్లాదేశ్, థాయ్‌లాండ్ జట్లు బరిలోకి దిగుతాయి. దేశవాళీ టోర్నీల్లో రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు (ఆర్ఎస్‌పీబీ) తరఫున ఆడే కల్పన భారత 'ఎ' జట్టులో... మేఘన, అంజలి భారత 'బి' జట్టులో చోటు దక్కించుకున్నారు. భారత 'ఎ' జట్టుకు దేవిక వైద్య... భారత 'బి' జట్టుకు స్నేహ రాణే కెప్టెన్‌లుగా వ్యవహరిస్తారు.

వార్న్ టోపీ... రూ.5 కోట్లు

ఆస్ట్రేలియా కార్చిచ్చు బాధితులకు దిగ్గజాల చేయూత

సిడ్నీ: ఆస్ట్రేలియా స్పిన్ దిగ్గజం షేన్‌వార్న్ 'బ్యాగీ గ్రీన్' టోపీ వేలంలో దాదాపు రూ.5 కోట్లు పలికింది. కార్చిచ్చుతో ఉక్కిరిబిక్కిరవుతున్న తమ దేశ బాధితుల కోసం అతను తనకెంతో ఇష్టమైన క్రికెట్ జట్టు టోపీని వేలానికి వేయగా 7 లక్షల అమెరికన్ డాలర్లు లభించాయి. ఆ క్యాప్‌ను వార్న్ 145 టెస్టుల్లో ధరించాడు. 700పైగా వికెట్లు తీశాడు. ఆసీస్‌లోని ప్రముఖ కామన్వెల్త్ బ్యాంక్ వేలంలో ఆ క్యాప్‌ను దక్కించుకుంది. చారిటీ కోసం 2003లో దివంగత దిగ్గజం, ఆల్ టైమ్ గ్రేట్ 'సర్' డొనాల్డ్ బ్రాడ్‌మన్ టోపీ (రూ. 2 కోట్లు)కి వచ్చిన వేలం ధరకంటే రెట్టింపు మొత్తం వార్న్ టోపీకి వచ్చింది.

హామిల్టన్ విరాళం 5 లక్షల డాలర్లు: ఆస్ట్రేలియాలో కొనసాగుతున్న విపత్తుపై ప్రపంచవ్యాప్తంగా క్రీడా దిగ్గజాలు కదిలారు. ఫార్ములావన్ చాంపియన్ రేసర్ లూయిస్ హామిల్టన్ (బ్రిటన్) 5 లక్షల అమెరికా డాలర్లు (రూ. 3 కోట్ల 54 లక్షలు) విరాళమిచ్చాడు. కోట్లకొద్దీ మూగజీవాలు మృత్యువాత పడటం తనను తీవ్రంగా కలచి వేసిందని చెప్పాడు. గ్రేటెస్ట్ టెన్నిస్ ప్లేయర్, 23 గ్రాండ్ స్లామ్ టైటిల్స్ విజేత సెరెనా విలియమ్స్ తన ఆటోగ్రాఫ్‌తో కూడిన డ్రెస్‌ను విరాళంగా ఇచ్చింది. 'ర్యాలీ ఆఫ్ రిలీఫ్' పేరుతో ఈ నెల 15న జరిగే ఎగ్జిబిషన్ మ్యాచ్‌ల్లో అమెతో పాటు స్విస్ స్టార్ ఫెడరర్, నాదల్ (స్పెయిన్) తదితరులు నిధుల సేకరణ కోసం కోర్టులో తలపడనున్నారు. ఇప్పటికే ఆ దేశ టెన్నిస్ స్టార్ కిరియోస్ ఆసీస్ ఓపెన్‌లో తాను సంధించే ఒక్కో ఏస్‌కు 200 ఆసీస్ డాలర్లు (దాదాపు రూ. 10 వేలు), క్రికెటర్లు క్రిస్ లిన్, మ్యాక్స్‌వెల్, డార్సీ బిగ్‌బాష్ లీగ్‌లో బాదే సిక్స్‌కు 250 ఆసీస్ డాలర్లు (రూ. 12 వేలు) చొప్పున విరాళం ఇస్తామని ప్రకటించారు.

హైదరాబాద్‌లో పీబీఎల్ సెమీస్, ఫైనల్స్

వేదిక బెంగళూరు నుంచి భాగ్యనగరానికి మార్పు

న్యూఢిల్లీ: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్) ఐదో సీజన్ షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. మొదట బెంగళూరు అంచె పోటీలను (ఫిబ్రవరి 5 నుంచి 6 వరకు), అనంతరం 7, 8వ తేదీల్లో రెండు సెమీఫైనల్స్‌తో పాటు 9న జరిగే ఫైనల్ పోరును బెంగళూరులోని శ్రీ కంఠీరవ ఇండోర్ స్టేడియంలో జరిగేలా షెడ్యూల్‌ను తయారు చేశారు. అయితే ఆ సమయంలో స్టేడియం అందుబాటులో ఉండడం లేదని... దాంతో అక్కడ మ్యాచ్‌లను నిర్వహించడం కష్టం అంటూ బెంగళూరు రాప్టర్స్ జట్టు గురువారం ట్విట్టర్ వేదికగా స్పష్టం చేసింది. దీంతో బెంగళూరు అంచె మ్యాచ్‌లతోపాటు సెమీఫైనల్స్, ఫైనల్‌ను హైదరాబాద్‌కు తరలిస్తూ పీబీఎల్ నిర్వాహకులు శుక్రవారం నిర్ణయం తీసుకున్నారు. సెమీస్, ఫైనల్ మ్యాచ్‌లు ముందుగా నిర్ణయించిన తేదీల్లోనే జరుగుతాయి. ఫలితంగా పీబీఎల్ తాజా సీజన్‌లో హైదరాబాద్ ఆతిథ్యం ఇచ్చే మ్యాచ్‌ల సంఖ్య పెరిగింది. మొదట హైదరాబాద్‌లో మ్యాచ్‌లు జనవరి 29 నుంచి ఫిబ్రవరి 4 వరకు ఉండగా... ప్రస్తుతం అది ఫిబ్రవరి 9వ తేదీ వరకు పొడిగించారు. పీబీఎల్ ఐదో సీజన్ ఈ నెల 20న చెన్నై వేదికగా ప్రారంభమవుతుంది. 24 వరకు చెన్నైలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఆ తర్వాత జనవరి 25 నుంచి 28 వరకు లక్నో అంచె పోటీలు ఉంటాయి.

సింధు, సైనా నిష్క్రమణ

సింధు

సైనా

కౌలాలంపూర్: బ్యాడ్మింటన్ సీజన్ తొలి టోర్నమెంట్‌లో భారత స్టార్ క్రీడాకారిణులు పీవీ సింధు, సైనా నెహ్వాల్ ఆకట్టుకోలేకపోయారు. మలేసియా మాస్టర్స్ వరల్డ్ సూపర్-500 టోర్నమెంట్‌లో వీరిద్దరి పోరాటం క్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ చాంపియన్ పీవీ సింధు 16-21, 16-21తో టాప్ సీడ్, ప్రపంచ రెండో ర్యాంకర్ తై జు యింగ్ (చైనీస్ తైపీ) చేతిలో... ప్రపంచ పదో ర్యాంకర్ సైనా 8-21, 7-21తో రియో ఒలింపిక్స్ చాంపియన్ కరోలినా మారిన్ (స్పెయిన్) చేతిలో పరాజయం పాలయ్యారు. తై జు యింగ్ చేతిలో సింధుకిది 12వ ఓటమికాగా... మారిన్ చేతిలో సైనా ఓడటం ఇది ఏడోసారి. క్వార్టర్స్‌లో నిష్క్రమించిన సింధు, సైనాలకు 2,400 డాలర్ల (రూ. లక్షా 70 వేలు) చొప్పున ప్రైజ్‌మనీ లభించింది.

హైదరాబాద్ తొమ్మిదో ఓటమి

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) తాజా సీజన్‌లో హైదరాబాద్ పరాజయాలకు ఇప్పట్లో ఫుల్‌స్టాప్ పడేలా లేదు. శుక్రవారం ఇక్కడి జీఎంసీ బాలయోగి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ ఎఫ్‌సీ 1-3 గోల్స్ తేడాతో చెన్నైయిన్ ఎఫ్‌సీ చేతిలో ఓడింది. దీంతో సీజన్‌లో తొమ్మిదో పరాజయాన్ని మూటగట్టుకొని ప్లే ఆఫ్స్ అవకాశాలను దాదాపుగా దూరం చేసుకుంది. చెన్నై ఆటగాడు వాల్స్కీస్ (43వ, 65వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేయగా... రాఫెల్ (40వ నిమిషంలో) ఒక గోల్ సాధించాడు. హైదరాబాద్ తరఫున నమోదైన ఏకైక గోల్‌ను మార్సెలినో (87వ నిమిషంలో) చేశాడు. 12 మ్యాచ్‌లు ఆడిన హైదరాబాద్ ఐదు పాయింట్లతో చివరిదైన పదో స్థానంలో ఉంది. నేడు జరిగే మ్యాచ్‌లో ముంబై సిటీ ఎఫ్‌సీతో ఒడిశా ఎఫ్‌సీ తలపడుతుంది.

'టోక్యో'లో నిరసనలు తెలిపారో జాగ్రత్త!

క్రీడాకారులకు మార్గదర్శకాలు విడుదల చేసిన ఐఓసీ

థామస్ బాచ్

లుసానే (స్విట్జర్లాండ్): మోకాళ్లపై నిల్చోవడం... చేతి సంజ్ఞలు చేయడం... పతకాల స్వీకారాన్ని అగౌరవ పర్చడంలాంటి నిరసనలు ప్రతిష్టాత్మక ఒలింపిక్స్ వేదికపై చేయరాదని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) అధ్యక్షుడు థామస్ బాచ్ స్పష్టం చేశారు. టోక్యో ఒలింపిక్స్ క్రీడల వేదికని ఎలాంటి రాజకీయ నిరసనలకు వాడుకోవడానికి వీల్లేదని మూడు పేజీలతో కూడిన మార్గదర్శకాలు, తూచ తప్పకుండా పాటించాల్సిన నియమ నిబంధనల్ని ఐఓసీ విడుదల చేసింది. వ్యక్తిగత, రాజకీయ నిరసనలతో టోక్యో ఒలింపిక్స్‌కు ఆటంకం కల్పిస్తే కఠినమైన చర్యలు తప్పవని అందులో పేర్కొంది. ఐఓసీ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించిన అథ్లెట్లపై మూడు అంచెలుగా చర్యలు తీసుకుంటామని ఐఓసీ అథ్లెట్స్ కమిషన్ చైర్మన్ కిర్‌స్టీ కొవెంట్రీ తెలిపారు. ఐఓసీ క్రమశిక్షణ చర్యలతో పాటు ఆయా అంతర్జాతీయ క్రీడా సమాఖ్యలు, జాతీయ క్రీడా సంఘాల నుంచి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఈ ఏడాది జూలై 24 నుంచి ఆగస్టు 9 వరకు నిరసనలపై నిషేధాజ్ఞలు అమలవుతాయన్నారు. అయితే అధికారిక మీడియాలో, సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను వెల్లడించవచ్చని చెప్పారు. గత ఒలింపిక్స్‌లలో కొందరు క్రీడాకారులు పతక విజేతలయ్యాక తీరా ప్రదానోత్సవంలో పతకాల్ని నేలకేసి కొట్టడం, ఫీల్డ్‌లో మోకాళ్లపై నిల్చొని నిరసనలు తెలిపారు.

'వాడా' నుంచి అర్బిట్రేషన్ కోర్టుకు...

మాంట్రియల్: రష్యా అప్పీల్‌పై త్వరలో స్పోర్ట్స్ అర్బిట్రేషన్ కోర్టు (సీఏఎస్) విచారించనుంది. వ్యవస్థీకృత డోపింగ్‌కు పాల్పడటంతో రష్యాపై ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) నాలుగేళ్ల నిషేధం విధించింది. దీనిపై గత నెల 27న రష్యా అప్పీల్ చేసుకోవడంతో 'వాడా' ఈ కేసును సీఏఎస్‌కు నివేదించింది. నిషేధం వల్ల రష్యా జట్లు ఈ టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొనలేకపోతున్నాయి. డోపింగ్ మచ్చలేని అథ్లెట్లు మాత్రం స్వతంత్రంగా వ్యక్తిగత ఈవెంట్లలో పాల్గొనే అవకాశం ఇచ్చింది

విండీస్‌దే వన్డే సిరీస్

రెండో మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై వికెట్ తేడాతో గెలుపు

విజయానంతరం కాట్రెల్, హెడెన్ వాల్ష్ సెల్ఫీ

బ్రిడ్జ్‌టౌన్: ఉత్కంఠగా జరిగిన వెస్టిండీస్, ఐర్లాండ్ రెండో వన్డేలో విండీస్ బౌలర్ షెల్డన్ కాట్రెల్ మ్యాచ్ విన్నర్‌గా అవతరించాడు. చివరి ఓవర్లలో విండీస్ విజయానికి 5 పరుగులు అవసరం కాగా... తొలి నాలుగు బంతుల్లో కేవలం మూడు పరుగులు మాత్రమే లభించాయి. ఈ సమయంలో ఐదో బంతిని కవర్స్ మీదుగా సిక్సర్ కొట్టిన కాట్రెల్ మరో బంతి మిగిలి ఉండగానే జట్టుకు విజయాన్ని అందించాడు. ఫలితంగా గురువారం అర్ధరాత్రి దాటాక ముగిసిన రెండో వన్డేలో విండీస్ జట్టు వికెట్ తేడాతో ఐర్లాండ్‌పై నెగ్గింది. తాజా విజయంతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే విండీస్ 2-0తో సిరీస్‌ను సొంతం చేసుకుంది. తొలుత ఐర్లాండ్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 237 పరుగులు చేసింది. ఓపెనర్ పాల్ స్టిర్లింగ్ (63; 7 ఫోర్లు, సిక్స్) రాణించాడు. విండీస్ బౌలర్ అల్జారి జోసెఫ్ (4/32), కాట్రెల్ (3/51) ఆకట్టుకున్నారు. అనంతరం ఛేదనకు దిగిన విండీస్ 49.5 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 242 పరుగులు చేసి గెలిచింది. పడుతూ లేస్తూ సాగిన విండీస్ ఇన్నింగ్స్‌ను నికోలస్ పూరన్ (52; 6 ఫోర్లు), సారథి పొలార్డ్ (40; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఆదుకున్నారు. అయితే వీరిద్దరూ రెండు పరుగుల తేడాతో పెవిలియన్‌కు చేరడంతో విండీస్ కష్టాల్లో పడింది. చివర్లో హెడెన్ వాల్ష్ జూనియర్ (46 నాటౌట్, 4 ఫోర్లు), కాట్రెల్ (7 నాటౌట్; సిక్స్) విండీస్‌ను గెలుపు తీరాలకు చేర్చారు. ఐర్లాండ్ బౌలర్ సిమీ సింగ్ (3/48) రాణించాడు. అల్జారి జోసెఫ్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా ఎంపికయ్యాడు. చివరి వన్డే గ్రెనెడా వేదికగా ఆదివారం జరుగుతుంది.

epaper.sakshi.com

సాక్షి బిజినెస్
శనివారం
11-1-2020
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
147 ▲	41 ▲
41,600	12,257

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30కి)

నాస్‌డాక్	9,186	▼ 17
డోజోన్స్	28,863	▼ 93
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,588	▼ 10
డాక్స్	13,483	▼ 12
షాంఘై	3,092	▼ 3
నికాయ్	23,851	▲ 110

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	70.45	72.09
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	91.51	94.73
€	యూరో	ఎస్‌బీఐ	77.71	80.63
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	63.88	66.29
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	47.91	50.10
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	51.88	53.68
SAR	సౌదీ రియాల్	ధామన్‌కుర్	18.13	19.73
UAE D	యూఏఈ దిర్హామ్	ధామన్‌కుర్	18.85	19.85
¥	చైనా యువాన్	ధామన్‌కుర్	9.63	11.03

ఇన్ఫోసిస్.. బోణీ ఛేష్!

క్యూ3లో నికర లాభం రూ.4,466 కోట్లు; 24 శాతం జంప్

- 8 శాతం పెరిగి రూ.23,092 కోట్లకు ఆదాయం
- 2019-20 ఆదాయ వృద్ధి అంచనాలు 10-10.5 శాతానికి పెంపు



శుక్రవారం బెంగళూరులో ఆర్థిక ఫలితాలను ప్రకటించిన సందర్భంగా ఇన్ఫోసిస్ చైర్మన్ నందన్ నీలేకని, సీఈఓ సలీల్ పరేఖ్, సీఎఫ్ఓ నీలాంజన్ రాయ్(కుడి వ్యక్తి), సీఓఓ ప్రవీణ్ రావు(ఎడమ వ్యక్తి)

బెంగళూరు: దేశంలో రెండో అతిపెద్ద ఐటీ సేవల కంపెనీ ఇన్ఫోసిస్... అంచనాలను మించిన బంపర్ ఫలితాలతో బోణీ కొట్టింది. ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో (2019-20, క్యూ3) సంస్థ కన్సాలిడేటెడ్ నికర లాభం రూ.4,466 కోట్లకు చేరింది. 2018-19 సంవత్సరం ఇదే క్వార్టర్‌లో వచ్చిన లాభం రూ. 3,610 కోట్లు. దీంతో పోలిస్తే... 23.7 శాతం ఎగబాకింది. ఇక మొత్తం ఆదాయం ఈ క్యూ3లో 7.9 శాతం వృద్ధితో రూ.23,092 కోట్లకు చేరింది. క్రితం ఏడాది క్యూ3లో ఆదాయం రూ.21,400 కోట్లుగా నమోదైంది. ప్రధానంగా డాలరుతో రూపాయి మారకం విలువ బలహీనపడటం.. అన్ని వ్యాపార విభాగాల్లోనూ స్థిరమైన వృద్ధి సాధించటం కంపెనీ మెరుగైన పనితీరుకు దోహదం చేసింది. మార్కెట్ విశ్లేషకులు క్యూ3లో ఇన్ఫీ రూ. 4,206 కోట్ల నికర లాభాన్ని ఆర్జించవచ్చని అంచనా వేశారు.

సీక్వెన్షియల్‌గానూ దూకుడు..

2019-20 ఏడాది సెప్టెంబర్ క్వార్టర్‌తో (క్యూ2)... అంటే సీక్వెన్షియల్ ప్రాతిపదికన పోల్చి చూసినా ఇన్ఫీ ఫలితాలు మెప్పించాయి. క్యూ2లో నికర లాభం రూ.4,019 కోట్లతో పోలిస్తే క్యూ3లో లాభం 10.7 శాతం ఎగసింది. ఆదాయం రూ.22,629 కోట్ల నుంచి 2 శాతం వృద్ధి చెందింది.

గైడెన్స్ అప్...

సానుకూల వ్యాపార పరిస్థితుల నేపథ్యంలో కంపెనీ ఆదాయ వృద్ధి అంచనాను (గైడెన్స్) పెంచింది. ప్రస్తుత 2019- 20 పూర్తి ఆర్థిక సంవత్సరానికి స్థిర కరెన్సీ ప్రాతిపదికన ఆదాయం 10-10.5 శాతం మేర వృద్ధి చెందవచ్చని ఇన్ఫీ అంచనా వేసింది. రెండో త్రైమాసికం (క్యూ2) ఫలితాల సందర్భంగా ఆదాయ గైడెన్స్ 9-10%గా కంపెనీ లెక్కగట్టింది. ఇక నిర్వహణ మార్జిన్ గైడెన్స్‌ను కూడా 21-23%గా కొనసాగిస్తున్నట్లు పేర్కొంది.

ఫలితాల్లో ఇతర ముఖ్యాంశాలివీ...

- డాలర్లపరంగా చూస్తే క్యూ3లో ఇన్ఫీ నికర లాభం 24.8 శాతం వృద్ధితో 627 మిలియన్ డాలర్లకు ఎగసింది. మొత్తం ఆదాయం 8.6 శాతం పెరిగి 3.24 బిలియన్ డాలర్లకు చేరింది.
- డిజిటల్ వ్యాపార విభాగం ఆదాయాలు గతేడాది క్యూ3తో పోలిస్తే ఈ క్యూ3లో 40.8 శాతం వృద్ధి చెంది 1,318 మిలియన్ డాలర్లకు ఎగబాకాయి. ఇన్ఫీ మొత్తం ఆదాయంలో ఈ విభాగం వాటా 40.6 శాతానికి చేరింది.
- క్యూ3లో నిర్వహణ మార్జిన్ 21.9 శాతంగా నమోదైంది.
- క్యూ3లో కంపెనీ నికరంగా 6,968 మంది ఉద్యోగులను నియమించుకుంది. దీంతో డిసెంబర్ చివరి నాటికి మొత్తం సిబ్బంది సంఖ్య 2,43,454కు చేరింది. క్యూ3లో ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు 19.6 శాతంగా నమోదైంది. క్యూ2లో ఇది 21.7 శాతంగా ఉంది. ఇక మొత్తం ఉద్యోగుల్లో మహిళల సంఖ్య 38.8 శాతానికి చేరింది.
- డిసెంబర్ క్వార్టర్‌లో కొత్తగా 84 మంది క్లయింట్లు జతయ్యారు. దాదాపు 1.8 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులను కంపెనీ దక్కించుకుంది. 'భారీస్థాయి కాంట్రాక్టులను చేజిక్కించుకోవడంలో కంపెనీ తన సత్తాను కొనసాగిస్తోంది. మరోపక్క, ఉద్యోగుల వలసలు కూడా తగ్గుముఖం పడుతుండటం కలిసొస్తోంది' అని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ) ప్రవీణ్ రావు పేర్కొన్నారు.

'అనైతిక' ఆరోపణలకు ఆధారాల్లేవు..

కంపెనీ ఖాతా పుస్తకాల్లో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని, అదేవిధంగా ఉన్నతాధికారులు (ప్రధానంగా సీఈఓ సలీల్ పరేఖ్, సీఎఫ్ఓ నీలాంజన్ రాయ్) అనైతిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ వచ్చిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాలూ లేవని ఇన్ఫోసిస్ స్పష్టం చేసింది. 'అంతర్గత వేగులు (విజిల్ బ్లోయర్స్) చేసిన అన్ని ఆరోపణలపై కంపెనీ నియమించిన ఆడిట్ కమిటీ సీరియస్‌గా, లోతైన స్వతంత్ర విచారణను చేపట్టింది. అయితే, ఈ ఆరోపణలకు ఎటువంటి ఆధారాలూ లభించలేదు' అని కమిటీ చైర్‌పర్సన్ డి. సుందరం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, ఆడిట్ కమిటీ నివేదికపై ఇన్ఫీ చైర్మన్ నందన్ నీలేకని స్పందిస్తూ... 'సలీల్ పరేఖ్, నీలాంజన్ రాయ్ కంపెనీ ప్రయోజనాలను పరిరక్షించడంలో ఎంతో నిబద్ధతతో పనిచేస్తున్నారు. ఇన్ఫోసిస్‌ను కొత్త వ్యూహాలతో విజయపథంవైపు నడిపించడంలో సలీల్ చాలా కీలకమైన పాత్ర పోషిస్తున్నారు' అని పేర్కొన్నారు.

ఇన్ఫీ షేరు ధర శుక్రవారం బీఎస్ఈలో 1.5 శాతం లాభపడి రూ.738 వద్ద ముగిసింది. కంపెనీ ఆర్థిక ఫలితాలు స్టాక్ మార్కెట్లో ట్రేడింగ్ ముగిసిన తర్వాత వెలువడ్డాయి.

'ఇప్పుడున్న డిజిటల్ యుగంలో తమ సత్తా చాటేందుకు క్లయింట్లు పూర్తిస్థాయిలో అస్త్రాలకు పదును పెడుతున్నారు. ఈ మార్పు మా ఆదాయాల్లో రెండంకెల వృద్ధికి ప్రధానంగా దోహదం చేస్తోంది. అంతేకాకుండా నిర్వహణ మార్జిన్లు పుంజుకోవడం కూడా కంపెనీ మెరుగైన పనితీరుకు చోదకంగా పనిచేస్తోంది'.
– సలీల్ పరేఖ్, ఇన్ఫీ సీఈఓ-ఎండీ

'పూర్తి ఏడాదికి ఆదాయ గైడెన్స్‌ను పెంచడం కంపెనీ పటిష్టమైన పనితీరుకు నిదర్శనం. సహజంగా మొత్తం ఐటీ పరిశ్రమకు సీజనల్‌గా బలహీనమైన క్వార్టర్‌లో సైతం ఇన్ఫీ ఈ స్థాయి ఫలితాలను ప్రకటించడం శుభపరిణామం. అంతేకాకుండా ఇకపై రెండంకెల వృద్ధిని లక్ష్యంగా పెట్టుకోవడం మరో ప్రధానాంశంగా చూడొచ్చు'
– మోషే కత్రి, వెడ్‌బుష్ సెక్యూరిటీస్ ఎండీ

దేశవ్యాప్తంగా ఎయిర్‌టెల్ వై-ఫై కాలింగ్ సేవలు

న్యూఢిల్లీ: టెలికం దిగ్గజ కంపెనీ భారతీ ఎయిర్‌టెల్.. దేశవ్యాప్తంగా వై-ఫై కాలింగ్ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు శుక్రవారం ప్రకటించింది. నూతన సేవల ఆధారంగా ఇతర వై-ఫై నెట్‌వర్క్‌లను కూడా వినియోగించుకుని కాల్స్ చేయవచ్చని, దీంతో పాటు ఇళ్లలో లేదా ఆఫీసుల్లో కాల్స్ చేసేటప్పుడు నిరాటంకంగా ఎల్‌టీఈ నుంచి వై-ఫైకి మారవచ్చని వివరించింది. ఇందుకు కస్టమర్ల నుంచి ఎటువంటి అదనపు చార్జీలను వసూలు చేయడం లేదని స్పష్టం చేసింది. పైలట్ ప్రాజెక్ట్ కింద ఇప్పటికే అందుబాటులో ఉన్న సంస్థ సేవలకు విశేష స్పందన లభించిందని, వై-ఫై కస్టమర్ల సంఖ్య 10 లక్షలను అధిగమించిందని ఒక ప్రకటన ద్వారా వెల్లడించింది. ఇటీవలే రిలయన్స్ జియో సైతం ఈ తరహా సేవలను అందుబాటులోకి తెచ్చింది.

150 మిలియన్ డాలర్లు సమీకరించిన జొమాటో

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గుర్గావ్‌కు చెందిన ఫుడ్ డెలివరీ స్టార్టప్ జొమాటో తాజాగా 150 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించింది. చైనాకు చెందిన అలీబాబా గ్రూప్ అనుబంధ సంస్థ యాంట్ ఫైనాన్షియల్ ఈ పెట్టుబడులు పెట్టిందని కంపెనీ తెలిపింది. టెక్నాలజీ, కొత్త ప్రాంతాల్లో విస్తరణతో పాటూ ప్రధాన నగరాల్లో మార్కెట్ వాటాను పెంచేందుకు ఈ నిధులను వినియోగిస్తామని పేర్కొంది.

భారత మార్కెట్లోకి లంబోర్గిని హరికేన్ ఈవీఓ స్పైడర్

బెంగళూరు: ఇటలీకి చెందిన లగ్జరీ స్పోర్ట్స్ కార్ల తయారీ కంపెనీ 'లంబోర్గిని'.. బెంగళూరులోని లావెల్లీ రోడ్డులో 4,370 చదరపు మీటర్ల వైశాల్యంతో నూతన ఎక్స్‌పీరియన్స్ షోరూంను శుక్రవారం ప్రారంభించింది. ఈ సందర్భంగా అధునాతన హరికేన్ ఈవీఓ స్పైడర్ కారును ప్రదర్శించింది. సూపర్ కార్లకు భారత్‌లో డిమాండ్ పెరుగుతున్న దృష్ట్యా కొత్త షోరూంను అందుబాటులో ఉంచామని, ఇక్కడ కస్టమర్లు తమకు కావాల్సిన మోడళ్లను ఎంచుకోవచ్చని కంపెనీ ఇండియా హెడ్ శరద్ అగర్వాల్ అన్నారు.

3,556 కోట్లను సమీకరించిన శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్

ముంబై: డాలర్ మారకంలో బాండ్ల జారీ ద్వారా శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ రూ.3,556 కోట్లను (500 మిలియన్ డాలర్లు) సమీకరించింది. దేశం నుంచి మొదటి అంతర్జాతీయ పబ్లిక్ సోషల్ బాండ్ ఇష్యూను చేపట్టిన కంపెనీ ఇదే.

వాహన రంగానికి ఎదురుదెబ్బ

- గతేడాది ఆటోమొబైల్ పరిశ్రమ అమ్మకాలు 13.77% డౌన్
- ప్యాసింజర్ వాహన విక్రయాల్లో 12.75% తగ్గుదల
- మునుపెన్నడూ లేనంత భారీ క్షీణత

న్యూఢిల్లీ: దేశీయ వాహన రంగ పరిశ్రమ గతేడాదిలో భారీ క్షీణతను నమోదుచేసింది. భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘం(సియామ్) శుక్రవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. 2019లో మొత్తం ఆటో రంగ పరిశ్రమ అమ్మకాలు 2,30,73,438 యూనిట్లు కాగా, అంతక్రితం ఏడాది (2018)లో అమ్ముడైన 2,67,58,787 యూనిట్లతో పోల్చితే ఏకంగా 13.77 శాతం తగ్గుదల చోటుచేసుకుంది. ఈ సంఘం వద్ద 1997 నుంచి ప్రతీ ఏడాదికి సంబంధించిన అమ్మకాల సమాచారం ఉండగా.. మునుపెన్నడూ లేని విధంగా గతేడాది విక్రయాలు భారీ క్షీణతను నమోదుచేశాయి. ఇక ప్యాసింజర్ వాహన విక్రయాలు 29,62,052 యూనిట్లుగా నిలిచాయి. ఈ విభాగంలో 12.75 శాతం తగ్గుదల చోటుచేసుకుంది. 2013 తరువాత అత్యంత కనిష్టస్థాయి ఇది. ద్విచక్ర వాహన విభాగంలో 14.19 శాతం తగ్గుదల (1,85,68,280 యూనిట్ల విక్రయాలు) నమోదు కాగా, వాణిజ్య వాహన విభాగంలో 14.99 శాతం క్షీణత నమోదైంది. గతేడాది అమ్మకాలు ఈ స్థాయిలో పడిపోవడానికి.. భారత్ స్టేజ్-సిక్స్(బీఎస్-6) నిబంధనల అమలు వంటి ప్రభుత్వ నిర్ణయాలు, రుణ లభ్యత గణనీయంగా తగ్గిపోవడం ప్రధాన కారణాలుగా ఉన్నాయని సియామ్ ప్రెసిడెంట్ రాజన్ వడేరా వ్యాఖ్యానించారు. ఇక ఈ ఏడాదిలోనైనా ప్రభుత్వం జీఎస్‌టీ రేటును 18 శాతానికి తగ్గించి, స్క్రాపేజ్ విధానాన్ని అమలుచేస్తే పరిశ్రమ కోలుకుంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

సంక్రాంతి ఆఫర్లకు విశేష స్పందన: 'బిగ్ సి'

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సంక్రాంతి ఆఫర్లకు విశేష స్పందన లభిస్తున్నట్లు మల్టీ బ్రాండ్ మొబైల్స్ రిటైల్ చైన్ 'బిగ్ సి' వెల్లడించింది. ఆఫర్స్‌లో భాగంగా రూ.12 కోట్ల విలువైన బహుమతులతో పాటు రూ.5 కోట్ల విలువైన క్యాష్ పాయింట్లను కూడా అందిస్తున్నట్టు బిగ్ సి ఫౌండర్ ఎం.బాలు చౌదరి తెలిపారు. మైక్రోమ్యాక్స్ ఐ వన్ (2జీబీ) మరియు రూ.13,990 విలువగల హెచ్‌డీ ఎల్ఈడీ టీవీని రూ.8,999కి... రూ.11,990 విలువగల లెనోవో కే9 కొనుగోలుపై రూ.13,990 విలువైన హెచ్‌డీ ఎల్ఈడీ టీవీ... రూ.18,990 ధరగల వివో వై17పై రూ.19,990 విలువగల హెచ్‌డీ ఎల్ఈడీ టీవీ... రూ.13,499కి లభించే వివో వై91 కొనుగోలుపై రూ.13,990 విలువైన హెచ్‌డీ ఎల్ఈడీ టీవీ... ఈ ఆఫర్లో అందిస్తున్నట్లు సంస్థ తెలిపింది. శామ్‌సంగ్ మొబైల్స్‌పై 7.5 శాతం క్యాష్‌బ్యాక్ కూడా ఇస్తున్నట్లు బాలు చౌదరి చెప్పారు.

BIG C

టాటాలకు 'సుప్రీం' ఊరట

ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా మిస్త్రీ పునర్ నియామకపు ఉత్తర్వుపై స్టే

న్యూఢిల్లీ: టాటా గ్రూప్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా సైరస్ మిస్త్రీని పునర్‌నియమించాలన్న ఎన్‌సీఎల్‌ఏటీ(నేషనల్ కంపెనీ లా అపీలేట్ ట్రిబ్యునల్) ఉత్తర్వులపై సుప్రీంకోర్టు శుక్రవారం స్టే ఇచ్చింది. ట్రిబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులను పూర్తి స్థాయిలో విచారించాల్సిన అవసరం ఉందని న్యాయస్థానం అభిప్రాయపడింది. కేసును మరోరోజు పూర్తిస్థాయిలో విచారణకు చేపట్టనున్నట్లు తెలిపింది. ప్రధాన న్యాయమూర్తి ఎస్ఏ బాబ్డే, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ముందు టాటా సన్స్ పిటిషన్ లిస్ట్యింది. 2016లో అర్ధంతరంగా టాటా సన్స్ చైర్మన్ హోదా నుంచి ఉద్వాసనకు గురైన సైరస్ మిస్త్రీని పునర్‌నియమించాలంటూ 2019 డిసెంబర్ 18న ఎన్‌సీఎల్‌ఏటీ ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే.

టీసీఎస్‌కు కూడా...

కాగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) డైరెక్టర్‌గా సైరస్ మిస్త్రీని పునర్‌నియమించాలంటూ ఎన్‌సీఎల్‌ఏటీ ఇచ్చిన ఉత్తర్వులపై కూడా సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. కంపెనీ శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది.

17న కంపెనీ ఫలితాలు..

కాగా, టీసీఎస్ శుక్రవారం ఒక ప్రత్యేక ప్రకటన విడుదల చేస్తూ, జనవరి 17న డిసెంబర్ త్రైమాసిక ఫలితాలను ప్రకటించనున్నట్లు వివరించింది.

చందా కొచర్ ఆస్తులు ఈడీ జప్తు

న్యూఢిల్లీ: అక్రమ ధనార్జన కేసులో ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ సీఈఓ చందా కొచర్, మరికొందరికి చెందిన రూ.78 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేసింది. ఈ మేరకు అక్రమ ధనార్జన నిరోధక చట్టం నిబంధనల కింద ఒక ఉత్తర్వు జారీ అయ్యింది. ముంబైలో కొచర్‌కు ఉన్న ఇల్లు, ఆమెతో సంబంధం ఉన్న ఒక కంపెనీకి చెందిన ఆస్తులు... జప్తు అయిన వాటిలో ఉన్నట్లు శుక్రవారం అత్యున్నత స్థాయి వర్గాలు తెలిపాయి.

యస్‌లో పరిస్థితులు బాలేవు

- స్వతంత్ర డైరెక్టరు ప్రకాశ్ అగర్వాల్ అభ్యంతరాలు
- కార్పొరేట్ గవర్నెన్స్ సరిగా లేదంటూ రాజీనామా
- నిర్వహణలో జోక్యం చేసుకోవాలంటూ సెబీకి లేఖ

న్యూఢిల్లీ: యస్ బ్యాంకులో పద్ధతులు, వ్యవహారాలు దిగజారిపోతున్నాయంటూ స్వతంత్ర డైరెక్టర్ ఉత్తమ్ ప్రకాష్ అగర్వాల్ బాంబు పేల్చారు. ఈ విషయమై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ తన పదవికి శుక్రవారం రాజీనామా సమర్పించారు. ''యస్ బ్యాంకు ఇండిపెండెంట్ డైరెక్టర్, ఆడిట్ కమిటీ చైర్మన్ పదవులతో పాటు, బోర్డుకు సంబంధించిన అన్ని కమిటీల్లో సభ్యత్వానికి తక్షణమే రాజీనామా చేస్తున్నా'' అంటూ బ్యాంకు తాత్కాలిక చైర్మన్ బ్రహ్మదత్‌ను ఉద్దేశించి రాసిన లేఖలో అగర్వాల్ పేర్కొన్నారు. కార్పొరేట్ పాలనా ప్రమాణాలు క్షీణిస్తున్నాయని, నిబంధనల అమలులో వైఫల్యం, యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలు.. ముఖ్యంగా బ్యాంకు ఎండీ, సీఈవో రవనీత్ గిల్, సీనియర్ గ్రూపు ప్రెసిడెంట్ రాజీవ్ ఉబోయ్, లీగల్ హెడ్ సంజయ్ నంబియార్ బ్యాంకును నిర్వహిస్తున్న తీరు పట్ల ఆయన తన లేఖలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ''యస్ బ్యాంకు, లక్షలాది డిపాజిటర్లు, వాటాదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఈ కీలక అంశాల పట్ల ఎప్పటికప్పుడు ఆందోళనలు వ్యక్తం చేశాను. నా విధుల నిర్వహణలో వీటి పరిష్కారానికి శాయశక్తులా ప్రయత్నించా. నా రాజీనామాతో సంబంధం లేకుండా, బ్యాంకు కుదుటపడి, భాగస్వాములు, వాటాదారుల ప్రయోజనాలను మీ నాయకత్వంలో కాపాడుతుందని ఆశిస్తున్నాను'' అని అగర్వాల్ పేర్కొన్నారు.

తక్షణం జోక్యం చేసుకోవాలి.

ఇవే అంశాలపై సెబీ చైర్మన్ అజయ్ త్యాగికి ఈ నెల 9న అగర్వాల్ ఓ లేఖ రాశారు. తక్షణమే సెబీ జోక్యం చేసుకోవాలని కోరారు. బ్యాంకు సీఈవో, ఎండీ రవనీత్ గిల్ గతేడాది అక్టోబర్ 31న బ్యాంకు 1.2 బిలియన్ పెట్టుబడుల ఆఫర్‌ను అందుకుందని మౌఖింగా చెప్పినట్టు లేఖలో పేర్కొన్నారు.

అగర్వాల్ అర్హతపై సమీక్ష..

స్వతంత్ర డైరెక్టర్ ఉత్తమ్ ప్రకాష్ అగర్వాల్ రాజీనామా పై యస్ బ్యాంకు స్పందించింది. రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) ఆదేశాల మేరకు అగర్వాల్ 'ఫిట్ అండ్ ప్రాపర్' అర్హత ప్రమాణాలకు తగిన వారా, కాదా? అన్న దానిపై బోర్డు చర్చించడానికి ముందుగా ఆయన రాజీనామా సమర్పించినట్టు యస్ బ్యాంకు పేర్కొంది. బ్యాంకు నిర్వహణపై అగర్వాల్ లేవనెత్తిన అభ్యంతరాలను బ్యాంకు బోర్డు తప్పకుండా పరిశీలిస్తుందని స్పష్టం చేసింది. అగర్వాల్ గతంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్ ఆఫ్ ఇండియా చీఫ్‌గా, సత్యం కంప్యూటర్స్ అకౌంటింగ్ స్కామ్‌లో ఆడిటర్ల పాత్రను నిగ్గుతేల్చే కమిటీలో పనిచేశారు.

రూ.10వేల కోట్ల సమీకరణకు యస్‌బ్యాంకు నిర్ణయం

ముంబై: యస్ బ్యాంకు రూ.10,000 కోట్లను సమీకరించాలని శుక్రవారం నాటి బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకుంది. అర్హులైన సంస్థాగత మదుపరులకు (క్యూఐపీ) లేదా ఏడీఆర్, జీడీఆర్, ఎఫ్‌సీసీబీ తదితర మార్గాల్లో ఈ నిధులను సమీకరించనున్నట్టు ప్రకటించింది. దీనిపై వాటాదారుల అనుమతి కోరనున్నట్టు బ్యాంకు ప్రకటించింది. కెనడాకు చెందిన ఎర్విన్‌సింగ్ బ్రెయిచ్ 1.2 బిలియన్ డాలర్ల పెట్టుబడుల ఆఫర్‌ను తిరస్కరించింది. ఎర్విన్‌సింగ్ బ్రెయిచ్ నుంచి నవీకరించబడిన ప్రతిపాదన వచ్చిందని, అయితే, ఆ ఆఫర్ విషయంలో ముందుకు వెళ్లరాదని నిర్ణయించినట్టు యస్ బ్యాంకు తెలిపింది. అలాగే, సిటాక్స్ హోల్డింగ్స్, సిటాక్స్ ఇన్వెస్ట్‌మెంట్ గ్రూపు నుంచి వచ్చిన 500 మిలియన్ డాలర్ల పెట్టుబడుల ప్రతిపాదన పట్ల సానుకూలంగా ఉన్నామని స్పష్టం చేస్తూ.. తదుపరి బోర్డు సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకుంటామని తెలిపింది.

పరిశ్రమలు మళ్లీ 'ప్లస్'లోకి..

- నవంబర్‌లో ఐఐపీ 1.8 శాతం వృద్ధి
- మూడు నెలల తర్వాత క్షీణత నుంచి వృద్ధి బాటలోకి...
- 'తయారీ' రంగం రికవరీ

న్యూఢిల్లీ: భారత్ పారిశ్రామిక రంగం నవంబర్‌లో వెలుగురేఖలు చూసింది. పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) 1.8 శాతం వృద్ధిరేటును నమోదుచేసుకుంది. భారత్ పారిశ్రామిక రంగం మూడు నెలల తర్వాత వృద్ధిబాటలోకి రావడం గమనార్హం. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌లలో భారత్ పారిశ్రామిక రంగంలో అసలు వృద్ధినమోదుకాకపోగా, క్షీణ రేటు నెలకొంది. మొత్తం సూచీలో మెజారిటీ వాటా ఉన్న తయారీ రంగం కూడా క్షీణతలో నుంచి బయటపడ్డం మొత్తం గణాంకాలకు కొంత సానుకూలమైంది. శుక్రవారం జాతీయ గణాంకాల కార్యాలయం విడుదల చేసిన గణాంకాల్లో కొన్ని ముఖ్యాంశాలు చూస్తే...

- 2018 నవంబర్‌లో పారిశ్రామిక రంగం ఉత్పత్తి వృద్ధి రేటు కేవలం 0.2 శాతం.
- సూచీలో దాదాపు 77 శాతం వెయిటేజ్ ఉన్న తయారీ రంగం 2.7 శాతం వృద్ధి రేటును నమోదుచేసుకుంది. 2018 ఇదే నెలలో ఈ విభాగం అసలు వృద్ధిలేకపోగా -0.7 శాతం పడింది. నవంబర్ తయారీ రంగంలోని మొత్తం 23 పారిశ్రామిక గ్రూపుల్లో 13 సానుకూల ఫలితాలనే ఇచ్చాయి.
- విద్యుత్ రంగం విషయానికి వస్తే పరిస్థితి నిరాశాజనకంగా ఉంది. 2018 నవంబర్‌లో కనీసం 5.1 శాతం వృద్ధి నమోదయితే, 2019 ఇదే నెలలో అసలు వృద్ధిలేకపోగా -5 శాతం క్షీణత నమోదయ్యింది.
- మైనింగ్ విషయంలో క్షీణ రేటు 1.7 శాతంగా ఉంది. అయితే ఈ రేటు 2018 నవంబర్‌లో పోల్చితే (-2.7 శాతం) తగ్గడం గమనార్హం.
- భారీ యంత్రపరికరాలు, పెట్టుబడులను సూచించే క్యాపిటల్ గూడ్స్ విభాగంలో -8.6 శాతం క్షీణత నమోదుకావడం గమనార్హం. పైగా 2018 నవంబర్ క్షీణత స్థాయి (-4.1 శాతం) పెరగడం ఆందోళన కలిగించే అంశం.
- ఎఫ్ఎంసీజీ (కన్జూమర్ నాన్-డ్యూరబుల్ సెగ్మెంట్) వస్తువుల విభాగంలో 2 శాతం స్వల్ప వృద్ధి (2018 నవంబర్‌లో -0.3 శాతం) నమోదయ్యింది. అయితే రిఫ్రిజిరేటర్లు, ఏసీల వంటి కన్జూమర్ డ్యూరబుల్స్ విభాగంలో మాత్రం వృద్ధి నమోదుకాలేదు.

ఏప్రిల్ నుంచి నవంబర్ వరకూ

ఇక ఆర్థిక సంవత్సరం ప్రారంభం ఏప్రిల్ నుంచి నవంబర్ వరకూ చూస్తే, వృద్ధి రేటు కేవలం 0.6 శాతంగా నమోదయ్యింది. 2018 ఇదే కాలంలో ఈ రేటు 5 శాతంగా ఉంది.

విధాన నిర్ణేతలకు ఊరట

పారిశ్రామిక రంగం తాజా గణాంకాలు ఇటు మార్కెట్‌కు, అటు విధాన నిర్ణేతలకు కొంచెం ఊరటనిస్తాయి. క్యాపిటల్ గూడ్స్ విభాగంలో క్షీణత తగ్గుముఖం పడుతుండడం ఆశాజనకమైన అంశం. –రుమ్‌కీ మజుందర్, ఆర్థికవేత్త, డెలాయిట్ ఇండియా

బేస్ ఎఫెక్ట్ మాత్రమే..

ఇప్పుడు కనిపించిన పారిశ్రామిక వృద్ధి రేటు కేవలం బేస్ ఎఫెక్ట్ మాత్రమే. 2018 ఇదే నెలల్లో అతి తక్కువ రేటు ప్రతిబింబమిది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి వరకూ (మార్చి) ఈ ఫలితాలు ఇలానే ఉండే వీలుంది. –కరణ్, మహర్షి, యాక్యురేట్ రేటింగ్స్ అండ్ రిసెర్చ్



వృక్షంలో.. హృదయం!

ప్రకృతి ఒడిలో పచ్చని ఆకులతో కలగలిపి హృదయం ఆకారంలో ఓ వృక్షం చూపరులను అమితంగా ఆకర్షిస్తోంది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కోమటిపల్లి శివారులో వ్యవసాయ భూమిలో పెరిగిన మర్రిచెట్టు కొమ్మలను రైతు తొలగించాడు. తర్వాత కాండం, పెరిగిన కొమ్మలు, ఆకులన్నీ కలగలిపి హృదయం ఆకారంలో విస్తరించాయి. అటుగా వెళ్లే వారంతా కాసేపు ఆగి ఆ చెట్టును చూస్తున్నారు. - కేసముద్రం

వటపత్రశాయిగా నారసింహుడు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి బాలాలయంలో అధ్యయనోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం పంచనారసింహుడిని వటపత్రశాయిగా అలంకారం చేసి అర్చకులు పూజలు నిర్వహించారు. సాయంత్రం పరమపదనాథుడి (వైకుంఠ నాథుడిగా)గా అలంకరించి బాలాలయంలో ఊరేగించారు. అదే విధంగా ఆండాల్ అమ్మవారికి నీరాటోత్సవాన్ని చేపట్టారు. ఈ వేడుకల్లో స్థానాచార్యులు రాఘవాచార్యులు, ఆలయ ప్రధానార్చకులు నల్లందీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, ఆలయాధికారులు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలో వనదేవతల గద్దెలు

ఏటూరునాగారం: ములుగు జిల్లాలోని మేడారం శ్రీసమ్మక్క-సారలమ్మ చరిత్రపై ఆల్బం రూపొందించడానికి ఓ ప్రైవేట్ సంస్థకు సంబంధించిన వ్యక్తి ఇటీవల ఇక్కడికి వచ్చాడు. అతను డ్రోన్ కెమెరాలో వనదేవతల గద్దెల ప్రాంతాన్ని చిత్రీకరించిన దృశ్యం ఇది. ప్రస్తుతం నిర్మానుష్యంగా ఉన్న ఈ ప్రాంతం ఫిబ్రవరి 5న భక్తులతో కిటకిటలాడుతూ ఉంటుంది.

యాదాద్రిలో నంది విగ్రహాల అమరిక

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా నూతనంగా నిర్మాణం అవుతున్న శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రధాన మండపంపై శిల్పులు శుక్రవారం నంది విగ్రహాలను ఏర్పాటు చేశారు. వీటిని అమర్చడం ద్వారా ఆలయం మరింత సుందరంగా కనిపిస్తుందని శిల్పులు పేర్కొన్నారు. అలాగే శివాలయం ముందు భాగంలో ధ్వజస్తంభం, బలిపీఠం ఏర్పాటుకు పనులు జరుగుతున్నాయి. విష్ణు పుష్కరిణి పనులను కూడా అధికారులు వేగవంతం చేశారు. ఇందులో భాగంగా పుష్కరిణిలోని మండపంపై పిల్లర్లు ఏర్పాటు చేశారు. కృష్ణ శిలతో ఏర్పాటు చేస్తున్న ఈ మండపం పనులు త్వరలోనే పూర్తి కానున్నట్లు వైటీడీఏ అధికారులు తెలిపారు.

విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న హెచ్ఎం రమేశ్

విద్యార్థుల్లో విద్యార్థిగా..

స్కూల్ యూనిఫాంలో హాజరైన ప్రధానోపాధ్యాయుడు

కేసముద్రం: విద్యార్థులు వేసుకునే స్కూల్ యూనిఫాంనే తానూ కుట్టించి ధరించాడు మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నర్సింహులగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొడిపాక రమేశ్. శుక్రవారం ఆయన యూనిఫాంతో విధులకు హాజరు కావడంతో విద్యార్థులంతా ఆశ్చర్యంగా చూశారు. అనంతరం హెచ్ఎం పిల్లలతో కలసి మధ్యాహ్న భోజనం కూడా చేశారు. బుధ, శనివారం మినహా మిగతా అన్ని రోజులు స్కూల్ యూనిఫాం వేసుకునే వస్తానని హెచ్ఎం చెప్పారు. ఎలాంటి అసమానతలు లేకుండా విద్యార్థుల్లో కలసిపోయి వారికి విద్యాబుద్ధులు నేర్పడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు రమేశ్ చెప్పారు.

అధ్యక్ష తరహా ఎన్నికపై చర్చ జరగాలి

ఒకే దేశం.. ఒకేసారి ఎన్నికలు

- నియోజకవర్గాల సంఖ్య పెంచాలి
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్
- ముగింపు సందర్భంగా నాలుగు అంశాలతో 'హైదరాబాద్ డిక్లరేషన్'

రాయదుర్గం: స్థానిక ప్రజాప్రతినిధులు, రాష్ట్రంలో ముఖ్యమంత్రిని, అధ్యక్ష తరహాలో ప్రధానమంత్రిని ప్రత్యక్షంగా ఎన్నుకోవాలనే ప్రతిపాదనలకు సూత్రప్రాయంగా తాము సానుకూలమేనని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ పేర్కొన్నారు. దామాషా పద్ధతిన ఎన్నికల నిర్వహణపై కూడా చర్చ జరగాలన్నారు. గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)లో ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్, ఐఎస్‌బీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్- మనీ పవర్ ఇన్ పాలిటిక్స్'ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒకే దేశం, ఒకేసారి ఎన్నికల నిర్వహణపై కూడా అన్ని రాజకీయ పార్టీలు చర్చించి ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఇతర దేశాల్లోని అధ్యక్షతరహా, దామాషా ఎన్నికల వంటి మార్పుల కోసం ప్రయత్నిస్తూనే, ఇప్పటికే ఉన్న వ్యవస్థను సరిదిద్దే పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గాల పునర్విభజన చేయాల్సిన అవసరం ఉందని, పార్లమెంటులో 1,000 స్థానాలు ఉండాలని మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ అభిప్రాయపడ్డారని గుర్తు చేశారు.

చట్టవిరుద్ధం కాకూడదు

రాజకీయాల్లో డబ్బు అవసరమేరనని, అయితే అది చట్టవిరుద్ధం కాకూడదని కేంద్ర ఎన్నికల కమిషనర్ అశోక్ లావాసా పేర్కొన్నారు. సెలబ్రిటీల ప్రచారం, పార్టీలకు సొంత మీడియా దగ్గర్నుంచి అనేక కోణాల్లో ఎన్నికల్లో వ్యయంపై చర్చ జరగాలన్నారు. ఎన్నికల సంస్కరణల గురించి సీఎంలు ఎన్నడూ మాట్లాడినట్లు తాను చూడలేదన్నారు. ఒక పరిధి దాటి ఎన్నికల్లో డబ్బు వ్యయాన్ని కట్టడి చేసే శక్తి ఈసీకి లేదన్నారు

జమిలి ఎన్నికలతో మార్పు రాదు

స్థానిక స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు జమిలి ఎన్నికలు నిర్వహించటం వల్ల పెద్ద మార్పురాదని ఎఫ్‌డీఆర్ ప్రధాన కార్యదర్శి జయప్రకాశ్‌నారాయణ్ అన్నారు. ముఖ్యమంత్రులు, ప్రధానిని ప్రత్యక్షంగా ఎన్నుకునే విధంగా ఎన్నికల వ్యవస్థను సవరించాలన్నారు. కాలిఫోర్నియా యూనివర్శిటీ ప్రొఫెసర్ ప్రదీప్‌చిబ్బర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఐఎస్‌బీ అసోసియేట్ ప్రొఫెసర్ అశ్వినిచాత్ర, హెచ్‌సీయూ ప్రొఫెసర్ కె.సి.సూరి, అంతకుముందు సమావేశంలో శివసేన ప్రతినిధి ప్రియాంకా చతుర్వేది,స్వరాజ్య ఎడిటోరియల్ డైరెక్టర్ ఆర్ జగన్నాథన్ ప్రసంగించారు.

శుక్రవారం ఐఎస్‌బీలో జరిగిన ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్

నాలుగు అంశాలతో 'డిక్లరేషన్'

'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్- మనీ పవర్ ఇన్ పాలిటిక్స్'పేరిట రెండ్రోజులపాటు నిర్వహించిన సదస్సు ముగింపు వేడుకల్లో జయప్రకాశ్ నారాయణ నాలుగు అంశాలతో కూడిన హైదరాబాద్ డిక్లరేషన్‌ను ప్రకటించారు. అందులో...

- రాజకీయాల్లో డబ్బు వల్ల కలిగే పరిణామాలపై పౌరుల్లో అవగాహన పెంచాలి. పౌరులు, పౌరసమాజ సంఘాలు, ఎన్నికల సంఘం సమష్టిగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది.
- పార్టీల ప్రజాస్వామ్య పనితీరును నిర్ధారించడానికి, రాజకీయ రంగంలోకి డబ్బు ప్రవాహాన్ని నియంత్రించడానికి బలమైన చట్టపరమైన వ్యవస్థ అవసరం. పార్టీలు తమ వార్షిక ఆదాయ,వ్యయాలను సకాలంలో ప్రకటించాలి. ఎన్నికల్లో పోటీ చేయడానికి కనీస ఆర్థిక సహాయం ఉండాలి.
- చట్టవిరుద్ధమైన డబ్బు శక్తి, బహుమతులు ఇవ్వడాన్ని తగ్గించడానికి ఉత్తమ మార్గాలు అవసరం.
- దేశంలో పెద్ద మొత్తంలో నగదు, బహుమతులు, మద్యం పంపిణీ, ప్రచార వ్యయానికి మించి జరుగుతోంది. దీన్ని తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉంది.

లక్ష్మణ్‌కే మళ్లీ బీజేపీ పగ్గాలు!

దాదాపు నిర్ణయానికి వచ్చిన అధిష్టానం

సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కె.లక్ష్మణ్ మళ్లీ కొనసాగుతారా? ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఆయనను మార్చి కొత్త నేతను నియమించడం ద్వారా అదనపు ప్రయోజనమేమీ ఉండబోదని, బీసీ వర్గానికి చెందిన ఆయనకే మళ్లీ బాధ్యతలు అప్పగించడం మంచిదనే అభిప్రాయానికి పార్టీ అధిష్టానం వచ్చిందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. మరోసారి ఆయనకే అవకాశం ఇవ్వాలని, మున్సిపల్ ఎన్నికల తర్వాత అధికారికంగా ప్రకటించాలని ఢిల్లీ పెద్దలు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

రేసులో ఉన్నా.. ఆయన వైపే మొగ్గు

పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం పలువురు సీనియర్ నేతలు ప్రయత్నిస్తున్నారు. ఈ జాబితాలో లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వచ్చిన డీకే అరుణ, ఎంపీ బండి సంజయ్, సీనియర్ నేతలు చింతల రాంచంద్రారెడ్డి, రాంచందర్ రావు, యెండెల లక్ష్మీనారాయణ తదితరుల పేర్లను కూడా అధిష్టానం పరిశీలిస్తోందని వార్తలు వచ్చాయి. మరోవైపు తనకు ఏ బాధ్యతను అప్పగిస్తే ఆ పని చేస్తానని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు అంటున్నారు. ఈ నేపథ్యంలో లక్ష్మణ్‌ను మారిస్తే డీకే అరుణ లేదా మురళీధర్‌రావును నియమిస్తారని ప్రచారం జరిగింది. అయితే సామాజిక, ప్రాంతీయ సమీకరణలు, రాజకీయ నేపథ్యం, పార్టీలో కొత్త, పాత నేతల మధ్య సమన్వయం, రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల్లో లక్ష్మణ్ వ్యవహరించిన తీరు తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని మళ్లీ ఆయననే కొనసాగించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో నాలుగు ఎంపీ స్థానాలను గెలిపించుకోవడంతో పాటు ఇంటర్మీడియట్ విద్యార్థుల ఆత్మహత్యలు, ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో అటు విద్యార్థుల తల్లిదండ్రులకు, ఇటు ఆర్టీసీ కార్మికులకు తోడు ఉండి పోరాటం చేయడం, ఆయన హయాంలోనే అనేక మంది నేతలు పార్టీలో చేరడం, జాతీయ నాయకత్వంతో సత్సంబంధాలు కలిగి ఉండటం లాంటి అంశాలు ఆయనకు కలిసొచ్చే అంశాలుగా ఉన్నాయి. మరో నేత డీకే అరుణ పేరును కూడా ఢిల్లీ పెద్దలు సీరియస్‌గానే పరిగణించారు. కేసీఆర్‌ను గట్టిగా ఎదుర్కోగలరని, మహిళా నేతగా బలమైన సామాజిక వర్గానికి చెంది ఉండటం, ఆర్థికంగా బలంగా ఉండటం, సొంతంగా కేడర్‌ను అభివృద్ధి చేసుకునే రాజకీయ చతురత తదితరల అంశాలను కూడా పార్టీ పరిశీలించింది. కానీ కాంగ్రెస్ నుంచి వచ్చి కొంత కాలమే కావడం ఆమెకు మైనస్‌గా మారిందనే చర్చ జరుగుతోంది. ఆమెను అధ్యక్షురాలిని చేస్తే ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి పగ్గాలిచ్చారనే విమర్శ వస్తుందని యోచిస్తున్నట్లు తెలిసింది. మురళీధర్‌రావు జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు ఉన్న ఆయనను ఓ రాష్ట్రానికి పరిమితం చేయడం సరైంది కాదని పార్టీ ఆలోచిస్తున్నట్లు తెలిసింది.

స్తంభానికి కట్టి మహిళపై చెప్పులతో దాడి

కోహెడరూరల్: ఓ మహిళను విద్యుత్ స్తంభానికి తాళ్లతో కట్టేసి చెప్పులతో దాడి చేసిన ఘటన సిద్దిపేట జిల్లాలో వెలుగు చూసింది. కోహెడ మండలం పోరెడ్డిపల్లి తండాకు చెందిన జ్యోతి, లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన హంస, స్వరూపల వ్యవసాయ భూములు పోరెడ్డిపల్లి గ్రామ పరిధిలో ఉంటాయి. ఈ క్రమంలో వారు తరచూ గొడవలకు పాల్పడేవారు. ఆ కోపాన్ని మనసులో పెట్టుకున్న హంస, స్వరూప.. గురువారం సాయంత్రం గ్రామానికి చెందిన కృష్ణ సాయంతో ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న జ్యోతిని ట్రాక్టర్‌లో ఎక్కించుకొని లక్ష్మీపూర్‌కు తీసుకువెళ్లి స్తంభానికి కట్టి చెప్పులతో దాడిచేశారు. ఇది గమనించిన స్థానికులు 100కు కాల్ చేశారు.

నిందితులు హంస, కృష్ణ, స్వరూప, శంకర్, రమలపై కేసు నమోదు చేశారు.

మెడికల్ ఫీ'జులుం'

నాలుగున్నరేళ్ల కోర్సు.. ఐదేళ్లకు ఫీజా?

- అదనంగా ఆర్నెల్ల కాలానికి ఫీజు ఎలా వసూలు చేస్తారు?
- తెలంగాణలో మెడికల్ ఫీజుల వసూళ్లను తప్పుపట్టిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: మెడికల్ ఫీజులు వసూలు చేసే విధాన్ని తప్పుపడుతూ హైకోర్టు తీర్పు చెప్పింది. ఇష్టానుసారంగా ఫీజు వసూళ్లు చేయడానికి వీల్లేదని, మెడికల్ కోర్సుల కాలానికి తగ్గట్టుగానే ఫీజులు ఉండాలని తేల్చి చెప్పింది. ఫీజుల విషయంలో తెలంగాణ ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీ (టీఏఎఫ్ఆర్‌సీ) కాలేజీ యాజమాన్యాలకు అనుకూలంగా అఫిడవిట్లను దాఖలు చేయడాన్ని హైకోర్టు ఆక్షేపించింది. మెడికల్ (ఎంబీబీఎస్) కోర్సు నాలుగున్నరేళ్లయితే ఐదేళ్లకు ఫీజులు ఎలా వసూలు చేస్తారని ప్రశ్నించింది. 2019-20 విద్యా ఏడాదిలో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్టులకు ఏ,బీ,సీ కేటగిరీలకు సింగిల్‌విండో విధానంలో దరఖాస్తుల స్వీకరణ, ఫీజుల వసూళ్లు, నాలుగున్నరేళ్ల కోర్సుకు ఐదేళ్లు ఫీజు వసూలుకు వీలుగా ప్రభుత్వం జీవో నం.120, ఏపీ ప్రభుత్వం జీవో నం.30లను జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ వరంగల్‌కు చెందిన మైనర్ డి.పద్మతేజ 2018లో హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తులు జస్టిస్ రామచంద్రరావు, జస్టిస్ కె.లక్ష్మణ్‌ల ధర్మాసనం ఇటీవల తీర్పు చెప్పింది. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చట్టంలోని 7(1) నిబంధనల్లో మెడికల్ కోర్సుల కాలపరిమితి నాలుగున్నరేళ్లని ఉన్నా టీఏఎఫ్ఆర్‌సీ పట్టించుకోకుండా ఐదేళ్లకు ఫీజుల వసూళ్లకు అనుమతించడం చెల్లదని పేర్కొంది. కాగా, తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన జీవో వరకే తీర్పు వెలువరిస్తున్నామని, ఏపీ ప్రభుత్వ జీవో చట్టబద్ధత జోలికి వెళ్లడం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. మెడికల్ విద్యార్థి కాని పిటిషనర్ పద్మతేజకు రిట్ దాఖలు చేసే అర్హత లేదని టీఏఎఫ్ఆర్‌సీ చేసిన వాదనలో పస లేదని పేర్కొంది. విద్యార్థులకు నష్టం చేకూర్చే విషయాన్ని టీఏఎఫ్ఆర్‌సీ పట్టించుకోలేదని తప్పుపట్టింది. ఫీజుల నిర్ణయం చేసేప్పుడు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సంఘాలను ప్రభుత్వం/టీఏఎఫ్ఆర్‌సీలు పట్టించుకోలేదని ఆక్షేపించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలు చేసిన విధంగానే ఐదేళ్లకు ఫీజులు వసూలు చేస్తున్నామని తెలంగాణ ప్రభుత్వ వాదన చట్ట వ్యతిరేకమని వెల్లడించింది. మెడికల్ కోర్సు నాలుగున్నరేళ్లకే ఫీజు వసూలు చేయాలని ఆదేశించింది. నాలుగున్నరేళ్లకే ఫీజు వసూలు చేయాలని 2017లో ఇచ్చిన జీవో నం.120 ప్రకారమే ఫీజుల వసూళ్లు ఉండాలని, అయితే రాష్ట్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ మెడికల్ అండ్ డెంటల్ కాలేజీ యాజమాన్యాల సంఘంలోని కాలేజీలు ఐదేళ్లే ఫీజులు వసూలు చేస్తే ఏపీ విద్యా సంస్థల చట్టం కింద చర్యలు తీసుకోవచ్చునని స్పష్టం చేసింది.

249 మంది మెడికల్ విద్యార్థులపై వేటు

హాజరు శాతం లేకపోవడంతో పరీక్ష రాసేందుకు అనర్హత ★ కేఎంసీ ఎదుట విద్యార్థి సంఘాల ఆందోళన

ఎంజీఎం: వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాల (కేఎంసీ) ఒక్కసారిగా వార్తల్లోకి ఎక్కింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న 249 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు క్రమశిక్షణ చర్యలకు గురయ్యారు. పరీక్షలు రాసేందుకు శుక్రవారం వారిపై అనర్హత వేటు వేశారు. దీంతో కేఎంసీలో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. తృతీయ సంవత్సరానికి చెందిన 176 మంది ఎస్పీఎం (సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్) సబ్జెక్టులో, ద్వితీయ సంవత్సరానికి చెందిన 15 మంది ఫార్మకాలజీలో, 18 మంది పథాలజీ, 40 మంది మైక్రో బయాలజీ తరగతులకు సక్రమంగా హాజరుకాలేదు. వారి హాజరు 75 శాతం కంటే తక్కువగా ఉండటంతో పరీక్ష రాసేందుకు అనర్హులుగా ప్రకటించారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నేతలు కళాశాల ఎదుట ఆందోళన చేసేందుకు సిద్ధమయ్యారు మట్టెవాడ ఏసీపీ సారంగపాణి, సీఐ గణేష్ విద్యార్థులతో చర్చించి.. సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాలన్నారు.

విద్యార్థి సంఘాల ఆందోళన

మెడిసిన్ విద్యార్థుల హాజరు తక్కువగా ఉందని పరీక్ష రాసేందుకు అనర్హత వేటు వేయడం సరైంది కాదని ఏఐఎస్‌బీ జిల్లా కార్యదర్శి హాకీం నబీద్, ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి నాగార్జున ఆధ్వర్యంలో కళాశాల ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఆయా విభాగాధిపతులు తీసుకున్న నిర్ణయంతో మెడిసిన్ విద్యార్థులు మనస్తాపానికి గురయ్యారని, ప్రిన్సిపాల్ పునరాలోచించి తగు నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పరిశీలిస్తాం

ఆయా విభాగాల్లో విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండటం వల్లే పరీక్ష రాసేందుకు అనర్హులుగా ప్రకటించాం. ఈనెల 15 వరకు పరీక్ష ఫీజు చెల్లించేందుకు గడువు ఉంది. హాజరు శాతంపై ఆయా విభాగాధిపతులతో చర్చించాం. విద్యార్థుల విన్నపాన్ని పరిశీలిస్తాం. సమస్యను డీఎంఈ దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులు ఫీజు చెల్లించి పరీక్షకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ సంధ్య, ప్రిన్సిపాల్, కేఎంసీ

విద్యాభివృద్ధికి 'అక్షరభూమి'

ప్రారంభించిన జస్టిస్ చంద్రయ్య

జన్నారం: ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల సమస్యలు పరిష్కరించేందుకుగాను ప్రభుత్వానికి తోడుగా సహాయం చేయడానికి అక్షరభూమి ఫౌండేషన్‌ను ప్రారంభిస్తున్నట్లు మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ గుండ చంద్రయ్య తెలిపారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తిమ్మాపూర్‌లో అక్షర భూమి ఫౌండేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫౌండేషన్‌లో కలెక్టర్లు, ఎస్పీలు, డీఈవోలు, ఎంఈవోలు, పాఠశాల హెచ్ఎంలను సభ్యులుగా భాగస్వామ్యం చేస్తున్నట్లు తెలిపారు. తాను చదువుకున్న ప్రభుత్వ పాఠశాల అయిన తిమ్మాపూర్‌లో మొదటిసారిగా ఫౌండేషన్‌ను ప్రారంభిస్తున్నామని, ఈ సందర్భంగా రూ.లక్ష విరాళం ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఈవో వెంకటేశ్వర్లుకు చెక్కు అందించారు. ఈ ట్రస్టును రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని పేర్కొన్నారు. ఉన్నత స్థానంలో ఉన్న ప్రతి అధికారి ఇలా అక్షర భూమి ఫౌండేషన్ ఏర్పాటు చేయాలన్నారు.

ఐఐటీహెచ్‌లో 'ఈ-సమ్మిట్ 2 కే 20'

సాక్షి,సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా కంది సమీపంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ (ఐఐటీహెచ్) క్యాంపస్‌లో ఈనెల 18,19 తేదీలలో 'ఈ-సమ్మిట్ 2 కే 20'సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఐఐటీహెచ్ శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. విద్యార్థులకు ప్రోత్సాహం, అవగాహన కల్పించడం కోసం ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో 90కి పైగా స్టార్టప్‌లు పాల్గొనే అవకాశం ఉంది. పెట్టుబడిదారుల ధృక్పథం, సెకండరీ సెక్టార్ ఆవశ్యకత, ఉద్యోగాలపై ఆటోమేషన్ ప్రభావం, ఆర్‌అండ్‌డీలో పెట్టుబడులు, భారతదేశం విదేశీ మార్కెట్లోకి ప్రవేశించే ఆవశ్యకత, తదితర అంశాలపై సదస్సులో చర్చ జరుగుతుందని ప్రకటన తెలిపింది.

ప్రజాస్వామ్యం అంటే ఏంటి?

హరీశ్‌రావు ప్రశ్నల వర్షం

- సమాధానాలు చెప్పని విద్యార్థులు

న్యాల్‌కల్: మంత్రి హరీశ్‌రావు మరోసారి ఉపాధ్యాయుడి అవతారమెత్తారు. విద్యార్థులను పిలిచి పలు ప్రశ్నలు అడిగారు. అయితే వారు సరైన సమాధానాలు చెప్పకపోవడంపై కొంత అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండల పరిధిలోని హద్నూర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల అదనపు తరగతి గదులు, డప్నూర్‌లో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్ర భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పిలిచి పదవ తరగతిలో ఎన్ని మార్కులు వచ్చాయి? ఇంటర్‌లో ఎన్ని మార్కులు తెచ్చుకోవాలనుకుంటున్నారు? ప్రజాస్వామ్యం అంటే ఏంటి? తెలంగాణ రాష్ట్రం ఎప్పుడు ఏర్పడింది? రాష్ట్ర అసెంబ్లీలో ఎంత మంది ఎమ్మెల్యేలు ఉంటారు? అని ప్రశ్నించారు. అయితే వారి నుంచి సరైన సమాధానాలు రాకపోవడంతో మంత్రే అన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. కాగా, విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను ప్రవేశ పెట్టిందని, అవి విద్యార్థులకు పూర్తి స్థాయిలో అందేలా కృషి చేయాలని మంత్రి హరీశ్‌రావు అధ్యాపకులకు సూచించారు. కోటి రూపాయలకు పైగా నిధులు వెచ్చించి ప్రభుత్వం కళాశాల భవనాన్ని నిర్మించిందని చెప్పారు.

విద్యార్థిని ప్రశ్నిస్తున్న మంత్రి హరీశ్‌రావు

ఎంత ఖర్చయినా చదివిస్తా

ఓ విద్యార్థిని చదువుకోసం ఎంత ఖర్చయినా తానే భరిస్తానని మంత్రి హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. హద్నూరులో కళాశాల అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా విద్యార్థిని గంగోత్రి మంత్రి వద్దకు వెళ్లి 'మాది బీద కుటుంబం, మా అమ్మ ఆరోగ్యం కూడా బాగా లేదు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. నేను చదువుకుంటానో లేదో'అని మంత్రి ముందు ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో చలించిపోయిన హరీశ్.. చదువుకు అయ్యే పూర్తి ఖర్చును నేనే భరిస్తాను అని హామీ ఇచ్చారు. బాగా చదువుకోవాలని విద్యార్థినికి సూచించారు. దీంతో ఆ విద్యార్థిని సంతోషం వ్యక్తం చేసింది.

వామ్మో..చిరుత!

- భయాందోళనలో తెయూ విద్యార్థులు
- గాలింపు చర్యలు చేపట్టిన అటవీ అధికారులు
- పీజీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ (తెయూ) క్యాంపస్ ఆవరణలో చిరుత పులి సంచారం కలకలం సృష్టించింది. శుక్రవారం ఉదయం క్యాంపస్‌లోని హాస్టల్ విద్యార్థులకు చిరుత కన్పించడంతో వారు భయాందోళన చెందారు. మార్నింగ్ వాక్ చేస్తున్న తనకు ఎంబీఏ కళాశాల సమీపంలో చిరుత కన్పించినట్లు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విద్యార్థి స్వామి.. రిజిస్ట్రార్ నసీమ్‌కు ఫిర్యాదు చేశాడు. స్పందించిన ఆయన కలెక్టర్, ఇందల్వాయి రేంజ్ అటవీ అధికారులు, డిచ్‌పల్లి పోలీసులకు సమాచారం అందించారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తూ క్యాంపస్‌లో నోటీసులు అంటించారు. ఇందల్వాయి అటవీ రేంజ్ అధికారి ఆసిఫుద్దీన్ నేతృత్వంలో సిబ్బంది చిరుత పాదముద్రలు, వెంట్రుకల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి వరకు ఎలాంటి ఆధారాలు లభించలేదని వారు తెలిపారు. విద్యార్థులు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. రెండు మూడు రోజుల్లో చిరుత పులిని పట్టుకొని తీరుతామని అటవీ అధికారులు పేర్కొన్నారు.

పీజీ పరీక్షలు వాయిదా

తెయూ పరిధిలో కొనసాగుతున్న పీజీ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. వర్సిటీ పరిధిలోని అన్ని అనుబంధ కళాశాలలకు ఇది వర్తిస్తుందని చెప్పారు. తిరిగి ఈ పరీక్షలను ఎప్పుడు నిర్వహించేది తర్వాత ప్రకటిస్తామని తెలిపారు.

పల్లెకొస్తున్న పట్నం

- బస్సులు, రైళ్లలో మొదలైన రద్దీ
- 20 లక్షల మందికి పైగా సొంత ఊళ్లకు
- ఆర్టీసీ బస్సుల్లో 50 శాతం అదనం
- ప్రైవేట్ బస్సుల్లో రెట్టింపు చార్జీలు
- ప్రత్యేక రైళ్లలోనూ అదనపు చార్జీలు
- విమాన ప్రయాణాలకు పెరిగిన డిమాండ్

సంక్రాంతి సందర్భంగా సొంతూళ్లకు వెళ్తున్న ప్రయాణికులతో కిక్కిరిసిన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్

సాక్షి, హైదరాబాద్: మహానగరం పల్లె బాట పట్టింది. సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్ వాసులు సొంత ఊళ్లకు బయలుదేరారు. దీంతో సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ, లింగంపల్లి ప్రధాన రైల్వేస్టేషన్‌లతో పాటు, మహాత్మా గాంధీ బస్‌స్టేషన్, జూబ్లీ బస్‌స్టేషన్లు శుక్రవారం ప్రయాణికుల రద్దీతో కిటకిటలాడాయి. రైళ్లు, బస్సులు కిక్కిరిసిపోయాయి. మరోవైపు పండుగ రద్దీని సొమ్ము చేసుకునేందుకు రైల్వే సహా, ఆర్టీసీ, ప్రైవేట్ ఆపరేటర్లు రంగంలోకి దిగారు. రైళ్లలో ప్రత్యేక చార్జీలను విధించారు. 200 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం వెళ్లే ఆర్టీసీ బస్సుల్లో 50 శాతం అదనపు చార్జీలు పెంచగా, రాష్ట్రంలోని (200 కి.మీ.లోపు) ప్రాంతాలకు నడిచే ప్రత్యేక బస్సుల్లో 10 నుంచి 20 శాతం వరకు చార్జీలను పెంచారు. ఇక ప్రైవేట్ బస్సులు యథావిధిగా దారి దోపిడీ సాగిస్తున్నాయి. సాధారణ రోజుల్లో వసూలు చేసే చార్జీలను రెట్టింపు చేశాయి. సంక్రాంతి సందర్భంగా సుమారు 20 లక్షల మందికిపైగా తెలుగు రాష్ట్రాల్లోని సొంత ఊళ్లకు వెళ్లనున్నారు. పండుగ రద్దీ విమానాలను సైతం తాకింది.

రైళ్లలో చార్జీలు 'ప్రత్యేక'ం..

సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ స్టేషన్‌లలో సంక్రాంతి రద్దీ ప్రారంభమైంది. సాధారణ రోజుల్లో రాకపోకలు సాగించే సుమారు 120 రైళ్లతో పాటు సంక్రాంతి రద్దీ దృష్ట్యా అదనపు రైళ్లను ఏర్పాటు చేశారు. మార్చి వరకు ఇవి అందుబాటులో ఉంటాయి. ఈ రైళ్లలోనూ వందల్లో వెయిటింగ్ లిస్టు దర్శనమిస్తోంది. ప్రత్యేక రైళ్లలో సాధారణ చార్జీలపైన 30 శాతం అదనపు బాదుడుకు తెరలేపారు. సికింద్రాబాద్ నుంచి విజయవాడకు థర్డ్ ఏసీ రూ.645. ప్రస్తుతం ఈ ప్రత్యేక చార్జీలు రూ.1,130 వరకు పెరిగాయి. అలాగే విశాఖకు స్లీపర్ రూ.395 ఉండగా ప్రత్యే రైళ్లలో రూ.500కు పెరిగింది. ఇలా అన్ని రూట్లలోనూ స్పెషల్ ట్రైన్స్‌లో చార్జీలు పెంచారు.

ఆర్టీసీ 50 శాతం అదనం...

సంక్రాంతి రద్దీని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ ఆర్టీసీ 3,500 రెగ్యులర్ బస్సులకు తోడు సుమారు 5,500 బస్సులను అదనంగా నడిపేందుకు ఏర్పాట్లు చేసింది. విజయవాడ, విశాఖ, రాజమండ్రి, తిరుపతి తదితర దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో 50 శాతం, తెలంగాణలోని వివిధ జిల్లాలకు రాకపోకలు సాగించే బస్సుల్లో 10 నుంచి 20 శాతం అదనపు చార్జీలు విధించారు. ఇప్పటికే అన్ని రెగ్యులర్ బస్సుల్లో సీట్లు రిజర్వ్ అయినట్లు అధికారులు తెలిపారు. ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉన్నాయని, ఇవి నగర శివార్ల నుంచే బయలుదేరేలా కార్యాచరణ చేపట్టినట్లు ఆర్టీసీ రంగారెడ్డి రీజనల్ మేనేజర్ వరప్రసాద్ తెలిపారు.

ప్రైవేట్ ఆపరేటర్ల దారి దోపిడీ..

హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రైవేట్ బస్సుల్లో చార్జీలు రెట్టింపయ్యాయి. ఒక్కో ట్రావెల్స్ సంస్థ ఒక్కో విధంగా చార్జీలు వసూలు చేస్తోంది. హైదరాబాద్ నుంచి తిరుపతికి సాధారణ రోజుల్లో రూ.750 వరకు ఉంటే ఇప్పుడు రూ.1,350కి పెంచారు. రాజమండ్రికి సాధారణంగా రూ.900 వరకు ఉంటుంది. ప్రస్తుతం కొన్ని ట్రావెల్స్ రూ.1,800, మరికొన్ని రూ.2,090 వరకు వసూలు చేస్తున్నాయి.

పలు రూట్లలో ప్రయాణికుల డిమాండ్ పెరగడంతో విమాన చార్జీలు సైతం పెరిగాయి. ఈ నెల 13న హైదరాబాద్ నుంచి విజయవాడకు రూ.3,000 నుంచి రూ.3,500 వరకు చార్జీ ఉండగా, తిరుపతికి రూ.4,600 వరకు ఉంది. ఇక రాజమండ్రికి రూ.11,339 వరకు చార్జీలు

ఫ్లైట్ జర్నీకి సైతం డిమాండ్...

న్నాయి. ఏ రోజుకు ఆ రోజు డిమాండ్ మేరకు చార్జీల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. సాధారణంగా హైదరాబాద్ నుంచి ప్రతి రోజు సుమారు 40 వేల మంది వివిధ ప్రాంతాలకు బయలుదేరుతుండగా, పండుగ రద్దీ దృష్ట్యా ఈ సంఖ్య మరో 5 వేలకు పెరిగినట్లు అధికారులు తెలిపారు.

ఒకేసారి రెండు అరుదైన చికిత్సలు

- 67 ఏళ్ల వ్యక్తికి కాలేయ మార్పిడి సహా కరోనరీ ఆర్టరీ సర్జరీలు
- అపోలో ఆస్పత్రిలో ఇది రెండో సర్జరీగా వైద్యుల వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కాలేయం పనితీరు పూర్తిగా దెబ్బతినడంతో పాటు తీవ్రమైన హృద్రోగ సమస్యతో బాధపడుతున్న 67 ఏళ్ల వ్యక్తికి అపోలో ఆస్పత్రి వైద్యులు ఒకేసారి 2 అరుదైన చికిత్సలను నిర్వహించారు. 20 మందితో కూడిన ఆస్పత్రి వైద్య బృందం 14 గంటలు శ్రమించి విజయవంతంగా చికిత్సను పూర్తిచేసింది. శుక్రవారం జూబ్లీ హిల్స్ అపోలో ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో కాలేయ మార్పిడి వైద్య నిపుణుడు డాక్టర్ మనీష్ సి.వర్మ, కన్సల్టెంట్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ నవీన్ పోలవరపు, కార్డియాలజిస్టులు డాక్టర్ మనోజ్ అగర్వాల్, కార్డియోథొరాసిస్ సర్జన్ డాక్టర్ సంజయ్ అగర్వాల్‌లు చికిత్స వివరాలు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన శివప్రసాదరావు(67) అక్టోబర్‌లో ప్రమాదవశాత్తు కిందపడ్డారు. చికిత్స కోసం అపోలో ఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్య పరీక్షల్లో లివర్ సిరోసిస్(కాలేయ కేన్సర్)తోపాటు గుండెకు కుడివైపు ఉన్న రక్తనాళాలు 90 శాతం పూడిపోయి రక్త సరఫరాకు అడ్డంకిగా మారింది. కాగా, తన కాలేయంలో కొంతభాగాన్ని తండ్రికి దానం చేసేందుకు కుమార్తె రోహిణి ముందు కొచ్చింది. వయసురీత్యా 2 వేర్వేరు క్లిష్టమైన చికిత్సలు చేయడం రోగి ప్రాణాలకు సురక్షితం కాదని ఒకేసారి 2 చికిత్సలు చేయాలని నిర్ణయించారు.

20 మంది వైద్యులు.. 14 గంటలు..

డిసెంబర్ 6న కాలేయ, కార్డియాలజీ విభాగాలకు చెందిన 20 మంది వైద్యులు 14 గంటలు శ్రమించి ఒకే సమయంలో కాలేయ మార్పిడి చికిత్స, ఆర్టరీ చికిత్సలను విజయవంతంగా చేశారు. ముందు కార్డియాక్ బైపాస్ గ్రాఫ్ట్ సర్జరీ చేశారు. తర్వాత గుండె నుంచి ఇతర శరీర భాగాలకు రక్త సరఫరాకు అడ్డంకిగా మారిన రక్తనాళాలను తెరిపించారు. అనంతరం కాలేయాన్ని అమర్చారు. ప్రస్తుతం దాత, స్వీకర్తలిద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు ప్రకటించారు. ఇలాంటి చికిత్సలు చేయడం అపోలో ఆస్పత్రిలో ఇది రెండోది.

లక్షకు చేరుకున్న 'ఫాస్టాగ్'

- పుంజుకున్న ఎలక్ట్రానిక్ టోల్ చెల్లింపు విధానం
- శుక్రవారం నాటికి 1.06 లక్షల ట్యాగ్స్ విక్రయం
- వాహనాల రద్దీని బట్టి నగదు చెల్లింపు లేన్ల సంఖ్య పెంచే యోచన

సాక్షి, హైదరాబాద్: జాతీయ రహదారులపై సంక్రాంతి రద్దీ నేపథ్యంలో ఫాస్టాగ్ కొనుగోళ్లు ఊపందుకున్నాయి. శుక్రవారం నాటికి రాష్ట్రంలో ఫాస్టాగ్ తీసుకున్న వాహనాల సంఖ్య లక్ష మార్కును దాటింది. శుక్రవారం రాత్రి వరకు అమ్ముడైన మొత్తం ఫాస్టాగ్‌ల సంఖ్య 1.06 లక్షలకు చేరుకుంది. గత ఐదారు రోజులుగా క్రమంగా వాటి సంఖ్య పెరుగుతూ లక్ష మార్కును దాటడం విశేషం. శుక్రవారం నుంచి సంక్రాంతి పండగ రద్దీ మొదలైన నేపథ్యంలో జాతీయ రహదారులపై టోల్‌ప్లాజాల వద్ద టోల్ చెల్లింపునకు క్యూలు ఏర్పడకుండా కొంత ఊరట కలిగించే విషయమిది. వచ్చే నాలుగు రోజుల్లో నగరం నుంచి సొంతూళ్లకు దాదాపు 25 లక్షల మందికిపైగా వెళ్లనున్నారు. వీరిలో సొంత వాహనాల్లో ప్రయాణించే వారూ ఎక్కువే. రాష్ట్రంలోని 17 ప్రాంతాల్లో ఉన్న టోల్‌ప్లాజాల వద్ద రుసుము చెల్లించేవారితో రద్దీ ఏర్పడనుంది. ప్రస్తుతం నగదు రూపంలో టోల్ చెల్లించేందుకు 25 శాతం లేన్లు అందుబాటులో ఉన్నాయి. 75 శాతం లేన్లలో ఫాస్టాగ్ వాహనాలకే అనుమతి ఉంది. ఎలక్ట్రానిక్ టోల్ చెల్లింపు విధానం ప్రారంభించిన కొత్తలో, నగదు చెల్లించే వాహనాల సంఖ్యనే ఎక్కువగా ఉండటం, వాటికి కేటాయించిన లేన్ల సంఖ్య తక్కువగా ఉండటంతో కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయేవి. డిసెంబర్ చివరి నాటికి వీటి సంఖ్య సగం సగంగా మారింది. ఇప్పుడు, టోల్ గేట్ల నుంచి వెళ్లే మొత్తం వాహనాల్లో దాదాపు 51 శాతం వాహనాలు ఫాస్టాగ్ ఉన్నవే ఉంటున్నాయి. టోల్ రూపంలో వసూలవుతున్న మొత్తంలో 63 శాతం ఫాస్టాగ్ ఉన్న వాహనాల నుంచే వస్తోంది.

రద్దీ అధికంగా ఉంటే మరో లేన్....

రాష్ట్రంలో ఫాస్టాగ్ తీసుకున్న వాహనాల సంఖ్య లక్షను మించినందున సంక్రాంతి ప్రయాణ సమయాల్లో పెద్దగా ఇబ్బంది ఉండకపోవచ్చని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు భావిస్తున్నారు. వచ్చే ఐదారు రోజుల్లో వాహనాల సంఖ్య ఎక్కువగా ఉండనుంది. 14 తేదీ వరకు హైబ్రీడ్ విధానం అమలులో ఉండనుంది. అంటే, 25 శాతం లేన్లు నగదు చెల్లింపులకు ఉంటాయి. ఒకవేళ ఫాస్టాగ్ లేని వాహనాల సంఖ్య అధికంగా ఉండి, నగదు చెల్లింపుకు ఎక్కువ సమయం పట్టేలా ఉంటే అదనంగా మరో లేన్‌ను కేటాయించే విషయాన్ని పరిశీలిస్తామని ఎన్‌హెచ్‌ఏఐ ప్రాంతీయాధికారి కృష్ణప్రసాద్ వెల్లడించారు. ఇక 15వ తేదీ నుంచి నగదు చెల్లింపులకు ఒక్క లేన్ మాత్రమే కేటాయించనున్నారు. తర్వాత కూడా నగదు లేన్ వద్ద రద్దీ అధికంగా ఉంటే కేంద్రం నుంచి అనుమతి తీసుకుంటామని కృష్ణప్రసాద్ పేర్కొన్నారు.

పండగ తర్వాతే...

రాష్ట్ర రహదారులపై సంక్రాంతి తర్వాతే ఫాస్టాగ్ విధానం ప్రారంభించనున్నారు. హైదరాబాద్–రామగుండం రాజీవ్ రహదారిపై 3 ప్రాంతాల్లో ఉన్న టోల్‌ప్లాజాల వద్ద జనవరి 20–25 మధ్య ఎలక్ట్రానిక్ టోల్ చెల్లింపు విధానం ప్రారంభించాలని శుక్రవారం ఆయా రోడ్లను నిర్వహించే కాంట్రాక్టర్లతో నిర్వహించిన సమావేశంలో నిర్ణయించారు. ఈ మార్గంలో మూడు ప్లాజాలకు సంబంధించి 28 లేన్లున్నాయి. వీటిల్లో నగదు చెల్లింపునకు ఒక్కో ప్లాజా వద్ద రెండు చొప్పున లేన్లను కేటాయించాలని నిర్ణయించారు. ఇప్పటికే సెన్సర్ ఎక్విప్‌మెంట్ బిగించే పనులు ప్రారంభించారు. ఇక నార్కెట్‌పల్లి–అద్దంకి మార్గంలో ఉన్న ప్లాజా వద్ద ఫిబ్రవరి ఒకటి నుంచి ఈ విధానం మొదలుకానుంది. ఇక్కడ ఏడు లేన్లు ఉండగా 5 ఫాస్టాగ్‌కు, 2 నగదు చెల్లించేందుకు కేటాయించనున్నారు. పరికరాల బిగింపునకు అయ్యే వ్యయాన్ని కాంట్రాక్టు సంస్థలే భరించనున్నాయి. ఆ ఖర్చును ప్రభుత్వమే భరించాలని కాంట్రాక్టు సంస్థలు డిమాండ్ చేయగా, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మ అంగీకరించలేదు. తాము చేయలేమని కాంట్రాక్టర్లు పేర్కొనగా, రద్దీ వేళ తాము చేతులెత్తేస్తే ఎదురయ్యే పరిణామాలకు కాంట్రాక్టర్లే బాధ్యత తీసుకోవాలని సునీల్‌శర్మ తేల్చిచెప్పటంతో అంగీకరించినట్టు తెలిసింది.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సోమేశ్‌కుమార్ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో శ్రీవారి లడ్డూ ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. –తిరుమల

ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులే

విద్యాశాఖ కార్యదర్శి బి.జనార్దన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయులంతా నిత్య విద్యార్థులేనని, ప్రతిరోజు తమ సబ్జెక్టుకు సంబంధించిన కొత్త విషయాన్ని నేర్చుకుంటూ ఉండాలని విద్యాశాఖ కార్యదర్శి బి.జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ), అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ సంయుక్తాధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలల టీచర్లకు ఇంగ్లిషు భాషా ప్రావీణ్యాన్ని నేర్పించేందుకు చేపట్టిన ఇంగ్లిష్ లాంగ్వేజ్ ప్రొఫిషియెన్సీ కోర్సు'శిక్షణ ముగింపు కార్యక్రమం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు. ఇంగ్లిష్ టీచర్లకు ప్రత్యేక శిక్షణతో పాటు ఆన్‌లైన్‌లో నిర్వహించే శిక్షణ కార్యక్రమం ఏర్పాట్లను, శిక్షణ మెటీరియల్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ బోధనలో నాణ్యత పెంచుకోవడానికి టీచర్లు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని టీచర్లు దీన్ని సద్వినియోగపరచుకోవాలని, తద్వారా పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి డైరెక్టర్ బి.శేషుకుమారి, అజీమ్ ప్రేమ్ జీ యూనివర్సిటీ ప్రొఫెసర్లు అరుణ్‌నాయక్, నిషా పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com